ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
రాజమహేంద్రవరం

fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

13-2-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 13 పేజీలు: 8+4 వెల: 6.50

రంగంలోకి కొత్త రాఫెల్ విమానాలు

ట్రంప్- నెతన్యాహు కీలక భేటీ

5లో

# మండలికి ఓకే అసెంబ్లీకి 'నో'



విపక్ష హోదా ఇవ్వనందుకు వైసిపి నిరసన

మండలిలో పోరాడుతాం: జగన్

**విజయవాడ,ఫిబ్రవరి 12,ప్రభాతవార్తప్రతినిధి:** శాసనసభలో వైసిపికి చట్టసభల నిబంధనలను అనుసరించి విపక్షహోదా ఇవ్వాల్సి ఉందని మాజీ సీఎం జగన్ అన్నారు.ఇది రాజ్యాంగబద్ధమైన అంశం కాబట్టి ఆ దిశలో ఆందోళన చేస్తున్నామన్నారు.అయితే ఈ విషయంపై ఎందుకు చట్టపరంగా వ్యవహరించాల్సిన వాళ్ళు,ఇతరులు మాట్లాడుతున్నారని ఆయన ప్రశ్నించారు.వ్యవస్థను నాశనం చేస్తున్నారు.ప్రశ్నించే అవకాశం లేకుండా సభలో మనకు విపక్ష హోదా ఇవ్వడం లేదన్నారు.ఏపీ అసెంబ్లీలో వైసీపీకి విపక్ష హోదా ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ.. ఈసారి బడ్జెట్ సమావేశాల్లోనూ గవర్నర్ ప్రసంగం సందర్భంగా అసెంబ్లీకి హాజరైన జగన్‌ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు.. బాయ్ కాట్ చేసి వెళ్లిపోయారు. అనంతరం అసెంబ్లీ బీఏసీ సమావేశానికి కూడా జగన్ హాజరు కాలేదు. గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన పార్టీ శాసనసభాపక్ష సమావేశంలో పార్టీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో జగన్ భేటీ అయ్యారు. తాజా పరిణామాలపై వారితో చర్చించారు. అనంతరం కీలక నిర్ణయం ప్రక టించారు. వైఎస్సార్సీపీకి విపక్ష పార్టీ హోదా ఇవ్వనందుకు నిరసనగా ఈసారి కూడా >>2



వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్షలో సీఎం చంద్రబాబు

ప్రాయోజిత పథకాలకు అదనపు నిధులు సాధించాలి

గరిష్ట కేటాయింపులతో ప్రణాళికలు

మరిన్ని ఎలక్ట్రిక్ బస్సులు కూడా అడగాలి

# కేంద్రం నుంచి మరిన్ని నిధులు

**విజయవాడ, ఫిబ్రవరి 12,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర బడ్జెట్‌లో 2026 – 27 ఏపీలో కేటాయించిన రేర్ ఎర్త్ కారిడార్ సహా వివిధ ప్రాజెక్టులను రాష్ట్రంలో ఏర్పాటు చేసే అంశంపై అత్యంత సమన్వయంతో వ్యవహరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు. కేంద్రం మంజూరు చేసిన ప్రాజెక్టులతో పాటు దేశవ్యాప్తంగా ప్రకటించిన వాటిని ఏపీలో ఏర్పాటు చేసుకునే అంశంపై ప్రతిపాదనల్ని సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. కేంద్ర ప్రాయోజిత పథకాలు, వివిధ కార్యక్రమాలను అనుసంధానం చేసుకుంటూ అదనపు నిధులు సాధించాలని ముఖ్యమంత్రి సూచించారు. క్యాంపు కార్యాలయంలో గురువారం కేంద్ర బడ్జెట్ లో రాష్ట్రానికి చేసిన కేటాయింపులపై వివిధ శాఖల ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. కేంద్రం నుంచి ఎక్కువ నిధులు రాబట్టుకునేలా కార్యాచరణ చేపట్టాలని సూచించారు. గత పాలకులు కేంద్ర ప్రాయోజిత పథకాల నిధులు ఖర్చు పెట్టకుండా పథకాలను నిర్వీర్యం చేశారని యుటిలిటీ సర్టిఫికెట్ల విషయంలో సమస్యలు తలెత్తాయన్నారు. ప్రభుత్వ శాఖలు అన్నీ వివిధ పథకాలకు కేటాయించిన నిధుల్ని ఖర్చు చేయగలిగితే అదనపు నిధుల్ని కూడా డ్రా చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. వచ్చే బడ్జెట్‌లోగా గరిష్ట కేటాయింపులు చేసుకునేలా ప్రణాళికలు ఉండాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచనలు చేశారు. ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన చాలెంజ్ విధానంలోనూ మరికొన్ని నిధులు సాధించుకునేలా కార్యాచరణ చేసుకోవాలన్నారు. కేంద్రం ప్రకటించిన రేర్ ఎర్త్ కారిడార్ ను శ్రీకాకుళం విజయనగరంవిశాఖ జిల్లాల్లో ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. వీటితో పాటు ఇతర విలువైన ఖనిజాలకు సంబంధించి వ్యాల్యూ చైన్ పరిశ్రమల్ని ఏర్పాటు చేసే ఆలోచన చేయాలన్నారు. ఈస్ట్ కోస్ట్ ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటులోనూ తీరప్రాంతంలో ఉన్న మూలపేట నుంచి దిగువున కృష్ణపట్నం వరకూ ప్రతిపాదన చేయాలన్నారు. కంటైనర్ మాన్యుఫాక్చరింగ్, ఎక్విప్మెంట్ మాన్యుఫాక్చరింగ్ ప్రాజెక్టులను త్వరితగతిన ఏర్పాటు చేసుకునేలా ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. మెగాటెక్స్‌టైల్ పార్కును పలనాడు ప్రాంతంలోనూ, స్పోర్ట్ మాన్యుఫాక్చరింగ్ హబ్ తిరుపతిలో ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలన్నారు. ఇండియా సెమికండక్టర్ మిషన్ 2.0 లో భాగంగా సెమీ కండక్టర్ డిజైన్ తదితర ప్రాజెక్టులను అమరావతిలో ఏర్పాటు చేసేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. వీటితో పాటు రాజధాని ప్రాంతంలోని హెల్త్ సిటీలో బయోడిజైన్, మెడ్ టెక్ పార్క్, బయో ఫార్మా శక్తి మిషన్ లాంటి ఎకోసిస్టం వస్తుందన్నారు. మెడికల్ టూరిజం హీల్ ఇన్ ఏపీ అన్న విధానంలో అమరావతిలో ప్రాజెక్టులు >>2

# బంగ్లా ఎన్నికలు హింసాత్మకం

**ఢాకా, ఫిబ్రవరి 12:** ఏడాదిన్నర నుంచి తీవ్ర రాజకీయ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న బంగ్లాదేశ్ లో గురువారం సార్వత్రిక ఎన్నికల పోలింగ్ హింసాత్మక సంఘటనల మధ్య జరిగింది. ఈ 13వ సార్వత్రిక ఎన్నికల్లో బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ ముఖ్య సలహాదారు మహ్మద్ యూనస్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. దేశ రాజధాని ఢాకాలో ఆయన ఓటు వేశారు. ప్రజలు కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకుంటున్నారు. 2024 ఆగస్టులో విద్యార్థుల ఉద్యమంతో అవామీ లీగ్ నేతృత్వంలోని హసీనా ప్రభుత్వం పడిపోయింది. అప్పటి నుంచి బంగ్లాదేశ్ పాలనను మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం పర్యవేక్షిస్తూ వస్తున్నది. ఇప్పుడు ఈ ఎన్నికలతో ఢాకాలో కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. మొత్తం 299 పార్లమెంటు స్థానాలకు జరుగుతున్న ఈ ఎన్నికల్లో వివిధ పార్టీలకు చెందిన 1,981 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. దాదాపు 12.7 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్‌పై ప్రభుత్వం నిషేధం విధించడంతో ఈసారి ప్రధాన పోటీ బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ (బీఎన్‌పీ), షఫీకుర్ రెహమాన్ నేతృత్వంలోని జమాత్‌ఎఇస్లామీ కూటమి మధ్యే ఉంది. విద్యార్థుల ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన నేషనల్ సిటిజన్ పార్టీ కూడా జమాతే కూటమిలో ఉంది. ఈ ఎన్నికలతోపాటు కీలక రాజ్యాంగ సంస్కరణలపైనా రిఫరెండం జరగనుంది. హసీనా నాయకత్వంలోని అవామీ లీగ్ పార్టీ లేకుండా ఎన్నికలు జరగడం ఇదే తొలిసారి. హసీనా ప్రస్తుతం భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. హసీనా ప్రభుత్వం కుప్పకూలిన తర్వాత బంగ్లాదేశ్‌లో హిందువులు లక్ష్యంగా దాడులు జరుగుతున్నాయి. ఈ సార్వత్రిక ఎన్నికల్లో మతతత్వ పార్టీ జమాత్‌ఎఇస్లామీ నేతృత్వంలోని కూటమి అధికారంలోకి వస్తే మైనారిటీలపై దాడులు మరింతగా పెరిగే అవకాశం ఉందని హిందువులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.దేశవ్యాప్తంగా పలు పోలింగ్ కేంద్రాల వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా, ఖుల్నా జిల్లాలో జరిగిన ఘర్షణలో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) నేత మొహిబుజ్జమాన్ కోచీ మరణించారు.ఈ ఘటనలతో దేశంలో శాంతిభద్రతల పరిస్థితిపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఖుల్నాలోని అలియా మదరసా పోలింగ్ కేంద్రం వద్ద బీఎన్‌పీ, జమాత్ ఏఇస్లామీ మద్దతుదారుల మధ్య ఘర్షణజరిగింది. జమాత్‌తరపున ప్రచారం చేస్తున్న మదరసా ప్రిన్సిపాల్‌ను మొహిబుజ్జమాన్ కోచీ అడ్డుకునే ప్రయత్నంలో ఈ మరణం సంభవించింది.



ఢాకాలో ఓటు వేసిన మహ్మద్ యూనస్



# కార్మిక సమ్మె ప్రశాంతం

నిలిచిన ఉత్పత్తిరంగ కార్యకలాపాలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన లేబర్ కోడ్‌లు, ఇండో అమెరికా ట్రేడ్‌డీల్‌తో వ్యవసాయ రంగానికి తీరని నష్టం వాటిల్లుతోందని, ఎన్డీయే ప్రభుత్వం కార్పొరేట్‌శక్తులకే అనుకూలంగా వ్యవహరిస్తోందని పేర్కొంటూ దేశవ్యాప్తంగా 13 ట్రేడ్‌యూనియన్లు ఇచ్చిన నిరసన పిలుపు మేరకు ప్రశాంతంగా ముగిసింది. సుమారు 30 కోట్లమందికిపైగా రైతులు, కార్మికులు, ట్రేడ్‌యూనియన్ కార్యకర్తలు పాల్గొన్న ఈ సమ్మె ప్రశాంతంగానే >>2

# యువతకు ఉద్యోగాలే లక్ష్యం

ఐదు కంపెనీల ద్వారా 65వేల మందికి ఉపాధి కల్పన

విశ్వసనీయత ఉన్న కంపెనీలకే రూ.99పైసలకు భూములు

ఎంఒయులు కుదుర్చుకొన్న కంపెనీలు చాలా ఉన్నాయి: మంత్రి లోకేష్

పరిశ్రమలకు భూకేటాయింపులపై మండలిలో వాడివేడి చర్చ



గురువారం శాసనమండలిలో బొత్స సత్యనారాయణ, మంత్రి లోకేష్

**విజయవాడ,ఫిబ్రవరి12,ప్రభాతవార్తప్రతినిధి:** యువతకు ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో మేం పనిచేస్తున్నాం. ఏపీకి పరిశ్రమలు రాకూడదనే లక్ష్యంతో వైసీపీ ఉంది. విశ్వసనీయత ఉన్న కంపెనీలకే రూ.99 పైసలకు భూములు కేటాయించాం. ఐదు కంపెనీల ద్వారా 65వేల మందికి ఉద్యోగాలు రానున్నాయి. భూముల కేటాయింపుల్లో మేం ఎక్కడా లాలూచీ పడాల్సిన అవసరం లేదు. విమర్శించాలనుకుంటే కప్ టీ గురించి నన్ను విమర్శించవచ్చు. ఒక కప్పు కాఫీ కంటే నేను వారి వద్ద ఎక్కువ తీసుకుని ఉంటే నిరూపించాలి. అప్పుడు ఏ చర్యకైనా సిద్ధమని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. పరిశ్రమలకు 99 పైసలకే భూ కేటాయింపులపై ప్రశ్నోత్తరాల సమయంలో మండలిలో వాడివేడి చర్చ జరిగింది. వైసీపీ సభ్యుల ఆరోపణలకు మంత్రి ధీటుగా సమాధానం ఇచ్చారు. గత 20 నెలల కాలంలో పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు, ఇతర సంస్థలకు 99 పైసలకు కేటాయించిన భూముల వివరాలు, కుదుర్చుకున్న ఎంవోయీలు, పరిశ్రమల వారీగా భూముల కేటాయింపులు, ధరల వివరాలపై శాసన మండలిలో వైసీపీ సభ్యులు తూమాటి మాధవరావు, వరుదు కల్యాణి, డా.పండుల రవీంద్రబాబు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మా ట్లాడుతూ రాష్ట్రంలో 5 కంపెనీలకు 99 పైసలకు భూమి కేటా యించాం. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, కాగ్నిజెంట్, ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్, రహేజా, మదర్సన్ ఇంటర్నేషనల్ కంపెనీలకు 99 పైసలకే మొత్తం భూములు కేటాయించాం. ఏయే కంపెనీ ఎన్ని ఉద్యోగాలు కల్పించనుందో కూడా ప్రభుత్వ సమాధానంలో పొందుపర్చాం. కాగ్నిజెంట్ కు భూమి కేటాయించినప్పుడు 8వేల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు. కానీ భూమిపూజ సమయంలో 25వేల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పడం జరిగింది. ఎనర్జీ, ఇండస్ట్రీస్ అండ్ కామర్స్, ఐఎన్ఐ, ఐటీ అండ్ కామర్స్, ఏపీసీఆర్డీయే, టూరిజం, ఫుడ్ ప్రాసెసింగ్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్ మెంట్, టెక్స్ టైల్, ఎడ్యుకేషన్, హెల్త్ పాలసీల కింద ఆయా సంస్థలకు భూములు కేటాయించడం జరిగింది. ఐదు కంపెనీలకు మాత్రమే 99 >>2

## విద్యాసంస్థల్లో వసతుల ప్రతిపాదనలు

త్వరలో పనులు పూర్తి: మంత్రి లోకేశ్

**విజయవాడ, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలోని పలు విద్యాసంస్థల్లో వసతుల కోసం ఆర్థికశాఖ ప్రతిపాదనలు పంపామని త్వరలోనే పనులు పూర్తిచేస్తామని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రులు సమాధానమిచ్చారు. పుట్టపర్తిలో ట్రిపుల్ ఐటీ ఏర్పాటు, పలు కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని అక్కడి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి కోరారు. దీనికి మంత్రి లోకేశ్ సమాధానమిస్తూ పుట్టపర్తిలో ట్రిపుల్ ఐటీ ప్రతిపాదన లేదని ఈ అంశాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. తిరుపతిలో భక్తుల రాక పెరిగినందున తాగునీరు మరింత అవసరమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. గాలేరు నగరి, హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా నీరు అందించే విషయాన్ని పరిశీలించాలని ఆయన కోరారు. దీనికి మంత్రి నిమ్మల రామానాయుడు సమాధాన >>2



సంక్రాంతి లక్కీ డ్రా కేసు

# అంబటికి 14 రోజులు రిమాండ్

**విజయవాడ.ఫిబ్రవరి 12,ప్రభాతవార్తప్రతినిధి:** సంక్రాంతి లక్కీ డ్రా కేసులో మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత అంబటి రాంబాబుకు గుంటూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ కోర్టు ఆయనకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. 2023లో సత్తెనపల్లిలో సంక్రాంతి సంబరాల సందర్భంగా అంబటి లక్కీ డ్రా నిర్వహించారు. ఈ సందర్భంగా వాలంటీర్ల ద్వారా పింఛనుదారుల నుంచి రూ.200 చొప్పున అక్రమంగా వసూలు చేసి, వారికి బలవంతంగా లాటరీ టికెట్లు అంటగట్టారన్న ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంపై జనసేన పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు కోర్టులో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం మరో కేసులో రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న అంబటిని, పోలీసులు పీటీ వారెంట్‌పై ఇవాళ గుంటూరు కోర్టులో హాజరుపరిచారు. కేసు వివరాలను పరిశీలించిన న్యాయమూర్తి ఎం. కుముదిని, ఆయనకు 14 రోజుల రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు.కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో అంబటిని తిరిగి రాజమండ్రి జైలుకు తరలించారు.

# విపక్షాల ప్రశ్నలకు సమాధానం చెప్పలేరా?



మీడియాతో కౌన్సిల్ విపక్షనేత బొత్స

**విజయవాడ,ఫిబ్రవరి 12,ప్రభాతవార్తప్రతినిధి:** శాసనమండలిలో ప్రతిపక్ష పార్టీ అడుగుతున్న ప్రశ్నలకు కనీస సమాధానం కూడా చెప్పలేని పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఉందని శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆరోపించారు. కార్పొరేట్ సంస్థలకు 99 పైసలకే భూములు కేటాయిస్తున్న అంశంపై శాసనమండలిలో ప్రశ్నిస్తే ప్రభుత్వం నుంచి సరైన సమాధానం రాలేదన్నారు. అసెంబ్లీ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడిన ఆయన, కీలక అంశాలపై ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా స్పష్టత ఇవ్వకుండా తప్పించుకుంటోందని ఆరోపించారు.వైఎస్సార్ హయాంలోనే విశాఖపట్నంలో ఐటీ రంగాన్ని అభివృద్ధి చేశామని, అప్పుడే ఆదానీ డేటా సెంటర్ కూడా రాష్ట్రానికి వచ్చిందని గుర్తుచేశారు. అలాంటప్పుడు ఇప్పుడు కూటమి ప్రభుత్వం 99 పైసలకే భూములు ఇస్తామంటూ కంపెనీలకు లాలూచీ పడటం వెనుక ఏం ఉందో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులు వేల కోట్ల విలువైన భూములు కబ్జా చేశారన్న ఆరోపణలపై కూడా ప్రభుత్వం సమాధానం ఇవ్వలేదని అన్నారు.ఒకవైపు 5 వేల కోట్ల భూములున్నాయన్న విమర్శలు వస్తే, గీతం సంస్థ మాత్రం వెయ్యి కోట్ల భూములే తమ వద్ద ఉన్నాయని చెబుతోందని, అసలు నిజం ఏంటో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. పెన్షన్ల అంశంపై ప్రశ్నిస్తే ప్రభుత్వం నుంచి సమాధానం లేదని, గవర్నర్ ప్రసంగం సందర్భంగా అధికారపార్టీ సభ్యులు డప్పులు కొట్టడం తప్ప ప్రజల సమస్యలపై మాట్లాడలేదని విమ ర్శించారు. ప్రతి ఒక్కరికీ తల్లికి వందనం కింద 15 వేల రూపాయలు ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం, వాస్తవంగా అందరికీ అందించిందా అని ప్రశ్నిస్తే మౌనం వహించిందని >>2



# చట్టసభలపై చులకన వద్దు

సభ్యులకు సూచించిన అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు

**విజయవాడ.ఫిబ్రవరి 12,ప్రభాతవార్తప్రతినిధి:** చట్టసభలంటే చులకన భావం కలగకూడదని ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు శాసనసభలో వ్యాఖ్యానించారు. అసెంబ్లీ సమావేశాలు రెండవ రోజుకు చేరుకున్నాయి.ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ 16వ శాసనసభ 5వ బడ్జెట్ సమావేశాల తొలిరోజే సభలో భావోద్వేగ వాతావరణం నెలకొనడం ఆవేదన కలిగించిందని స్పీకరు అన్నారు. నిన్న గవర్నర్ ప్రసంగం సమయంలో చోటుచేసుకున్న పరిణామాలపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ సభ్యుల ప్రవర్తన వల్ల సభా గౌరవం దెబ్బతింటోందని వ్యాఖ్యానించారు. యువతకు, విద్యార్థులకు చట్టసభల పనితీరుపై అవగాహన కల్పించాలనే సదుద్దేశంతో లోకేష్ మాక్ అసెంబ్లీ అనే కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా ఎంతో గుర్తింపు లభించిందని, ఇతర రాష్ట్రాల ప్రతినిధులు సైతం దీన్ని ప్రశంసించారని స్పీకర్ గుర్తుచేశారు. 'నిన్న గవర్నర్ >>2

## తెలుగు భాషపై ప్రత్యేక చర్చ జరపండి

స్పీకర్‌కు వినతిపత్రం ఇచ్చిన అధికార భాషా సంఘం అధ్యక్షుడు

**విజయవాడ.ఫిబ్రవరి 12,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమా వేశాల సందర్భంగా ఒక రోజంతా తెలుగు భాషా అమలు తెలుగు భాషాభివృద్ధి అనే అంశంపై సభ్యులందరితో ప్రత్యేక చర్చ నిర్వహించాలని మం డలి వెంకటకృష్ణారావు అధికార భాషా సంఘం అధ్యక్షులు పి. త్రివిక్రమరావు (విక్రమ్‌పూల) కోరారు. గురువారం అసెంబ్లీలోని స్పీకర్ ఛాంబర్‌లో చింతకాయల అయ్యన్నపాత్రుడుని కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా త్రివిక్రమరావు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ శాసనసభా పతిగా అయ్యన్నపాత్రుడు ఎంతో హుందగా, ప్రజాస్వామ్య విలువలతో సభను నడిపిస్తున్న తీరు ఒక నూతన అధ్యాయమని ప్రశంసించారు. తెలుగు భాషాభిమానిగా మాతృభాష పరిరక్షణకు ఆయన చేస్తున్న కృషి అనన్యసామాన్యమని కొనియాడారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో ఒక రోజును తెలుగు భాషా అంశంపై చర్చకు కేటాయించి, సభలో సభ్యులు అందించే విలువైనసలహాలను పరిగణనలోకి తీసుకుని,వాటిని అమలుచేసేలా రాష్ట్ర >>2

వార్త, రాజమహేంద్రవరం, శుక్రవారం 13, ఫిబ్రవరి 2026



గురువారం తిరువూరు నియోజకవర్గ సమస్యలపై సిఎం చంద్రబాబుకు వినతి పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే కొలికపూడి

# అన్ని సమస్యలను పరిష్కరించుకుందాం: సిఎం చంద్రబాబు

## సిఎంను కలిసిన తిరువూరు శాసనసభ్యుడు కొలికపూడి

**విజయవాడ.ఫిబ్రవరి 12.ప్రభాతవార్తప్రతినిధి:** సమస్యలపై మీ తపన,ఆందోళన నాకు తెలుసు, అన్నింటిని పరిష్కరించుకుందామని సీఎం చంద్రబాబు తిరువూరు ఎంఎల్ఏ కొలకపూడి శ్రీనివాసరావుతో వ్యాఖ్యానించారు.వివాదస్పద అంశాలకు దూరంగా ఉండండి. ఏ అంశమైన తన దృష్టికి తేవాలన్నారు. తిరువూరు నియోజకవర్గానికి సంబంధించిన పలు కీలక సమస్యలు, అభివృద్ధి అవసరాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించి, త్వరలోనే అవసరమైన నిధులు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుకు హామీ ఇచ్చారు. అసెంబ్లీ సమావేశం ముగిసిన అనంతరం ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కలిసి, తిరువూరు నియోజకవర్గంలో నెలకొన్న ప్రధాన సమస్యలను వివరించారు.ముఖ్యంగా గంపలగూడెం మండలం వినగడప కట్టలేరు వంతెన నిర్మాణానికి అవసరమైన నిధుల అంశాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. వంతెన నిర్మాణం పూర్తయితే తిరువూరు ప్రాంత ప్రజలకు రాకపోకలు మరింత సులభమవుతాయని, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు, విద్యార్థుల ప్రయా ణాలకు, అత్యవసర సేవలకు కీలకంగా మారుతుందని ఎమ్మెల్యే వివరించారు. అలాగే నియోజకవర్గంలో రహదారులు, తాగునీరు, సాగునీరు, ఇతర మౌలిక వసతులకు సంబంధించిన అంశాలను కూడా సమగ్రంగా వివరించారు. ఈ అంశాలపై స్పందించిన ముఖ్యమంత్రి, తిరువూరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. వినగడప కట్టలేరు వంతెనతో పాటు ఇతర అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు త్వరలో మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలు దశలవారీగా పరిష్కరించి, నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం భరోసా ఇచ్చారు.

# యువతకు ఉద్యోగాలే లక్ష్యం

>> పైసలకు భూములు కేటాయించాం.

**పరిశ్రమలకు భూములు కేటాయింపుపై వాడీవేడి చర్చ..**

విశాఖలో కోట్లాది రూపాయల విలువైన భూములను 99 పైసలకే ప్రైవేటు సంస్థలకు, రియల్ ఎస్టేట్ కంపెనీలకు ఎలా కేటాయిస్తారంటూ వైసీపీ పక్ష నేత బొత్స సత్యనారాయణ, ఇతర వైసీపీ సభ్యులు మాధవరావు, వరుదు కల్యాణి ప్రశ్నించారు. దీనిపై మంత్రి నారా లోకేష్ ధీటుగా సమాధానం ఇచ్చారు. మంత్రి స్పందిస్తూ.. హైదరాబాద్ లో రహేజా మైండ్ స్పేస్ కు ఆనాడు 97 ఎకరాలను చంద్రబాబు గారు కేటాయించారు. వారు 21 బిల్డింగ్ ల ద్వారా 10వేల మిలియన్ స్క్వేర్ ఫీట్ నిర్మాణం చేశారు. నేడు ఒక్క మైండ్ స్పేస్ లోనే ఐటీ రంగంలో లక్ష మంది పనిచేస్తున్నారు. అనేక ప్రముఖ కంపెనీలు అక్కడ కొలువుదీరాయి. రహేజా, ఏఎన్ఎస్ఆర్ సంస్థలు జీసీసీలకు అవసరమైన భవనాలు నిర్మించి అద్దెకు ఇవ్వడం జరుగుతుంది. వారు ఎకోసిస్టమ్ ను అభివృద్ధి చేస్తారు. వారికి పారదర్శకంగా భూములు కేటాయించాం. బెంగళూరులో ఏఎన్ ఎస్ఆర్ సంస్థ నిర్మించిన జీసీసీ సెంటర్ ను నేను స్వయంగా చూశా. ఈ ఒక్క కంపెనీ 150 జీసీసీలను నిర్మించడం జరిగింది. సుమారు లక్షా 40వేల మంది ఆయా జీసీసీల్లో పనిచేస్తున్నారు. భూముల కేటాయింపు విషయంలో ప్రతి కంపెనీని అధికారుల కమిటీ, ఎస్ఐపీబీ, మంత్రుల సంఘం క్షుణ్ణంగా సమీక్షించడం జరుగుతుంది. అనంతరం కేబినెట్ ఆమోదంతో భూములను కేటా యించడం జరుగుతుందన్నారు.గతంలో 99 పైసలకే వేరే కంపెనీకి భూమి ఇచ్చారని ఆరోపించారు. నిరూపిస్తే రాజీనామా చేస్తానని సవాల్ చేస్తే పారిపోయారు. క్రెడిబులిటీ ఉన్న కంపెనీలకే 99 పైసలకు భూములు ఇస్తున్నాం తప్పే ఆయారాం గయారాం కంపెనీలకు ఇచ్చేందుకు మేం సిద్ధంగా లేం. అంతకుముందు వైసీపీ సభ్యుల తీరును మంత్రి అచ్చెన్నాయుడు తప్పుబట్టారు. పరిశ్రమ లకు భూముల కేటాయింపులపై చర్చకు సిద్ధమని, ప్రశ్నోత్తరాలు గంటలోనే ముగించాలని నిర్ణయం తీసుకున్నందున బీఏసీలో చర్చించి ఈ అంశంపై లఘు చర్చ చేపట్టాలని చెప్పారు. ప్రశ్నకు సంబంధం లేనివి అడగడం వల్ల సమయం వృథా అవుతోందన్నారు.

**భూముల కేటాయింపు విషయంలో వైసీపీ పిల్‌పై కోర్టు మొట్టికాయలు వేసింది:** మంత్రి లోకేష్ సమాధానం సమాధానం పట్ల వైసీపీ సభ్యులు అభ్యంతరం లేవనెత్తారు. దీనిపై మంత్రి స్పందిస్తూ.. టీసీఎస్, కాగ్నిజెంట్, మదర్స న్, రహేజా, ఏఎన్ఎస్ఆర్ సంస్థలకు భూములు ఇవ్వకూడదా అంటూ ప్రశ్నించారు. భూముల కేటాయింపుపై వైసీపీనే కోర్టులో పిల్ వేయించారని, కోర్టు కూడా మొట్టికాయలు వేసిందన్నారు. విశాఖలో రహేజా రియల్ ఎస్టేట్ సంస్థకు 99 పైసలకే 27.1 ఎకరాలను ఎలా కేటాయిస్తారని వైసీపీ సభ్యులు మాధవరావు, వరుదు కల్యాణి ప్రశ్నించారు. అడ్రస్ లేని ఉర్సా కంపెనీకి 99 పైసలకే భూములు కట్టబెట్టాలని ప్రయత్నించారని ఆరోపించారు. వైసీపీ సభ్యుల ఆరోపణలను మంత్రి లోకేష్ ధీటుగా తిప్పికొట్టారు. తాము 5 కంపెనీలకే 99 పైసలకు భూములు కేటాయించామని, ఆరో కంపెనీ పేరు ప్రస్తావించినందున ఆధారాలు బయట పెట్టాలని, ఆరోపణలు చేసి బయటకు వెళ్లడం కాదని సవాల్ చేశారు. లేనిపక్షంలో తమ ప్రకటనను ఉపసంహరించుకోవాలని మంత్రి లోకేష్ పట్టుబట్టారు. ఉర్సాకు తాము ఎలాంటి భూములు కేటాయించలేదని మరోసారి స్పష్టం చేశారు. మంత్రి అచ్చెన్నాయుడు స్పందిస్తూ.. యువతకు ఉద్యోగాలు కల్పించేందుకే పరిశ్రమలకు తక్కువ రేటుకు భూములు ఇస్తున్నామని చెప్పారు. ఉర్సా విషయంలో వైసీపీ సభ్యుల ఆరోపణలను నిరూపించాలని సవాల్ చేశారు.

**లెక్కల్లోకి వెళితే 151 కాస్తా 11 అయ్యాయి:** వైసీపీ సభ్యుల అరుపులు నేపథ్యంలో మంత్రి లోకేష్ కలుగచేసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వైసీపీ సభ్యులు వినేందుకు ఓపిక పడితే సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నాం. వైసీపీ సభ్యులు ఎందుకు అరుస్తున్నారు. సమాధానం చెప్పాలా, వద్దా? నేడు దేశానికి వస్తున్న రూ.100 పెట్టుబడుల్లో 25.3 రూపాయలు ఏపీకి వస్తున్నాయన్నారు. వైసీపీ సభ్యులు అరుపులపై స్పందిస్తూ.. లెక్కల్లోకి వెళితే 151 కాస్తా 11 అయ్యాయి. టీం 11 తయారైంది. దీనిపైనా చర్చిద్దామా? 2014 నుంచి 2019 వరకు వైసీపీ ప్రభుత్వం ఏ విధంగా వ్యవహరించిందో చూశాం. రాష్ట్రంలో ఆర్థిక ఉగ్రవాదం నడిచింది. అమర్ రాజాను రాష్ట్రం నుంచి తరిమేశారు. ఆర్సెల్లార్ మిట్టల్ ఎక్కడికీ వెళ్లలేదు. వైసీపీ సభ్యులు వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడటం సరికాదు. 50వేల ఐటీ ఉద్యోగాలు రావడం వల్ల సిటీలో డైరెక్ట్ గా సుమారు బిలియన్ డాలర్లు ప్రతి ఏడాది ఆ ఎకానమీకి వస్తుంది. మా లక్ష్యం 5 లక్షల ఐటీ ఉద్యోగాలు. తద్వారా 10 బిలియన్ డాలర్ల మేర ఎకనామిక్ యాక్టివిటీస్ విశాఖలో జరగాలనేది మా లక్ష్యం.

**భూముల కేటాయింపుల విషయంలో కప్ టీ గురించి నన్ను విమర్శించవచ్చు:**

వైసీపీ సభ్యులు ఎందుకు వాకౌట్ చేశారో అర్థం కాలేదు. బొత్స గారికి అదొక ఫ్యాషన్. ఈ తలుపు నుంచి వచ్చి ఆ తలుపు నుంచి వెళతారు. మేం చాలా పారదర్శకంగా భూ కేటాయింపులు చేశాం. వారి దగ్గర నుంచి ఏం తీసుకున్నారని ఆరోపించారు. నన్ను విమర్శించాలనుకుంటే ఒక్క విషయంలో విమర్శించవచ్చు. నేను బాంబే హౌస్‌కు వెళ్లాను. టాటా సన్స్ ఛైర్మన్ చంద్ర గారు ఒకసారి కలవాలని చెప్పారు. నేను బాంబే హౌస్ కు వెళ్లాను. బాంబే హౌస్ లో కప్ టీ ఇచ్చారు. నన్ను విమర్శించాలనుకంటే కప్ టీ గురించి విమర్శించవచ్చు. నో ప్రాబ్లమ్. కాగ్నిజెంట్ విషయంలో కూడా నన్ను విమర్శించవచ్చు. వాళ్లు నాకు ఓ కప్ కేక్ ఇచ్చారు. దావోస్ లో వారి ఆఫీసుకు వెళ్లినప్పుడు ఆ రోజు నా పుట్టినరోజు. వారు మర్యాదపూర్వకంగా కప్ కేక్ లో క్యాండిల్ పెట్టి నాతో బ్లో చేయించారు. సింపుల్. అంతేగానీ ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తున్నారు. ఉద్యోగాలు కల్పించాలనేది మా లక్ష్యం. మేం ఎక్కడా లాలూచీ పడాల్సిన అవసరం లేదు.

ఒక్క కియా పరిశ్రమ వల్ల ఆ ప్రాంత రూపురేఖలు మారాయి. క్లస్టర్ విధానంలో మేం ముందుకు వెళ్తున్నాం. మేం ప్రతి పరిశ్రమను గ్రౌండింగ్ చేస్తాం. 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం. ఒక కప్పు కాఫీ కంటే నేను వారి వద్ద ఎక్కువ తీసుకుని ఉంటే నిరూపించాలి. అప్పుడు ఏ చర్యకైనా నేను సిద్ధమని సవాల్ చేశారు. వైసీపీ సభ్యులు ఆరోపణలు చేసి పారిపోవడం సరికాదని చెప్పారు.



గురువారం డిసిఎం పవన్‌ను కలిసిన ఎమ్మెల్యే బాలకృష్ణ, ఎమ్మెల్సీ నాగబాబు, గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి

# డిసిఎం పవన్‌ను కలిసిన ఎమ్మెల్యే బాలకృష్ణ

**విజయవాడ.ఫిబ్రవరి 12,ప్రభాతవార్తప్రతినిధి:** డిప్యూటీ సీఎం పేషీలో పవన్‌కల్యాణ్‌తో భేటీ బాలకృష్ణ అయ్యారు.అసెంబ్లీలో నందమూరి బాలకృష్ణ, పవన్‌కల్యాణ్ ఆత్మీయంగా పలుకరించుకున్నారు.తమ్ముడు పంచాయతీ రాజ్‌వ్య వస్థలో మంచి మార్పులు తెస్తున్నావంటూ పవన్ అభినందించారు. పవన్‌కల్యాణ్‌ను ఆయనను తన ఛాంబర్‌లోకి తీసుకొనివెళ్ళారు.ఈ సం దర్భంగాబాలకృష్ణ హిందూపురం ప్రజాసమస్యలపై పవన్‌కల్యాణ్‌తో చర్చలు జరిపారు. హిందుపురంలో గ్రామీణాభివృద్ధికి సహకరించాలని పవన్‌ను కోరారు.తన నియోజ కవర్గంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి పనులకు సంబంధించి పలు అంశాలను వివరిస్తూ వినతి పత్రం అందజేసారు.గిద్దలూరు నియోజకవర్గ సమస్యలపై పవన్‌కు వినతిపత్రం ఇచ్చిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పవన్‌కల్యాణ్‌ను ఆయన సోదరుడు, ఎమ్మెల్సీ నాగబాబు కలుసుకున్నారు.

# మండలికి ఓకే

>> అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాకుండా దూరంగా ఉండాలని జగన్ నిర్ణయించారు. అయితే అసెంబ్లీలో మాత్రమే విపక్ష హోదా ఇవ్వడం లేదు కాబట్టి ఎప్పటిలాగే ఈసారి కూడా శాసనసభకు మాత్రమే ఎమ్మెల్యేలు హాజరుకాకూడదని నిర్ణయించారు. దీంతో మండలికి మాత్రం వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీలు హాజరుకాబోతున్నారు. ఈ సందర్భంగా శాసనమండలిలో గట్టిగా పోరాడాలని ఎమ్మెల్సీలకు జగన్ దిశానిర్దేశం చేశారు.కూటమి ప్రభుత్వం స్కామ్‌ల మయంగా మారిందని, ఎక్కడికక్కడ యథేచ్ఛగా దోపిడి చేస్తున్నారని జగన్ వారికి తెలిపారు. రూ.5 వేల కోట్ల విలువైన భూమి 54 ఎకరాలు గీతమ్ వర్సిటీకి ఇచ్చేశారని, ఏ ముఖ్యమంత్రీ తన సొంత బంధువులకు ఎవరూ ఇలా ఇచ్చుకోలేదన్నారు. ఇప్పుడు ఈ ప్రభుత్వంలో కొత్త నినాదం వినిపిస్తోందని, అదే క్యాష్.. సూట్‌కేసు.. రాజేష్.. లోకేష్. అన్నారు. ఈ అంశాలన్నింటిపైనా సభలో గట్టిగా గొంతు వినిపించాలని ఎమ్మెల్సీలకు సూచించారు. కళ్లు మూసి తెరిచేలోపు మూడేళ్లు గడుస్తాయని, వచ్చేది మన ప్రభుత్వమేనన్నారు. ఇప్పుడు కష్టపడి పని చేస్తున్న వారందరికీ, తగిన గుర్తింపు ఉంటుందన్నారు. పనితీరు ఆధారంగా మీకు మీ పదవులు తిరిగి వస్తాయి కూడా అన్నారు. అలాగే ఇంతకన్నా మంచి పదవులు కూడా దక్కే అవకాశం మీకు ఉందన్నారు.



గురువారం న్యూఢిల్లీలో రైల్వే మంత్రి అశ్వని వైష్ణవ్‌కు వినతిపత్రం అందచేస్తున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి

# కార్మిక సమ్మె ప్రశాంతం

>> ముగిసింది. ఇండో అమెరికా ట్రేడ్‌డీల్‌లో రైతులు, చిన్న వ్యాపారాలు, కార్మికుల హక్కులు, శ్రేయస్సును కాలరాచేదిగా ఉందని నాయకులు ఆరోపించారు. పార్లమెంటులో కూడా ప్రజాప్రతినిధులు, విపక్ష ఎంపిలు ప్రభుత్వం వెంటనే ఈ డీల్‌ను రద్దుచేసి ప్రధాని నరేంద్రమోడీ ట్రంప్‌నకు లొంగిపోయారంటూ నినాదాలుచేసారు. ఒకరోజు సమ్మెకారణంగా ఉత్పత్తిరంగ కార్యకలాపాలు కుంటుపడ్డాయి. మోడీ చేపట్టిన సంస్కరణల అజెండాను కార్మికులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ ఏడాదిలో జరిగే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే ఎన్డీయే సర్కారు పనిచేస్తోందని ఆరోపించారు. రైతు నేత హన్స్ మొల్లామాట్లాడుతూ ఇటీవల ట్రేడ్ ఒప్పందాలు న్యూజిలాండ్, యూరోప్, అమెరికాలతో జరిగిన ఒప్పందాలు భారత్‌లోని వ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తుందని, స్థానిక మార్కెట్లలోకి అమెరికా ఉత్పత్తులు ఇకపై వెల్లువలా వచ్చిపడతాయని, దీనివల్ల దేశీయ ఉత్పత్తులకు గండం ఏర్పడుతుందని ఆరోపించారు. అమెరికాతో జరిగిన ఒప్పందం వల్ల భారత్‌లోనిసన్నచిన్నకారు రైతుల జీవనోపాధి దెబ్బతింటుందని పేర్కొన్నారు. అమెరికా కారుచౌకవనయవసాయ ఉత్పత్తుల భారత్‌లోకి డంప్‌చేస్తారని, వీటివల్ల చిన్న వ్యాపారాలు, చిరువ్యాపారులకు తీరనినక్షటం ఏర్పడుటుందని ఆలిండియా ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ నేత అమర్‌జీత్‌కౌర్ విమర్శించారు. దేశవ్యాప్తంగా కూడా కీలక రాష్ట్రాల్లో ఈసమ్మె కొనసాగింది. ఆటోకార్మికులు కూడా రోడ్లపైకి వచ్చి క్యాబ్‌లు, ఆటోలను నిలిపివేసారు. కొన్ని చోట్లప్రభుత్వ పరిధిలోని ఆర్టీసీ సర్వీసులు మధ్యాహ్నం వరకూ నిలిచిపోయాయి. తదనంతరం తగుమాత్రంలోనే సర్వీసులను నడపాల్సి వచ్చింది. దేశవ్యాప్తంగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు.

# కేంద్రం నుంచి మరిన్ని నిధులు

>> చేపట్టాలన్నారు. హిందుపురంలో ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్స్ తయారీని ప్రతిపాదించాలన్నారు. తిరుపతిని టూరిజం డెస్టినేషన్ కింద అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉందని తెలిపారు. కేంద్రం మంజూరు చేసిన 1000 ఎలక్ట్రిక్ బస్సులను సద్వినియోగం చేసుకుని మరిన్ని ఇబస్సులను సాధించేలా ప్రణాళిక చేయాలన్నారు. కొబ్బరి, కోకో, కాజు, కాఫీ పంటలకు ఎక్కువ నిధులను సాధించుకునే అవకాశం ఉందని అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ ప్రాజెక్టులను కూడా రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఏర్పాటు చేసేందుకు ఆస్కారం ఉందన్నారు.

# బెంగళూరు- కడప రైల్వే మార్గం ఏర్పాటు చేయండి

## కేంద్ర మంత్రిని కోరిన రాష్ట్ర మంత్రి రాంప్రసాద్ రెడ్డి

### సానుకూలంగా స్పందించిన అశ్విని వైష్ణవ్

### మంత్రి వెంట ఎంపి పురందేశ్వరి, సాయి లోకేష్

**విజయవాడ, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త ప్రతినిధి:** బెంగళూరు నుంచి కడప వరకు కొత్త రైల్వే మార్గం ఏర్పాటు చేయాలంటూ రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో ఢిల్లీలో సమావేశమై కోరారు. ఈ భేటీలో ఎంపి పురందేశ్వరి, అన్నమయ్య జిల్లా బిజెపి అధ్యక్షుడు సాయి లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బెంగళూరు-కడప రైల్వే మార్గం ఏర్పాటు చేస్తే రాయలసీమ ప్రాంతానికి రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు ఆర్థిక, పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడుతుందని కేంద్ర మంత్రికి వివరించారు. రాయలసీమ ప్రాంత అభివృద్ధి సీఎం చంద్రబాబు నాయుడు సారథ్యంలోనే సాధ్యం అని మంత్రి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ప్రాంత ప్రజల దీర్ఘకాలిక ఆకాంక్ష అయిన ఈ రైల్వే మార్గాన్ని త్వరితగతిన మంజూరు చేయాలని కోరగా కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు.

**కడప విమానాశ్రయం నుంచి విమాన సేవల విస్తరణపైనా:** కడప విమానాశ్రయం నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలకు విమానాల సేవలను పెంపొందించాలని కోరుతూ రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఢిల్లీలో కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడుని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా ముందుకుసాగుతున్న క్రమంలో, కడప విమానాశ్రయం ద్వారా కడప జిల్లాకు మెరుగైన విమాన కనెక్టివిటీ కల్పిస్తే రాయలసీమ ప్రాంత అభివృద్ధికి, వ్యాపార, పర్యాటక రంగాల పురోగతికి దోహదపడుతుందని మంత్రి రాంప్రసాద్ రెడ్డి కేంద్ర మంత్రికి వివరించారు.

**ఎపిని క్రీడా హబ్‌గా తీర్చిదిద్దటమే లక్ష్యం**

ఢిల్లీ పర్యటనలో ఉన్న రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి జాతీయ యువజన వ్యవహారాలు, ఎస్ఏఐ జాయింట్ సెక్రెటరీ వినీల్ కృష్ణతో జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో రాయచోటి నియోజకవర్గంలో క్రీడల అభివృద్ధికి అవసరమైన నిధులు, ఖేలో ఇండియా పథకం కింద ప్రతిపాదనల ఆమోదం, అలాగే ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రశ్రేణి క్రీడా హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తరఫున రాష్ట్ర ప్రభుత్వానికి అదనపు నిధుల మంజూరు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

# వైకాంగ్రెస్ పాలనలో విశాఖకు ఒక్క కంపెనీ అయినా తెచ్చారా? : మంత్రి లోకేశ్

**విజయవాడ ఫిబ్రవరి 12 ప్రభాతవార్త ప్రతినిది:** రాష్ట్రానికి పెట్టుబడులు రాకూడదని వైకాపా కుట్రలు చేసిందని మంత్రి నారా లోకేశ్ విమర్శించారు. పరిశ్రమలకు భూ కేటాయింపులపై శాసన మండలిలో వాడీవేడి చర్చ జరిగింది. కంపెనీల పేరిట రియల్ ఎస్టేట్ సంస్థలకు అప్పనంగా భూములను కట్టబెట్టారంటూ వైకాపా సభ్యులు చేసిన ఆరోపణలను లోకేశ్ తిప్పికొట్టారు. క్రెడిబులిటీ ఉన్న ఐదు సంస్థలకే 99 పైసల చొప్పున భూములు కేటాయించామని, ఆధారాలు లేకుండా విమర్శలు చేస్తే సహించబోమని లోకేశ్ చెప్పారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల 18 నెలల్లో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వచ్చాయన్నారు. ఆర్సెలార్ మిత్తల్ ప్రాజెక్ట్ ఉత్తరాంధ్రకు రానుందని దీనికి భూములు కేటాయించామని మంత్రి లోకేశ్ అన్నారు. టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి సంస్థలకు భూములు ఇవ్వడం తప్పా? అని నిలదీశారు. వైకాపా పాలనలో విశాఖకు కనీసం ఒక్క కంపెనీ అయినా తీసుకొచ్చారా అని ప్రశ్నించారు.

# విద్యాసంస్థల్లో వసతుల ప్రతిపాదనలు

>> మిచ్చారు. పెరుగుతున్న జనాభా అవసరాలకు తగినట్లు నీటిసరఫరాలను పెంచుతామని చెప్పారు. బొబ్బిలి నియోజకవర్గంలో లోచర్ల శివదావలస ఎత్తిపోతల పథకంపై ఎమ్మెల్యే బేబినాయన ప్రశ్నించగా వైకాపా హయాంలో టెంబర్లు రద్దు చేసి పనులు నిలిపివేశారని మంత్రి రామానాయుడు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగుల బదిలీపై పోలవరం ఎమ్మెల్యే బాలరాజు ప్రశ్నించారు. దీనికి మంత్రి సంధ్యారాణి సమాధానం చెప్పారు. వైకాపా ప్రభుత్వం హయాంలో కోర్టు కేసుల పరిష్కారానికి చొరవ తీసుకోనందువల్ల సమస్యలు వచ్చాయన్నారు. దీనిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# భారత ఆర్థిక వ్యవస్థకు బడ్జెట్ ఊతం

## రాజ్యసభలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** పెరుగుతున్న వృద్ధి, తక్కువ ద్రవ్యోల్బణం కలిసి సాధించబడుతున్న భారత ఆర్థిక వ్యవస్థకు 2026-27 కేంద్ర బడ్జెట్ ఊతమిస్తుందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. గురువారం రాజ్యసభలో విత్త మంత్రి మాట్లాడుతూ, ఇదొక 'గోల్డిలాక్స్ మూమెంట్' ఇది అవకాశం కాదు, నిరంతర ప్రయత్నం, జాగ్రత్తగా ప్రణాళిక, సకాలంలో విధాన చర్య ఫలితంగా ఉందని అన్నారు. "జాతీయ గణాంక కార్యాలయం విడుదల చేసిన మొదటి ముందస్తు అంచనాల ప్రకారం, భారతదేశ వాస్తవ జిడిపి వృద్ధి 2025-26 సంవత్సరానికి 7.4 శాతంగా అంచనా వేయబడింది, అయితే నామమాత్రపు వృద్ధి దాదాపు 8 శాతంగా అంచనా వేయబడింది" అని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. "అదే సమయంలో, వినియోగదారుల ధరల ద్రవ్యోల్బణం దాదాపు 2 శాతానికి తగ్గిపోయింది. నియంత్రణలో ఉంది" అని ఆమె పేర్కొన్నారు. ఆత్మనిర్భర్ భారత్ ప్రభుత్వ ఆర్థిక వ్యూహంలో ఒక ప్రధాన సూత్రంగా మిగిలిపోయిందని ఆర్థిక మంత్రి సీతారామన్ పునరుద్ఘాటించారు. "బడ్జెట్ దేశీయ ఉత్పాదక సామర్థ్యాన్ని పెంపొందించడం, ఇంధన భద్రతను నిర్ధారించడంపై దృష్టి పెడుతుంది, అదే సమయంలో పౌరులు వారి స్వంత జీవితాలలో స్వావలంబన చెందడానికి కూడా సహాయపడుతుంది" అని ఆర్థిక మంత్రి సీతారామన్ వివరించారు. "జీవన సౌలభ్యాన్ని మెరుగుపరచడం, ఉపాధిని సృష్టించడం, వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం, గృహ కొనుగోలు శక్తిని పెంచడం లక్ష్యంగా ఉన్న చర్యలు ఈ విధానంలో భాగం" అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. మానవ మూలధనాన్ని అభివృద్ధి చేయడానికి చర్యలను వివరిస్తూ, రాబోయే ఐదు సంవత్సరాలలో ఒక లక్ష అనుబంధ ఆరోగ్య నిపుణులను సృష్టించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ఆర్థిక మంత్రి అన్నారు. "ప్రస్తుత సంవత్సరంలో దీని కోసం రూ.1,000 కోట్ల వెచ్చిస్తాం. ఈ చర్య ఉద్యోగాలను సృష్టించడమే కాకుండా ఆరోగ్య సేవలను బలోపేతం చేస్తుంది. వైద్య పర్యాటక వృద్ధికి తోడ్పడుతుంది" అని మంత్రి పేర్కొన్నారు. ఉన్నత స్థాయి విద్య నుండి ఉపాధి, సంస్థ స్టాండింగ్ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్థిక మంత్రి సీతారామన్ ప్రకటించారు. 2047 నాటికి ప్రపంచ సేవల మార్కెట్‌లో 10 శాతం వాటాను ఆక్రమించాలనే లక్ష్యంతో, సేవల రంగానికి భారతదేశ యువతను సిద్ధం చేయడంపై ఈ కమిటీ దృష్టి సారిస్తుందని వివరించారు.

# ప్రత్యేక చర్చ జరపండి

>> ప్రభుత్వానికి నివేదించాలని ఆయన స్పీకర్‌ను కోరారు. అదేవిధంగా, మీ నేతృత్వం లో సాగే సభా కార్యక్రమాల్లో ప్రతి సభ్యుడూ తప్పనిసరిగా తెలుగు మాట్లాడేలా స్థిర నిర్ణయం తీసుకోవాలని కోరారు.

# చట్టసభలపై చులకన వద్దు

>> ప్రసంగిస్తున్నప్పుడు సభలో జరిగిన దృశ్యాలు నన్ను కలచివేశాయి. సభ్యులు నినాదాలు చేస్తూ, కాగితాలు చింపి వేయడం వంటి చర్యలు అత్యంత బాధాకరం' అని స్పీకర్ అన్నారు. వేలాది మంది పోటీ పడితే కేవలం 175 మందికి మాత్రమే దక్కే అరుదైన గౌరవం ఈ సభలో సభ్యులుగా ఉండటం అని, ఆ గౌరవాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన గుర్తుచేశారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 200లకు పైగా విద్యాసంస్థల నుండి విద్యార్థులు అసెంబ్లీని చూసేందుకు ఆసక్తి చూపుతున్నారని స్పీకర్ తెలిపారు. "మనం చేసే పనులను చూసి ఆ పసిపిల్లలు ఏం నేర్చుకుంటారు? చట్టసభలంటే వారికి చులకన భావం ఏర్పడితే దాన్ని మనం మళ్ళీ మార్చలేము" అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సభా గౌరవాన్ని పెంచలేకపోయినా పర్వాలేదు కానీ, దిగజార్చే హక్కు మాత్రం ఎవరికీ లేదని స్పీకర్ స్పష్టం చేశారు. ప్రజలు మన ప్రతి కదలికను గమనిస్తున్నారని, సభ్యులందరూ ఆత్మవిమర్శ చేసుకోవాలని కోరుతూ స్పీకర్ తన ప్రసంగాన్ని ముగించారు.

# విపక్షాల ప్రశ్నలకు సమాధానం చెప్పలేరా?

>> చెప్పారు. తల్లికి వందనం డబ్బులు పూర్తిగా తల్లుల ఖాతాల్లో జమ కాలేదని, చాలా మంది ఖాతాల్లో ఏడెనిమిది వేల రూపాయలే వచ్చాయని పేర్కొన్నారు. తాము చెప్పిన విషయాలు అవాస్తవమని ప్రభుత్వం నిరూపిస్తే తమ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటామని స్పష్టం చేశారు. 15 సంవత్సరాల పాటు తాను కూడా మంత్రిగా పనిచేశానని, వివరాలు లేకుండా ఏ అంశాన్నీ ప్రతిపక్షం ప్రశ్నించదని అన్నారు. ప్రభుత్వం కావాలంటే అధికారులతో విచారణ చేయించుకుని తాము చెప్పింది అసత్యమని నిరూపించాలని సవాల్ విసిరారు.

ఈ సమావేశాలు ముగిసేలోపు తల్లికి వందనం బకాయిలను పూర్తిగా చెల్లించాలని, ప్రతిపక్షం లేవనెత్తిన అంశాలను కనీసం పరిగణలోకి తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు. కొత్తగా ఒక్క వితంతు పెన్షన్ కూడా ఇవ్వలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందని, గతంలో వైసిపి పాలనలో ఏడాదికి రెండు సార్లు కొత్త పెన్షన్లు మంజూరు చేశామని గుర్తుచేశారు. శాసనమండలిలో తాను లేవనెత్తిన ప్రతి అంశానికి కట్టుబడి ఉన్నానని ఆయన సమాధానం చెప్పారు.

## వారం - వర్జ్యం

13-02-2026, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, కృష్ణపక్షం, ధనిష్ఠ కార్తె
ఏకాదశి మ.2.23
మూల సా.4.09
వర్జ్యం : రా.2.35-4.19
దు.ఉ.8.54-9.40
2) మ.12.45-1.31
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** కుటుంబ విషయములో ఇతరుల జోక్యము అధికమౌతుంది. పోటీ పరీక్షలలో పాల్గొంటారు.ప్రతిష్టను నిలబెట్టుకుంటారు.

**వృషభం:** ఓర్పు బాగా అవసరము. విదేశీ వస్తువులు ఆకర్షణల నుండి బయట పడుటకు జాగ్రత్తను వహించండి.

**మిథునం:** చికాకులు ఉన్నప్పటికీ బాధ్యతలు సక్రమంగా నిర్వహించగలుగుతారు. ఋణయత్నము ఫలిస్తుంది. వాహనసౌఖ్యం.

**కర్కాటకం:** అస్తవ్యస్తంగా ఉన్న చాలా వ్యవహారాలను మీ ప్రతిభతో అనుకూలంగా మలచుకుంటారు. వస్త్రలాభం.

**సింహం:** విలువైన పత్రములు డాక్యు మెంట్స్ మొదలైన వాటితో జాగ్రత్త అవసరం.విదేశీయానయత్నాలు ఫలిస్తాయి.

**కన్య :** విలువైన వస్తువుల కొనుగోలు విషయాలలో తగిన శ్రద్ధ చూపడం చెప్పదగినది. శుభవార్తలు అందుకుంటారు.

**తుల :** మిమ్మలను మోసం చేసే ప్రయత్నాలు ఫలించవు, సంఘసేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

**వృశ్చికం:** నేర్పుతో ముఖ్యులవద్ద గుర్తింపు పొందుతారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తారు. వస్తు కొనుగోలు.

**ధనుస్సు:** కొంతమేర జాగ్రత్తలు అవసరం. భాగస్వామ్య వ్యాపారాలలో జాగ్రత్తలు అవసరం. సోదరుల కలయిక.

**మకరం:** పెట్టుబడులకు అనుకూలంగా ఉంటుంది. కోర్టు కేసుల నుండి బయటపడతారు. స్థలాలు కొనుగోలు.

**కుంభం:** ఆత్మీయవర్గానికి ధన సహాయం చేస్తారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు.విద్యా, ఉద్యోగావకాశాలు పొందుతారు.

**మీనం:** విధి నిర్వహణలో పై అధికారుల ప్రశంసలు అందుకుంటారు. వాహనాల విషయంలో జాగ్రత్త అవసరం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## సార్వత్రిక సమ్మెతో

# తిరుపతిలో కదం తొక్కిన కార్మికులు




**తిరుపతి,ఫిబ్రవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** దేశవ్యాప్తంగా చేపట్టిన సార్వత్రిక సమ్మెలో భాగంగా తిరుపతిలో కార్మిక సంఘాలు చేపట్టిన సమ్మె విజయవంతమైంది. ఈ సమ్మెలో సంఘటిత, అసంఘటిత రంగాలకు చెందిన వేలాదిమంది కార్మికులు గురువారం ఉదయం అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. అక్కడనుండి రైల్వే స్టేషన్ ,కర్నాలవీధి, బేరి వీధి, గాంధీ రోడ్డు, తిలక్ రోడ్డు మీదుగా పాత మున్సిపల్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని.. మోడీ నిరంకుశ విధానాలపై కార్మికులు నినదించారు. అనంతరం సభలో ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యుడు ప్రకాష్ బాబు మాట్లాడుతూ స్వాతంత్రానికి ముందు బ్రిటీష్ పాలకులు ఆమోదించిన కార్మిక చట్టాలను నరేంద్ర మోడీ కాలరాస్తున్నారని విమర్శించారు. 29 కేంద్ర కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మార్చడం దారుణం అన్నారు. మోడీ అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై నేడు సార్వత్రిక సమ్మెలో దేశవ్యాప్తంగా కోట్లాదిమంది కార్మికులు రోడ్లపైకి వచ్చి ఆందోళన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె నారాయణ మాట్లాడుతూ స్వాతంత్రానికి పూర్వమే దేశంలో మొట్టమొదటిసారిగా పాండిచ్చేరిలో కార్మిక నాయకుడు సుబ్బయ్య నేతృత్వంలో ఎనిమిది గంటల పని విధానానికి పోరాడి సాధించారని అన్నారు. నేడు రైతాంగం దివాలా తీస్తోందని రైతులు కార్మికులను కేంద్రం కట్టు బానిసలుగా చూస్తోందని విమర్శించారు. రాజ్యాంగాన్ని అంచలంచలుగా తగ్గించి వేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరులో గాంధీని తొలగించారని, స్వాతంత్ర సమరయోధుల పేర్లు కనబడకుండా చేసి ఘాడ్సే లాంటి వారిని తెర ముందుకు తీసుకువస్తున్నారని విమర్శించారు. దేరా బాబా లాంటివారు అరెస్టు అయితే వెంటనే బెయిల్ మంజూరు అవుతుందని.. వరవరరావు లాంటివారు అరెస్టు అయితే బెయిల్ రాదని ఎద్దేవా చేశారు. సిఐటి యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి, ఐఎఫ్టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరికృష్ణ ,,ఏఐటియుసి జిల్లా కార్యదర్శి కె రాధాకృష్ణ , మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, ,ఏఐటియూసీ నాయకులు ఎన్ డి. రవి, శివ, సిపిఐ నగర కార్యదర్శి విశ్వనాథ్, సిఐటియు నాయకులు జయచంద్ర, వేణుగోపాల్, ఐఎఫ్టియు నాయకులు వెంకటరత్నం, ఐ ఎన్ టి యు సి నాయకులు రత్నకుమార్, వైయస్సార్సీపి టి యు రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మావోయిస్టుల పేరిట బెదిరింపు లేఖలపై కేసు నమోదు

**గుంటూరు ఫిబ్రవరి 12 ప్రభాత వార్త ప్రతినిధి :** ఏపీలో నలుగురు మంత్రులకు మావోయిస్టుల పేరిట బెదిరింపు లేఖలు రావడం తీవ్ర కలకలం రేపింది. మంత్రులు కందుల దుర్గేశ్, కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్‌కు ఈ లేఖలు వచ్చాయి.మీ జీవితం ప్రమాదంలో వుందని, మీతోపాటు మీ కుటుంబ సభ్యుల పైన త్వరలోనే దాడి జరుగుతుందని, 7981777325 ఫోన్ నంబర్ ఈ లేఖల్లో ఉంది. వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం చిరునామాతో లేఖలు పంపారు. ఈ అంశంపై ఏపీ అసెంబ్లీ లాబీ వద్ద బుధవారం మంత్రి కందుల దుర్గేష్ మీడియాతో మాట్లాడుతూ.. తనతోపాటు ముగ్గురు మంత్రులకు పోస్టు ద్వారా లేఖలు వచ్చినట్టు చెప్పారు. మావోయిస్టుల పేరిట వచ్చిన లేఖలు చూసి కుటుంబసభ్యులు ఆందోళన చెందినట్టు వెల్లడించారు. వ్యక్తిగతంగా, శాఖాపరంగా తాము ఎలాంటి తప్పులు చేయలేదని పేర్కొన్నారు. ఎవరో ఉద్దేశపూర్వకంగానే ఈ లేఖలు రాసి ఉంటారని అనుమానం వ్యక్తంచేశారు. అయితే ఈ బెదిరింపు లేఖపై తుళ్లూరు పోలీసు స్టేషన్‌లో మంత్రి దుర్గేష్ కార్యాలయ సిబ్బంది ఫిర్యాదు చేశారు.ఈ ఫిర్యాదు పై తుళ్లూరు పోలీసులు 37/2026 గా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయంలో మంత్రులకు బెదిరింపు లేఖలు రావడం చర్చనీయాంశమైంది.

# తిరుమల సమాచారం

## తిరుమలనుండి శ్రీనివాసమంగాపురానికి లక్ష్మీకాసులహారం



**తిరుమల, ఫిబ్రవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామిబ్రహ్మోత్సవాల్లో గురువారం రాత్రి గరుడ సేవలో స్వామివారికి అలంకరించేందుకు లక్ష్మీకాసుల హారం ఊరేగింపు జరిగింది. గురువారం మధ్యాహ్నం శ్రీవారి లక్ష్మీకాసులహారం శోభాయాత్ర టిటిడి పరిపాలనా భవనం వద్ద నుండి వైభవంగా ప్రారంభమైంది. టిటిడి అదనపు ఇఒ తల పై కాసులహారం పెట్టుకుని తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి దంపతులు, టిటిడి జెఇఒ వి. వీరబ్రహ్మం, డాక్టర్ ఎ. శరత్, సివిఎస్ఒ కె. వి. మురళీకృష్ణ పాల్గొన్నారు. టిటిడి స్థానిక ఆలయాల్లో బ్రహ్మోత్సవాలు జరుగుతున్న క్రమంలో తిరుమల శ్రీవారి ఆలయం నుంచి గరుడసేవకుకల్యాణ వేంకటేశ్వరస్వామికి అత్యంత ప్రీతిపాత్రమైన లక్ష్మీకాసుల హారాన్ని అలంకరించేందుకు ఊరేగింపుగా తీసుకెళుతున్నట్లు తెలిపారు. టిటిడి నుండి దాదాపు 6.40 కోట్ల రూపాయలు విలువగల నాలుగుకిలోల డైమండ్ మోపుగల ఆరు పేటల బంగారు యజ్ఞోపవీతము స్వామి వారికి అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు జి.భానుప్రకాశ్ రెడ్డి, పనబాక లక్ష్మీ, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, ఆలయ ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఇఒవరలక్ష్మీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అధికార నందివాహనంపై సోమస్కందుడు



**తిరుమల,ఫిబ్రవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడికి అనుబంధంగా ఉన్న తిరుపతిలోని ప్రముఖ శైవాలయం కపిలేశ్వరస్వామికి జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో గురువారం రాత్రి అధికార నందివాహనంపై కపిలేశ్వరుడు భక్తులకు అభయమిచ్చాడు. ఆద్యంత రహితుడైన శివదేవుడు ఐశ్వర్యసూచికమైన నందిని అధిష్ఠించినపుడు దర్శనం చేసుకోవడం భక్తులకు పుణ్యం. ఆలయ మాఢ పురవీధుల్లో భక్తుల భజనలు, కోలాటలు ముందు వాహనసేవ జరిగింది. గురువారం ఉదయం బ్రహ్మోత్సవాల్లో సోమస్కంధమూర్తి బంగారుతిరుచ్చిపై కామాక్షి అమ్మవారితో కలసి ఊరేగారు.

## ఎస్వీగోసంరక్షణ ట్రస్ట్‌కు రూ.10లక్షలు విరాళం



**తిరుమల ఫిబ్రవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న ట్రస్ట్‌ల్లో ఎస్వీ గోసంరక్షణ ట్రస్ట్‌కు దాత 10లక్షలు రూపాయలు విరాళం అందించారు. తిరుపతికి చెందిన బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి కన్వీనర్ కుప్పాల గిరి ధర్ కుమార్ కుమారుడు కుప్పాల నీలేశ్ కుమార్ 10,00,116 రూపాయలు డిడిని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి అందజేశారు.

## శ్రీవారి ఆశీస్సులకు ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బొజ్జిరెడ్డి



**తిరుమల,ఫిబ్రవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం శ్రీవారి దర్శనార్థం రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ సొల్ల బొజ్జిరెడ్డి గురువారం రాత్రి తిరుమలకు వచ్చారు. ఆయనకు వసతికల్పన విభాగం ఒఎస్‌డి సత్రానాయక్ స్వాగతం పలికారు. నేటి ఉదయం దేవుని దర్శనం చేసుకోనున్నారు.

# శ్రీశైల మల్లన్న చెంత భక్త జనసందోహం

# నల్లమల్ల నడకదారులన్నీ శివ నామస్మరణం



నడక దారుల్లో వస్తున్న భక్తులు

**శ్రీశైలంప్రాజెక్టు,ఫిబ్రవరి12,ప్రభాతవార్త** శివ నామస్మరణం నల్లమల్ల నడక మార్గం అంతా మారుమ్రోగుతుంది. ఓం నమ:శివయా, ఓం నమ:శివయా అంటూ జనసంద్రం శ్రీశైలం మల్లన్న చెంతకు తండోపా తండాలుగా భక్త జనసందోహం తరలివస్తున్నారు. భక్తి పారవశ్యంతో అలరారుతోంది. శ్రీస్వామిఅమ్మవార్ల ఉభయ దేవాలయాలను కనువిందు చేసే విధంగా పుష్పాలతో ముస్తాబు చేసారు. చికటి పడితే మల్లన్న క్షేత్రం విద్యుత్ కాంతులతో మిరుమిట్లు గోలుపుతుంది. నల్లమల్ల నడకదారులన్ని శివ నామస్మరణంతో ప్రజ్వరిల్లుతున్నాయి. ఇల కైలాసమైన శ్రీగిరి క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. హారహార మహదేవా శంభో శంకరా అన్న నినాదంతో పరుగుపరుగున క్షేత్రంకు చేరుకుంటున్నారు. నడక దారి మార్గలన్ని భక్తుల కోలహాలంతో కనువిందు చేస్తున్నాయి. ఈ నడక దారులన్ని దాతలచే అన్నప్రసాద వితరణ జరుగుతుంటే, దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు అవసరమైన వైద్యశిబిరాలు, ఉచిత మంచీనీరు, తదితర సౌకర్యాలను ఏర్పాటు చేసింది. మండుటేండను సైతం లెక్కచేయకుండా వెంకటాపురం నుండి నట్టడవి మొట్ల మార్గన మల్లన్నను మనస్సులో స్మరించుకుంటూ కైలాసద్వారం వద్దకు చేరుకుంటున్నారు. అక్కడికి చేరుకున్న భక్తులకు సేద తీరేందుకు చలువ పందిళ్లు, అన్నప్రసాద వితరణ, మంచినీటి సౌకర్యం, వైద్య శిబిరాలు, అత్యవసర సమయాలకు అంబులేన్స్‌లు తదితర వంటివి ఏర్పాట్లు గావించారు. ఈ నడక దారులన్ని చిన్న, పెద్ద, ముసలి, ముతక అనే తేడా లేకుండా మల్లన్న నీ దర్శన భాగ్యం కోరకు తరలివస్తున్నామని నీ చెంతకు చేరుకోగానే మమ్మల్ని పిల్లపాపాలతో చల్లగా దీవించుస్వామి అంటూ వేడుకుంటున్నారు. మల్లన్న వద్దకు చేరుకున్న భక్తాదులకు సలక సౌకర్యాలను ఏర్పాటు చేసి అనువైన దర్శన బాగ్యం కల్పించడం దేవస్థానం తీసుకోంది. శ్రీశైలక్షేత్రం నలుచేరుగుల భక్తులతో కిక్కిరిసిపోతున్నాయి. శివ మాలలో వచ్చిన స్వాములు శివదీక్ష శిబిరాలకు చేరుకోని ఇరుముడిని సమర్పిస్తున్నారు. శివస్వాములకు తగిన సమయంలో దర్శనం కల్పిస్తుండడంతో వారు పునితులౌవుతున్నారు. ఈక్రమంలోనే మరికొందరు భక్తులు పాతళగంగకు చేరుకోని పుణ్యస్నానాలు అచరించి తమ మ్రొక్కులను తీర్చుకుంటున్నారు. దర్శనం క్యూలైన్లన్ని భక్త సంద్రంతో కిటకిటాలాడు తున్నాయి.



# దేవుడిని అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేయొద్దు: సిపిఐ నారాయణ

**తిరుమల,ఫిబ్రవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల లడ్డూ నెయ్యిలో కల్తీజరిగిన మాట వాస్తవమేనని, ఆ దోషులను కఠినంగా శిక్షించాలని సిపిఐ జాతీయనేత డాక్టర్ కె.నారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ పాపంలో తప్పుచేసిన అధికారులను, పాత ఇఒను వదిలేయకూడదని చెప్పారు. రాజకీయ లబ్ధికోసమే అధికార, ప్రతిపక్షపార్టీలు లడ్డూ విషయంపై రాద్ధాంతం చేస్తున్నాయని, దేవుడిని అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేయడం సరికాదని హితవు పలికారు. రాజకీయ లబ్ధికోసం కోట్లాదిమంది భక్తులను మనోవేదనకు గురి చేయొద్దని ఆయన కోరారు. ఇందుకు సంబంధించి ఈ కేసులో సుప్రీంకోర్టు విచారణ చేస్తోందని, ఈ సమయంలో రాజకీయ నేతలు లడ్డూపై మాట్లాడటం ఆపేయాలని సూచించారు. ఎవరిరాజకీయాల కోసం వాళ్ళు కావాలంటే కొట్టుకోండని, అయితే దేవుడిని మాత్రం లాగొద్దని ,లడ్డూ వివాదంపై అనవసర చర్చ ఆపి భక్తుల మనోభావాలను కాపాడండి అని నారాయణ ఘాటుగా స్పందించారు. కల్తీ ప్రసాదంతో సిఎం చంద్రబాబునాయుడు స్వామి ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. గత ఐదేళ్ళలో రసాయనాలతో తయారైన కల్తీ నెయ్యితో లడ్డూల తయారుచేయించారని ఆయన తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

# రసవత్తరంగా సాగిన ప్రశ్నోత్తరాలు

## పుట్టపర్తిలో ట్రిపుల్ ఐటి ప్రతిపాదన లేదన్న మంత్రి లోకేష్

**విజయవాడ.ఫిబ్రవరి12,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు గురువారం రెండో రోజు ప్రారంభమయ్యాయి. సభలో పలు ఆసక్తికర అంశాలు చోటు చేసుకున్నాయి. సభ మొదలైన వెంటనే స్పీకర్ అయ్యన్న పాత్రుడు ప్రశ్నోత్తరాలను చేపట్టారు. ఈ కార్యక్రమం రసవత్తరంగా సాగింది. పుట్టపర్తిలో ఐఐటీ ఏర్పాటుపై ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ప్రశ్న లేవనెత్తారు. ఒంగోలు ఐఐటీ తాత్కాలిక క్యాంపస్ వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇడుపులపాయ, ఒంగోలు మధ్య విద్యార్థులు తిరగాల్సి వస్తోందని, ఇది తీవ్ర ఇబ్బందికరంగా ఉందని ఎమ్మెల్యే వివరించారు. ఎమ్మెల్యే సింధూర రెడ్డి ప్రశ్నకు మంత్రి నారా లోకేశ్ సమాధానం ఇచ్చారు. పుట్టపర్తిలో ఐఐటీ ఏర్పాటు ప్రతిపాదన లేదని మంత్రి స్పష్టం చేశారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలో అక్రమాలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సభలో ప్రస్తావించారు. సరైన అనుమతులు లేకుండానే కొందరు కాలేజీలు పెడుతున్నారని ఎమ్మెల్యే బత్తుల ఆరోపించారు. దీనిపై మంత్రి లోకేశ్ సమాధామిస్తూ.. అక్రమాలపై వివరాలు తెలియజేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏయే కాలేజీలకు అనుమతులు ఇచ్చారనే దానిపై తన దృష్టికి తీసుకురావాలని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. పుత్తూరు పురపాలక సంస్థ ఛైర్మన్‌పై తప్పుడు కుల ధ్రువీకరణ ఆరోపణలకు సంబంధించి సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి నారాయణ సమాధానం ఇచ్చారు. పుత్తూరు పురపాలక సంస్థ ఛైర్మన్‌ను ఇప్పటికే తొలగించినట్లు మంత్రి స్పష్టం చేశారు. ఎమ్మెల్యే భాను ప్రకాశ్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో స్థానిక ఎన్నికలు ఎలా జరిగాయో అదరికీ తెలుసని.. తప్పుడు సర్టిఫికెట్లతో పదవులు పొందారని తెలిపారు. గత ప్రభుత్వం స్థానిక వ్యవస్థలను కూడా నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. రిజర్వ్ స్థానాలను కూడా గత ప్రభుత్వం కాజేసిందని ఆరోపిస్తూ.. దీనిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటారా అని ఎమ్మెల్యే భాను ప్రకాశ్ ప్రశ్నించారు. దీనిపై మంత్రి నారాయణ సమాధానం ఇస్తూ.. జీవో 135లో అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చినట్లు తెలిపారు. సభ్యులు అడిగినట్లు అదనపు చర్యలు ఏమి తీసుకోవచ్చో పరిశీలిస్తామని మంత్రి నారాయణ పేర్కొన్నారు. విజయవాడలోని సెంట్రల్ నియోజకవర్గ పరిధిలోని పాయకాపురం ప్రాంతంలో ప్రభుత్వ జూనియర్ ఇంటర్మీడియట్ కాలేజీని డిగ్రీ కాలేజీ వరకు అప్ గ్రేడ్ చేయాలి. రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇక్కడే మొదటిసారి ప్రవేశ పెట్టడం జరిగింది. సుమారు రూ.15కోట్ల వ్యయంతో అదనపు బిల్డింగ్ నిర్మాణం ఖర్చు చేయడం ద్వారా డిగ్రీ కాలేజి పూర్తి అవుతుంది. ఎందుకంటే అనేకమంది పేదలు, ఆటో కార్మికులు, తాపీ కూలీలు ఈ నియోజవర్గంలో ఉన్నారు. ఇక్కడ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ లేదు. ఆడపిల్లలు డిగ్రీ కాలేజీలో చదువుకోసం నగరంలోని వేరొక ప్రాంతాలకు వెళ్ళవలసి వస్తున్నది. చాలా ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ఇంటర్మీడియట్ కాలేజీ విద్యార్థులు ఆదుకోవడానికి, కాలేజీ చుట్టూతా ప్రహరీ గోడ, మిగిలిన వాటి నిమిత్తం మంత్రి లోకేష్ 20లక్షలు కేటాయించగా, సంవత్సరం పొడువునా ఆ గోడ నిర్మాణం జరిగి ఇటీవల పూర్తి చేశారు. ప్రక్కన బీసీ సంక్షేమ హాస్టల్ ఉంది. హాస్టల్కు కూడా నిధులు కేటాయించాలి. జగ్గయ్యపేట నియోజకవర్గంలో తీవ్రంగా నెలకొన్న సాగునీటి సమస్యపై ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ శాసనసభలో జీరో అవర్ సందర్భంగా గళం విప్పారు. బోనకల్లు బ్రాంచ్ కాల్వ పరిధిలోని వత్సవాయి, వీర్లపాడు, నందిగామ మండలాలకు చెందిన వేలాది ఎకరాల భూములు పూర్తిగా ఈ కాల్వపైనే ఆధారపడి ఉన్నాయని, అయితే అవసరమైన స్థాయిలో నీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు. బోనకల్లు బ్రాంచ్ కాల్వ సామర్థం 1350 క్యూసెక్కులు కాగా,

ప్రస్తుతం కేవలం 900 క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేస్తున్నారని పేర్కొన్నారు. దీంతో బోనకల్లు మండలం దాటిన తర్వాత కాల్వలో నీరు ముందుకు వెళ్లడం లేదని, వత్సవాయి మండలానికి 30 క్యూసెక్కులకు మించి నీరు రావడం లేదని తెలిపారు.

# టిడిపి ఎమ్మెల్యే కొలకపూడికి పల్లా శ్రీనివాస్ తీవ్ర హెచ్చరికలు

**విజయవాడ ఫిబ్రవరి 12 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్‌తో తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ సమావేశమయ్యారు. అసెంబ్లీ లాబీలో కొలికపూడితో ఆయన మాట్లాడారు. కొలికపూడి వ్యవహార శైలిపై విమర్శలు వస్తున్న నేపథ్యంలో సీఎం చంద్రబాబు ఆదేశాలుగా ఆయనకు పల్లా తీవ్ర హెచ్చరికలు చేశారు. పార్టీ లేకపోతే వ్యక్తిగతంగా జీరో అనే విషయాన్ని గుర్తించి ప్రవర్తించాలని హితవు పలికారు. పార్టీ క్రమశిక్షణ దాటి ప్రవర్తిస్తే చూస్తూ ఊరుకునేందుకు సీఎం సిద్ధంగా లేరన్నారు. ఎన్నిసార్లు మందలించినా పద్ధతి మార్చుకోకుండా తప్పుల మీద తప్పులు చేస్తే పార్టీ ఎమ్మెల్యేగా గుర్తించడం మానేస్తుందని పల్లా శ్రీనివాస్ స్పష్టం చేశారు.

# తిరుమలలో తెలంగాణ డిసిఎం భట్టి

## - నేటి ఉదయం శ్రీవారి దర్శనం



**తిరుమల,ఫిబ్రవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గురువారం సాయంత్రం తిరుమలకు వచ్చారు. పద్మావతి అతిధిగృహం వద్ద వసతికల్పన విభాగం ఒఎస్‌డి సత్రానాయక్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. రాత్రికి తిరుమలలోనే బసచేస్తున్న భట్టి నేటి ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు. తెలంగాణాలో ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించాలని, తెలంగాణ ప్రజలకు మరిన్ని సంక్షేమ పథకాలు అమలుచేసే శక్తిని కాంగ్రెస్ ప్రభుత్వానికి కలగజేయాలని వేడుకోనున్నారు.

## కాలంచెల్లిన భవనాలపై నిర్లక్ష్యమేనా! - టెండర్ స్థాయికి చేరినా జాప్యమే

**తిరుమల,ఫిబ్రవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలలో పాతబడిన, కాలంచెల్లిచన వసతి గృహాల భవనాలపై టిటిడి నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎందుకనే విమర్శలు భక్తుల్లో వ్యక్తమవుతోంది. ఇప్పటికే తిరుమలలో పురాతన కాటేజీలను గుర్తించిన టిటిడి అధికారులు వాటి స్థానంలో కొత్తవి అధునాతనంగా నిర్మించేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. అయితే అప్పట్లో టిటిడి బోర్డు లేకపోవడంతో అధికారులు దాతల సహకారంతో వాటి స్థానంలో కొత్తవి నిర్మించాలని భావించారు. మళ్ళీ ఆ ప్రతిపాదనలు ఆచరణకు రాలేదు. వసతికల్పన విభాగం అధికారులు కూడా తిరుమలలో భక్తులకు ప్రయోజనం లేని కాటేజీలను గుర్తించారు. భక్తుల నుండి వచ్చిన ఫిర్యాదులతో సుదర్శన్ ,గోవర్దన్, కల్యాణి, సిటైప్ క్వార్టర్స్, పద్మావతిప్రాంతంలోని కొన్ని విశ్రాంతి గృహాల స్థానంలో అధు నాతనంగా నిర్మిం చాలని నిర్ణ యించారు.

# రాష్ట్ర ప్రభుత్వంచే పట్టువస్త్రాల సమర్పణ



**శ్రీశైలం ప్రాజెక్టు ఫిబ్రవరి 12, ప్రభాత వార్త.** మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని గురువారం నాడు సాయంకాలం రాష్ట్ర ప్రభుత్వం తరుపున రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, స్థానిక శాసనసభ్యులు బుడ్డా రాజశేఖరరెడ్డితో కలిసి శ్రీస్వామిఅమ్మ వార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. ఈ సమర్పణ కార్యక్రమంలో దేవదాయ కమిషనరు, కె. రామచంద్ర మోహన్, జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ ఎస్.ఎస్. చంద్రశేఖర ఆజాద్ , ధర్మకర్తల అధ్యక్షులు పోతుగుంట రమేష్ నాయుడు, కార్యనిర్వహణాధికారి యం.శ్రీనివాసరావు వారు పలువురు ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమములో ముందుగా ఆలయ రాజగోపురం వద్ద వస్త్ర సమర్పణ సంకల్పం, వస్త్రాలకు పూజాదికాలు మొదలైన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మంత్రి మరియు స్థానిక శాసనసభ్యుల మేళతాళాలతో ఆలయ ప్రవేశం చేసి ప్రదక్షిణ పూర్వకంగా స్వామిఅమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించారు. కాగా ఎంతో చారిత్రక ప్రసిద్ధి పొందిన శ్రీశైలక్షేత్రంలో ఎందరో చక్రవర్తులు, రాజులు, రాజకుటుంబీకులు మొదలైన వారు ఆయా ఉత్సవ సందర్భాలలో శ్రీ స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించేవారని ప్రతీతి. ఈ సంప్రదాయాన్ని అనుసరించే రాష్ట్ర ప్రభుత్వం ఏటా మహాశివరాత్రి మరియు దసరా మహోత్సవాలలోనూ శ్రీ స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలను అనవాయితీగా సమర్పిస్తోంది.

# ఎమ్మెల్యేలతో మంత్రి లోకేష్ డిన్నర్ మీటింగ్‌లు

**విజయవాడ,ఫిబ్రవరి12,ప్రభాతవార్తప్రతినిధి:** పార్టీ బలోపేతం విషయంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ వినూత్న పంథా ఎంచుకున్నారు. పార్టీని గ్రౌండ్ లెవల్ నుంచి బలోపేతం చేసేందుకు సరికొత్త వ్యూహాలకు పదును పెడుతున్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల వేళ..ఎమ్మెల్యేలు, క్యాడర్‌కు మరింత దగ్గరయ్యేలా డిన్నర్ మీటింగ్స్‌కు శ్రీకారం చుట్టారు. కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా..ఆత్మీయ వాతావరణంలో ప్రతి రోజూ ఏడుగురు ఎమ్మెల్యేలతో భోజనం చేస్తూ..వారి మనోగతాలు తెలుసుకుంటున్నారు. ఈ నిర్ణయం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. ఈ సమావేశాల్లో ప్రధానంగా నియోజకవర్గాల అభివృద్ధి, పెండింగ్‌లో ఉన్న సమస్యలపై ఎమ్మెల్యేలను ఆరా తీస్తున్నారు నారా లోకేష్. జిల్లాల వారీగా ఎమ్మెల్యేలతో ముఖాముఖి సమావేశాలు నిర్వహిస్తూ, వారి వ్యక్తిగత యోగక్షేమాలతో పాటు స్థానిక పరిస్థితులను అడిగి తెలుసుకుంటున్నారు. సమస్య ఏదైనా ఉంటే వెంటనే పరిష్కరించేలా అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు. కేవలం ఆఫీసు గోడల మధ్య కాకుండా, డైనింగ్ టేబుల్‌పై సాగే చర్చల వల్ల ఎమ్మెల్యేలతో ఎమోషనల్ బాండింగ్ ఏర్పడుతుందని లోకేష్ భావిస్తున్నారు. మొదటిసారి ఎమ్మెల్యేలుగా గెలిచిన వారిపై లోకేష్ స్పెషల్ ఫోకస్ పెట్టారు. అనుభవం లేక కొంతమంది చేస్తున్న చిన్నపాటి పొరపాట్లను సరిదిద్దేందుకు ఈ వేదికను వాడుకుంటున్నారు. వార్నింగ్, గదమాయింపులు కాకుండా.. ఓ ఫ్రెండ్‌లా, ఓ మెంటార్‌లా పాలనపై అవగాహన కల్పిస్తున్నారు. హైకమాండ్‌కు, యువ ఎమ్మెల్యేలకు మధ్య ఉన్న దూరాన్ని తగ్గించి, వారిలో ఆత్మవిశ్వాసం పెంచడం ద్వారా పార్టీకి క్రమశిక్షణ కలిగిన నాయకత్వాన్ని అందించడమే ఈ సమావేశాల వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం. టెక్నాలజీని వాడుకుంటూ డాష్ బోర్డుల ద్వారా డెవలప్‌మెంట్‌ను పర్యవేక్షించడమే కాదు.. క్షేత్రస్థాయిలో మనుషులతో మమేకమవ్వడం తన శైలి అని లోకేష్ నిరూపిస్తున్నారు. సీనియర్లకు సముచిత గౌరవం ఇస్తూనే, యువ నాయకత్వాన్ని ప్రోత్సహిస్తున్న తీరు పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని కలిగిస్తోంది. ఈ డిన్నర్ మీటింగ్స్ ద్వారా ఆయన వేస్తున్న అడుగులు అటు పార్టీ ఐక్యతను, ఇటు ప్రభుత్వ పనితీరును మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## స్వామి ఆశీస్సులందుకున్న సినీదర్శకుడు రాఘవేంద్రరావు

**తిరుమల,ఫిబ్రవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి ఆశీస్సులు అందుకున్నట్లు సినీదర్శకుడు రాఘవేంద్రరావు తెలిపారు. దర్శనం చేసుకోవడం ఆనందం.

IDBI BANK ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్
రాజమండ్రి బ్రాంచ్, డి.నెం.46-22-11, కర్రి సూరి రెడ్డి ప్లాజా, దానావాయిపేట పార్కు రోడ్డు, రాజమండ్రి-533103, ఆంధ్రప్రదేశ్

APPENDIX IV (రూలు 8(1)) స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (2002 యొక్క 54) ప్రకారము **ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002 నందలి సెక్షన్13(12)కు అనుబంధమైన రూలు 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో **ఋణగ్రహీతలు: శ్రీమతి దుర్గ ముత్రకేరు మరియు శ్రీ యేసు ముత్రకేరు** వారు చెల్లించవలసిన బకాయి మొత్తం **తేది: 15.10.2025 నాటికి రూ.4,51,379.64 పై.** (అక్షరాల నాలుగు లక్షల యాభై ఒక వేల మూడు వందల డెభై తొమ్మిది రూపాయల అరవై నాలుగు పైసలు మాత్రమే) + **తేది:16.10.2025** నుండి వ్యయాలు, ఛార్జీలు మరియు భవిష్య వడ్డీతో కలిపి నోటీసు తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **తేది.27-10-2025న డిమాండ్ నోటీసు** జారీ చేయబడినది.

ఋణగ్రహీత బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టములోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ 4కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి రూలు 8 ప్రకారము **తేది.10-02-2026న** దిగువ పేర్కొన్న ఆస్తిని **స్వాధీనత** తీసుకోవడమైనదని ప్రత్యేకంగా ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవిలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా చెల్లించవలసిన బకాయి మొత్తం **తేది: 15.10.2025 నాటికి రూ.4,51,379.64 పై.** (అక్షరాల నాలుగు లక్షల యాభై ఒక వేల మూడు వందల డెభై తొమ్మిది రూపాయల అరవై నాలుగు పైసలు మాత్రమే) + **తేది:16.10.2025** నుండి వడ్డీ మరియు ఇతర ఖర్చులు **ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్** వారి ఛార్జీకి లోబడి వుండునని ఇందుమూలముగా ప్రత్యేకించి ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది.

చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనల ప్రకారం ఋణగ్రహీతలు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవడానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించడమునకై శ్రద్ధ వహించవలెను.

స్థిరాస్తి వివరములు

**శ్రీమతి ముత్రకేరు దుర్గ గారికి చెందిన సొంత మరియు తనఖా ఆస్తి : షెడ్యూలు-ఎ:** తూర్పుగోదావరి డిస్ట్రిక్ట్ రిజిస్ట్రేషన్, అమలాపురం సబ్ రిజిస్ట్రార్, అమలాపురం మున్సిపాలిటీ పరిధిలో, అమలాపురం ఏరియా, సర్వే నెం.125/1ఎలో మొత్తం ఎ.6.26 సెంట్లు భూమి. షెడ్యూలు-బి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం/కేంద్రపాలిత ప్రాంతం, తూర్పు గోదావరి జిల్లా, అమలాపురం తాలూక/తహసీల్దారు, అల్లవరం, బోడసకుర్రు, వైఎస్ఆర్ జగనన్న నగర్, సర్వే నెం.125/ఎలోని PMAY(U) బ్లాకు నెం.సి-12, మొదటి అంతస్తు నందు 430 చ॥అ॥లు (కామన్ ఏరియాలలోని దామాషావాటాతో కలిపి) కొలతలతో గల ఫ్లాట్ నెం.ఎఫ్ఎఫ్-4 యావత్తు ఆస్తి. **హద్దులు: బ్లాకుకు హద్దులు: ఉత్తరం :** 12.00 మీ॥ల వెడల్పు రోడ్డు, **దక్షిణం:** సి-7, **తూర్పు :** సి-11, **పడమర:** 12.00 మీ॥ల వెడల్పు రోడ్డు. **ఫ్లాట్‌కు హద్దులు: ఉత్తరం:** ఎఫ్ఎఫ్-3, **దక్షిణం:** ఓపెన్ టు స్కై, **తూర్పు:** కామన్ కారిడార్ (1.8 మీ॥లు), **పడమర:** ఓపెన్ టు స్కై.

తేది : 10-02-2026
స్థలం : రాజమండ్రి
సం/- అధీకృత అధికారి
ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్

వార్త

ఒక వ్యక్తి గుణగణాలు పరీక్షించి చూడాలంటే
అతనికి అధికారం ఇచ్చి చూడాలి.
-అబ్రహాం లింకన్

# అవినీతిపై అదుపేది?

ఆయా ప్రపంచ దేశాల అవినీతిని లెక్కగట్టిహెచ్చరించే ఏకైక సంస్థ ట్రాన్స్పరెన్సీ ఇంటర్నేషనల్ ఈ ఏడాది కూడా తన నివేదికను విడుదల చేసింది. అందులో మన దేశానిది 91వ స్థానం వచ్చింది. కానీ తాజా లెక్కలలో 91ర్యాంకులో ఉన్నాం. గత ఏడాది నివేదికతో పోల్చి చూసుకుంటే ఈసారి కాస్త మెరుగైన పరిస్థితి కనపడుతోంది. 2025 సంవత్సరానికి గాను భారత్ మాల్దీవులు, మొరాకో, ట్యునీషియాతో సమాన స్థాయిలో 39 స్కోరుతో 91వ స్థానానికి ఎదిగింది. గత ఏడాదితో పోలిస్తే 1పాయింట్ మెరుగు పడిందన్నమాట.ప్రపంచవ్యాప్తంగా వీటిపరిస్థితి చూస్తే ఆందోళనకరమే. అవినీతికి సంబంధించి ప్రపంచ దేశాల సగటు స్కోరు దశాబ్ద కాలంలో 42కి పడిపోయింది. మూడింట రెండు వంతుల స్కోర్ 50లోపలే ఉంది. ఇదే మరింత ఆందోళనకర పరిస్థితులను సూచిస్తోంది. లంచాలు తీసుకోవడం, అంతే నేరమైన విషయాన్నిభారత దేశ చట్టాలు ఎంత చెప్పినా ప్రభుత్వాధికారులు ఎవరూ పట్టించుకోకపోవడమే భారత దేశ దౌర్భాగ్యం. ఇటీవల కాలంలో వారికి భయం, భక్తి లోపించింది. ఉద్యోగంలో చేరిన వెంటనే బల్లకింద చేతులు పెట్టేస్తున్నారు. ప్రభుత్వాధికారుల తమకు వీలైన పనులు చేయించుకోవడానికి వారికి ఇచ్చేది లంచం.మరో మంచి మాట చెప్పలేము. అధికారిని ఏ విధంగా లోబరచుకొని తమ ప్రయోజనాలుకాపాడుకోవాలనుకున్నా, లంచం ఆశ చూపేవారు,అవినీతిని తప్పుపట్టే వారున్నా,అవినీతి నిరోధక శాఖ అవినీతిపరులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నా సరే వారి గమనంమారదు. ఎప్పటికప్పుడే అనే ధోరణిలో మార్పు చెందలేకపోతున్నారు. దులిపేసుకుని మళ్లీ కొత్తప్రయత్నం. కోట్లాది రూపాయలు సంపాదించినా ఇంకా ఇంకా కావాలనే తాపత్రయ పడతారు. సాధారణంగా రెవెన్యూ శాఖను అతి అవినీతి మయమైన శాఖగా భావిస్తుంటారు.కానీ దాదాపుప్రభుత్వ శాఖలు అన్నిటిలోనూ లంచావతారులున్నారనే అపప్రధ ఉందనే ఉంది. ఆసియా పసిఫిక్ ప్రాంతాల్లో అవినీతి పెచ్చుపెరిగిపోయింది. వాటిని అరికట్టేందుకు ప్రభుత్వాలు చేయని ప్రయత్నాలు లేవు. జీరో పాయింట్లుంటేనే అత్యధిక అవినీతి ఉన్నట్లు లెక్క. ప్రభుత్వ పాలనలోఅవినీతి, బంధు ప్రీతి బాగా పాతుకుపోయిందనేది అందరికీ తెలిసిందే. పలు దేశాల్లో పెచ్చుమీరిన అవినీతిపై యువత ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆయా ప్రభుత్వాల మీద ఎదురు తిరిగిన సందర్భాలు మనకు విదితమే. ఇదే జాబితాలో 89 స్కోరుతో డెన్మార్క్ అతి తక్కువ అవినీతి ఉన్న దేశంగా నిలిచింది. ఫిన్లాండ్, సింగపూర్, న్యూజిలాండ్, నార్వే,స్వీడన్, స్విట్జర్లాండ్, లక్సెంబర్గ్, నెదర్లాండ్స్, జర్మనీతో మొదటి టెన్‌లోఉన్నాయి. అవినీతి సమస్య వల్ల అనేక దేశాలు రాజకీయ ఆర్థిక సంక్షోపాలు బారిన పడ్డాయి. అవినీతి అక్రమార్జనలకు సంబంధించిన విశేషాలు అప్పట్లో పనామాపత్రాలు బయటిపెట్టి సంచలనం సృష్టించాయి. అక్రమ మార్గంలో కూడపెట్టిన లక్షలాది కోట్ల ధనాన్ని ఇతర దేశాలకు తరలించిన తీరు మనకు తెలిసిందే. అవినీతి మహమ్మారిని సమర్థంగా ఎదుర్కొనేందుకు అమెరికా, ఫ్రాన్స్ దేశాలు ఒక ప్రణాళికతో ముందుకు నడుస్తున్నాయి. కాగా అవినీతి వ్యతిరేకంగా దేశాల్ని కలిసికట్టుగా పోరాడాలనే స్ఫూర్తి ఎక్కడా లేకపోయింది. భారత దేశం విషయానికి వస్తే ప్రభుత్వవిభాగాల్లోఊడలు పెంచుకున్న అవినీతికి అడ్డుకట్ట వేయడం చాలా కష్టం అవుతుంది. ప్రభుత్వ విభాగాల్లో అధికారులు ఎన్ని విధాలుగా అవినీతి కార్యక్రమాలకు పాల్పడుతున్నారో తేటతెల్లమే. అలాంటి అవినీతిపరులు సస్పెన్షన్ అవుతారు. ఆ తర్వాత మళ్లీ రాజకీయ ప్రాబల్యంతో తిరుగుతారు. ఇవన్నీఎక్కడికి దారితీస్తాయి?అవినీతిని నిరోధించే మూల సూత్రాలు కూడా పక్కనపెట్టి వారిని అందలం ఎక్కిస్తున్నారు. అదే వ్యవస్థలోని లోపం. ప్రజాధనాన్ని సొంత ఆస్తిగా మెక్కేసే అధికారులకు అడ్డు అదుపు లేకుండా పోతోంది. అందుకు బాధ్యులైన వారు కూడా గతంలో ఎంతో జాగ్రత్తగా వ్యవహరించేవారు. భయపడేవారు. ఇప్పుడు భయపడే పరిస్థితి ఏమి లేదు. స్వాతంత్ర్యం వచ్చిన వచ్చిన నాటి నుండి ఇప్పటివరకు ప్రధానమైన కుంభకోణాల్లో దాదాపు 100లక్షల కోట్ల ప్రజాధనం కొల్లగొట్టినట్లు ఒక అంచనా. ప్రధానంగా రాజకీయ పదవుల్లో ఉన్నవారే అవినీతికి పాల్పడుతుంటే వారు శాసనాలు ఏమి చేయగలరు, వాటిని అమలుపరిచే విషయంలో ఏ విధంగా సహాయ పడగలరు అన్న విషయాలన్నీ తెరమీద అందరికీ తెలిసిన విషయమే ఇలాంటి పరిస్థితులు అవినీతిని ఎండగట్టే స్థితిలోఉండవు. అవినీతిపరులను కఠినంగా శిక్షించే చట్టాలు లేకపోవడం ఒక వెనుకబాటు. అవినీతి అవగాహన సూచిక 2025ప్రకారం, ప్రపంచంలోని ప్రతి ప్రాంతంలోనూ అవినీతి తీవ్రమైన ముప్పుగా ఉంది. ప్రభుత్వరంగ అవినీతి స్థాయిల ఆధారంగా ప్రపంచ వ్యాప్తంగా 182 దేశాలను ర్యాంక్ చేస్తుంది. ఫలితాలు '0' అత్యంత అవినీతి,నుండి 100 రాంక్ అనగానే అవినీతి రహితమని ఇక్కడ అర్థం.2012 నుండి 31దేశాలు తమ అవినీతి స్థాయిలను గణనీయంగా తగ్గించుకున్నప్పటికీ, మిగిలినవి సమస్యను పరిష్కరించడంలో విఫలమవుతున్నాయి. ప్రపంచ సగటు 42కొత్త కనిష్ట స్థాయికి పడిపోయింది. అయితే మూడింట రెండువంతుల కంటే ఎక్కువ దేశాలు 50 కంటే తక్కువ స్కోరు సాధించాయి. ప్రజా ప్రతినిధులు కూడా సుపరిపాలన అందించడంకన్నా తమ సొంత ప్రయోజనాలు కాపాడేందుకే కాలంవెచ్చిస్తున్నారని అనిపిస్తోంది.అవినీతిని అరికట్టేందుకు ప్రభుత్వాలు కంకణం కట్టుకున్ననాడే దేశం సుభిక్షంగాఉంటుంది. ప్రధానంగా ఈదేశాన్ని పట్టిపీడిస్తున్న అవినీతి ముందుగారాజకీయ అవినీతిని నిర్మూలించగలిగితేనే సాధ్యమౌతుంది.

ఒకే భాషను శాస్త్రీయంగా అభ్యసిస్తే మిగతా భాషలు సులభతరం అవుతాయి.



మహాత్మాగాంధీ

జీవితం ఒక పాఠశాల వంటిది. ఇక్కడ ప్రతి బాధ, ప్రతి హృదయం విదారకత మనకు అమూల్యమైన పాఠాన్ని నేర్పుతుంది.



స్వామి వివేకానంద

# విద్యాభివృద్ధి లేని వికసిత్ భారత్ సాధ్యమేనా?

*దేశంలో ఉన్నత విద్యను అభివృద్ధి చేయకపోవడంతో విద్యా ర్థులు అమెరికా, ఆస్ట్రేలియా, జార్జియా, చైనా, యు.కె. లాంటి దేశాలు వలసలుపోతున్నారు. దీని గురించి కనీస ప్రస్తావన బడ్జెట్లో లేదు. విద్యావేత్తలు, మేధావులు గత అనేక సంవత్సరాలు నుండి కోరుతున్నట్లు జి.డి.పి.లో 6 శాతం నిధులు కేటాయింపు కూడా లేదు. సంకుచితమవుతు న్న ప్రభుత్వ పాఠశాలలు, ఒక్క ఉపాధ్యాయుడే ఉన్న తర గతులు, భారీ డ్రాప్ అవుట్‌లు, వాణిజ్యీకరించిన సంస్థలు, పెరుగుతున్న సామాజిక విభేదాలపై అభివృద్ధి చెందిన భారత్ నిర్మించలేం. వికసిత భారత్ నినాదం కేవలం మాటలకే పరిమితం కాకుండా ఉండాలంటే, ప్రజా విద్యను మళ్లీ సార్వత్రిక హక్కుగా గుర్తించి జాతీయ ప్రాధాన్యతగా పెట్టాలి. లేకపోతే, భారత వృద్ధి విస్తృతంగా కనిపించినా పునాదులు బలహీనంగానే ఉంటాయి.*

టి. నాగరాజు

వికసిత్ భారత్ నినాదంతో యూనియన్ బడ్జెట్ 2026 మౌలిక సదుపాయాలు, డిజిటలైజేషన్, తయారీ రంగం, ప్రపంచ పోటీతత్వం వంటి పదాలతో ప్రజల నమ్మకాన్ని పొందే ప్రయత్నం చేస్తోంది. కానీ ప్రజా విద్యా కోణంలో పరిశీలిస్తే, ఈ బడ్జెట్‌లో విద్యకు తీవ్రమైన వ్యతిరేకత కనిపిస్తుంది. నేడు భారత్ అభివృద్ధి కథ ముందుకు సాగుతున్నప్పటికీ, విద్యను సామాజిక హక్కుగా లేదా మౌలిక ప్రజావనరుగా చూడడంలో విఫలమవుతోంది.భారత జిడిపి పెరుగుతోందని ప్రభుత్వం చెబుతున్నా, ఆ వృద్ధికి అనుగుణంగా విద్యపై ఖర్చుపెరగడం లేదు. విద్య వ్యయంపై నామమాత్రపు పెరుగుదలను ప్రభుత్వం చూపిస్తోంది. కానీ ద్రవ్యోల్బణం, నమోదు పెరుగుదల, వ్యవస్థాపక ఖర్చులు లెక్కలోకి తీసుకుంటే, ఈసంఖ్యలు తప్పుదారిపట్టించేవే. 2026-27 బడ్జెట్‌లో విద్య మంత్రిత్వ శాఖకు కేటాయింపు చేసినది రూ.1,39,289 కోట్లు కాగా, 2025-26లో ఇది రూ. 1,28,650 కోట్లు. నామమాత్రంగా పెరుగుదలఉన్నా, వాస్తవ (ద్రవ్యోల్బణ సర్దుబాటు చేసిన) వ్యయం స్థిరంగా ఉంది. మొత్తం జిడిపిలో విద్య ఖర్చు సుమారు 3-4శాతం మాత్రమే ఉంది. ఇది జాతీయ విద్యా విధానం (ఎనఈపి) సూచించిన 6శాతం లక్ష్యానికి చాలా తక్కువ. కేంద్ర ప్రభుత్వ కేటాయింపు కేవలం జిడిపిలో 0.3 శాతం మాత్రమే. మొత్తం అంచనా ఖర్చు రూ. 53.5 లక్షల కోట్లలో విద్య వాటా సుమారు 2.6 శాతం మాత్రమే. అనుపాతంగా చూస్తే, జిడిపి పెరుగుతున్నప్పటికీ విద్యకు ప్రాధాన్యం తగ్గుతోంది. ఇతర దేశాలతో పోలిస్తే ఈ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది. జపాన్, చైనా, యునైటెడ్ కింగ్‌డమ్ వంటి దేశాలు తమ జిడిపిలో 6 శాతం లేదా అంతకంటే ఎక్కువను విద్యపై ఖర్చుచేస్తున్నాయి. ఆర్థికబలం, ఆవిష్కరణలు, సామాజిక స్థిరత్వానికి ప్రజా పెట్టుబడి కీలకమని అవి గుర్తించాయి. కానీ భారతదేశం విద్యకు తగిన పెట్టుబడి లేకుండా ప్రపంచ శక్తిగా మారాలనే ఆశయం బలహీనమైన పునాదిపై నిలబడి ఉంది. ఈ నిర్లక్ష్యం ప్రభావం నేల మీద ఇప్పటికే కనిపిస్తోంది. 2014-15లో 11,07,101 ఉన్న ప్రభుత్వ పాఠశాలలు 2023-24 నాటికి 10,17,660కు తగ్గాయి. గత దశాబ్దంలో 89,441 ప్రభుత్వ పాఠశాలలు మూసివేయబడ్డాయి. 'సమర్థత' పేరుతో తీసుకున్న నిర్ణయాలు గ్రామీణ, గిరిజన, అంచున ఉన్నవర్గాలపై తీవ్ర ప్రభావం చూపాయి. పిల్లలు ఎక్కువ దూరం ప్రయాణించాల్సి వస్తోంది. చదువు మానేయాల్సి వస్తోంది. పాఠశాలల మూసివేత లేదా విలీనం అనే సంక్షోభంపై బడ్జెట్ 2026 మౌనం వహిస్తుంది.బడ్జెట్ 2026లో అత్యంత పెద్దలోపం, భారీ స్థాయిలో ఉపాధ్యాయ నియామకాల లేమి. ప్రపంచంలో అతిపెద్ద విద్యా వ్యవస్థలలో ఒకటైన భారత్‌లో ఉపాధ్యాయుల కొరత తీవ్రమైంది. 33లక్షల మంది విద్యార్థులు ఒక్క ఉపాధ్యాయుడే ఉన్న పాఠశాలల్లో చదువు తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నేర్చుకునే నాణ్యత మెరుగ వుతుందని ఆశించడం వాస్తవాలకు విరుద్ధం. డిజిటల్ ప్లాట్ ఫామ్‌లు, పాఠ్యాంశాలలో మార్పులు లాంటి చర్యలు శిక్షణ పొందిన, భద్రతకల్గిన, తగిన వేతనం పొందే ఉపాధ్యాయులకు ఏమాత్రం ప్రత్యామ్నాయంకావు. ప్రభుత్వ విద్యాసంస్థలలో తగిన పెట్టుబడి లేకపోవడం వల్ల డ్రాప్ అవుట్‌లు పెరుగుతున్నాయి. ఇప్పటివరకు 65.7 లక్షల మంది పిల్లలు పాఠశాల వ్యవస్థ నుంచి బయటకువచ్చారు. వీరిలోదాదాపు సగం మంది బాలికలే. ఇది పేదరికం, పాఠశాల మూసివేతలు, మాధ్యమిక పాఠశాలల కొరత, అసురక్షిత ప్రయాణం, ప్రజా మద్దతు లేకపోవటం వంటి అంశాలతో సంబంధం కలిగి ఉన్నాయి. ఈ సమస్యను ఎదుర్కొనేందుకు బడ్జెట్



2026లో పునర్నమోదు, వారిని స్థిరంగా చేయడం నిలుపుదల, సామాజిక మద్దతుకు సమగ్ర వ్యూహం ఈ బడ్జెట్‌లో లేదు. ఈ బడ్జెట్ ప్రభుత్వ విద్యా సంస్థలను బలపరచడం బదులు, ఎన్ఈపికి అనుసంధానమైన అంశాలపై ఎక్కువగా దృష్టి పెడుతోంది అకాడెమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్ (ఎబిసి), నేషనల్ క్రెడిట్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్‌సిఆర్ఎఫ్), అపార్, పరఖ్, పిఎమ్ శ్రీ, దీక్ష వంటి పథకాలు. అదేవిధంగా పబ్లిక్‌ప్రైవేట్ భాగస్వామ్య (పిపిపి)మోడల్‌ను విద్యలో ముందుకు తీసుకు వస్తోంది. ఇది సామర్థ్యం, ఆవిష్కరణ పేరుతో ప్రభుత్వ విద్యాసంస్థలను వాణిజ్యపరంగా మార్చి,ఖర్చును విద్యార్థులు,వారి కుటుంబాలపై మోపి, ప్రభుత్వ విద్యను ప్రైవేట్ లాభాలకు తలుపులు బార్లా తెరుస్తోంది. ఉన్నత విద్యలో అంతర్జాతీయీకరణ, పరిశ్రమ విద్యాసంస్థల భాగస్వామ్యం, వికసిత భారత్ శిక్షా అధిష్టాన్ (విబిఎస్ఎ)బిల్లుతో తీవ్రమైన కేంద్రీకరణ ద్వారా నియంత్రణ వ్యవస్థ ప్రతిపాదన ఇవన్నీ అధిక కేంద్రీకరణను, మార్కెట్ దృక్పథాన్ని సూచిస్తున్నాయి. ప్రజా పెట్టుబడికి బదులు నియంత్రణ పునర్వ్యవస్థీకరణకు ప్రాధాన్యం ఇస్తూ, ప్రజాస్వామ్య నియంత్రణను, సంస్థాగత స్వతంత్రతను బలహీనపరుస్తున్నాయి. అంతిమంగా చూస్తే, ప్రస్తుత విధానాల కింద రూపొందుతున్న విద్యా వ్యవస్థ అత్యంత సాధనోపయోగంగా ఉంది. ఇది కొద్దిమంది అత్యంత నైపుణ్యం గల ఎలైట్‌వర్గాన్ని తయారు చేయడమే కాకుండా, అస్థిర కార్మిక మార్కెట్‌కు సరిపోయే అర్ధనైపుణ్యం గల పెద్ద సంఖ్యలో కార్మికులను సృష్టిస్తోంది. అదేసమయంలో, అర్ధశిక్షణ పొందిన డ్రాప్ అవుట్‌ల పెద్దసమూహం ఏర్పడుతోంది. ఇది యాదృచ్ఛికం కాదు. దీర్ఘకాలిక తక్కువ పెట్టుబడి ప్రైవేటీకరణ ఫలితం. ఈ బడ్జెట్ పూర్తిగా అభివృద్ధి రహితమైనది. మైనారిటీలు, చారిత్రాత్మకంగా అణగారిన వర్గాలపై ప్రత్యేక దృష్టిలేదు. ప్రవేశాలు నైపుణ్యం,నేర్చుకునే పద్ధతుల్లో ఉన్న అసమానతలను పట్టించుకోవడం లేదు. సామాజిక నిర్మాణాత్మక అసమానతలను పట్టించుకోకుండా జాతీయ విధానమని చెప్పుకోవడం ప్రజాస్వామ్యంగా చెప్పలేం. ఈ నిర్లక్ష్యం పాఠశాలలు, విశ్వవిద్యాలయాలకే పరిమితం కాదు. మధ్యాహ్న భోజన పథకం వంటి పునాది సంక్షేమ విద్యా వ్యవస్థలకూ విస్తరించింది. అంగన్‌వాడి పోషణ్ 2.0కు 2026-27లో కేటాయింపు రూ.23,100 కోట్లు మాత్రమే (గత సంవత్సరం రూ.21,960 కోట్లు). పోషకాహార ఖర్చు ప్రమాణాలు పెరుగుతాయని హామీ ఇచ్చినా, ఇది రోజుకు ఒక్కో పిల్లకు కేవలం 38 పైసల పెరుగుదల మాత్రమే.3.38 లక్షల అంగన్‌వాడీ కేంద్రాలకు తాగునీరు లేదు, 4.61 లక్షలకు మరుగుదొడ్లు లేవు. గత నాలుగేళ్లలో కేవలం 60,000 కేంద్రాలే అభివృద్ధి చేయబడ్డాయి. ఇది బాల్యవిద్య, పోషణ పునాదినే దెబ్బతీస్తోంది. మొత్తంగా చూస్తే,బడ్జెట్ 2026 విద్యను సామాజిక హక్కుగా కాకుండా మార్కెట్ ఆధారిత సేవగా మార్చుతోంది. నైపుణ్యాలు, క్రెడిట్లు, ఉద్యోగయోగ్యతకు ప్రాధాన్యం ఇస్తూ, ప్రజా పెట్టుబడి, ఉపాధ్యాయ నియామకాలు, సామాజిక రక్షణను పక్కన పెడుతోంది. ఇవన్నీ పేదరికం, ప్రాంతీయ అసమతుల్యత, లింగవివక్ష, రాష్ట్ర ఉపసంహారణ వల్ల ఏర్పడిన నిర్మాణాత్మక అసమానతలపై తాత్కాలికం మాత్రమే. దేశంలో ఉన్నత విద్యను అభివృద్ధి చేయకపోవడంతో విద్యార్థులు అమెరికా, ఆస్ట్రేలియా, జార్జియా, చైనా, యు.కె. లాంటి దేశాలు వలసలుపోతున్నారు. దీని గురించి కనీస ప్రస్తావన బడ్జెట్లో లేదు. విద్యావేత్తలు, మేధావులు గత అనేక సంవత్సరాలు నుండి కోరుతున్నట్లు జి.డి.పి.లో 6 శాతం నిధులు కేటాయింపు కూడా లేదు. సంకుచితమవుతున్న ప్రభుత్వ పాఠశాలలు, ఒక్క ఉపాధ్యాయుడే ఉన్న తరగతులు, భారీ డ్రాప్ అవుట్‌లు, వాణిజ్యీకరించిన సంస్థలు, పెరుగుతున్న సామాజిక విభేదాలపై అభివృద్ధి చెందిన భారత్ నిర్మించలేం. వికసిత భారత్ నినాదం కేవలం మాటలకే పరిమితం కాకుండా ఉండాలంటే, ప్రజా విద్యను మళ్లీ సార్వత్రిక హక్కుగా గుర్తించి జాతీయ ప్రాధాన్యతగా పెట్టాలి. లేకపోతే, భారత వృద్ధి విస్తృతంగా కనిపించినా పునాదులు బలహీనంగానే ఉంటాయి. •

# ఆహార దుర్వినియోగాన్ని నివారించాలి

డాక్టర్. వై. సంజీవ కుమార్

మనిషి మనుగడకు ప్రాణవాయువు ఎంత అవసరమో, ఆహారం అంతే అవసరం. అలాంటి ఆహారాన్ని నిర్లక్ష్యంగా వృథా చేయడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనం. నేడు ఆహారాన్ని వృథా చేసే వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. ఒకవైపు ఆహారం చెత్తబుట్టల్లో పడిపోతుంటే, మరోవైపు ఒక్కపూట భోజనం కోసం ఆశగా ఎదురుచూస్తూ జీవిస్తున్న అభాగ్యులు ఎందరో ఉన్నారు. ఆకలి బాధ తాళలేక మరణించిన వాళ్లు ఎందరో ఉన్నారు. ఆకలి కేవలం శరీరబాధనే కాదు అంతరాత్మను క్షోభపెట్టె బాధ. ఆకలితో జీవించడం అత్యంత దుర్భరమైన అనుభవం. ఆకలిబాధను అనుభవించినవారికే ఆ కష్టం విలువ తెలుస్తుంది. అవసరానికి మించి ఆహారం వండటం, ఫంక్షన్లకు వెళ్లి ఆకలి లేకున్నా ఎక్కువగా తీసుకుని పూర్తిగా తినకుండా వదిలేయడం వంటి చర్యలు చిన్న తప్పుగా భావించవచ్చు. కానీ బాధ్యతారాహిత్యాన్ని సూచిస్తుంది. నేటి ఆధునిక పోకడల్లో మనిషి విలువలకన్నా ఆడంబరాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాడు. స్తోమతకు మించి శుభకార్యాలు చేయడం ఒక ఫ్యాషన్‌లా మారిపోయింది. వాళ్లు ఇలా చేసారు.. వీళ్లు అలా చేసారు అనే పోలికలతో, పోటీ భావనతో, గ్రాండ్‌గా చేయకపోతే ఎవ్వరో ఏదో అనుకుంటారు అనే విపరీత ధోరణిలతో చిన్న శుభకార్యమా.. పెద్ద శుభకార్యమా అనే తేడా లేకుండా అనేక రకాల వంటకాలు సిద్ధం చేస్తున్నారు. పది మంది తినే కార్యక్రమానికి ఇరవై రకాల వంటకాలు, వంద మంది తినే కార్యక్రమానికి ముప్పై రకాల వంటకాలను, మరికొందరి మరిన్ని ఎక్కువ రకాల వంటలను చేయి




స్తున్నారు. ఒక్కో వంటకం రుచి చూడటానికి తీసుకుని సగం సగం తిని మిగతాదంతా చెత్తబుట్టలో వేయడం ఇప్పుడొక సాధారణ దృశ్యంగా మారిపోయింది. ఆహారాన్ని వృథా చేస్తున్నాము అనేది తప్పు అని ఎవ్వరికి అనిపించడం లేదు. కానీ ఆ చెత్తబుట్టలో పడుతున్న ప్రతి గింజ వెనుక ఒక రైతు చెమట ఉంది. శుభకార్యం చేసే కుటుంబం కష్టం ఉంది. ఒక ఆకలితో ఉన్న మనిషి ఆశ ఉంది. పోటీ పడాల్సింది ఆడంబరాల్లో కాదు, మంచి పనుల్లో పడాలి.ఎవరి శుభకార్యం ఎంత గొప్పగా జరిగిందోకాకుండా, ఎంత మంచిగా నిర్వహించామా, ఎంతమందికి ఉపయోగపడిందో అనేదే అసలైన గొప్పతనం. మంచి మార్పులను ఎప్పటికప్పుడు మనిషి అలవాటు చేసుకోవాలి, ఆచరణలో కొనసాగాలి, ఆహారాన్ని వృథా చేయకపోవడం కూడా ఒక గొప్ప సంపాదనే. శుభకార్యాలు, ఇతర వేడుకలు నిర్వహిస్తున్నప్పుడు సమీపంలోని ఆశ్రమాలు, అనాథాశ్రమాలు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ఆహ్వానించి వారికిఆహారం అందిస్తే, వారి ఆకలిని తీర్చడమే కాకుండా ఒకఅపూర్వమైన సంతృప్తి,ఆనందం లభిస్తుంది. ఆహారంపట్ల అందరూబాధ్యతగా ప్రవర్తించే అలవాట్లు చేసుకుంటే, నేటిచిన్నారులు ఆ అలవాట్లను అనుసరిస్తారు,బాధ్యతతో కూడిన నడవడికతో ఆహారాన్ని దుర్వినియోగం చేయకూడదనే మంచి అలవాట్లను నేర్చుకుంటారు,దాని ద్వారా భవిష్యత్తులో వారు ఆహారాన్ని గౌరవించే,వృధాచేయని బాధ్యతాయుతమైన పౌరులుగా మారుతారు. ఆహారాన్ని గౌరవిద్దాం,ఆకలిని తగ్గిద్దాం. •

# ఏఐ పునాదులు బలపడితేనే దేశ భవిష్యత్తు!

ముద్దం నరసింహస్వామి

ప్రతి దేశంలో కృత్రిమ మేధ వేగంగా విస్తరిస్తూ జన జీవనాన్ని ప్రభావితం చేస్తోంది. జనరేటివ్ ఏఐ, లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్, ఆరోగ్య సంరక్షణ, వ్యాధి నిర్ధారణ, రిటైల్, ఫైనాన్స్, పరిశ్రమలు వంటి అనేక రంగాల్లో ఏఐ విప్లవాత్మక మార్పులకు దారితీస్తోంది. అయితే ఈ వేగంలో భారత్ క్రియాశీలంగా ఉన్నప్పటికీ, గ్లోబల్ పోటీలో ఆశించిన స్థాయిలో ముందుకు సాగలేకపోతోంది. పెట్టుబడుల కొరత, మౌలిక వసతుల లేమి, నిపుణ మానవ వనరుల లోపం వంటి అంశాలు దేశీయ ఏఐ వృద్ధికి ప్రధాన అడ్డంకులుగా మారుతున్నాయి.స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ విడుదల చేసిన తాజా ఏఐ నివేదిక ప్రకారం, 2013-2024 మధ్య కాలంలో కృత్రిమ మేధ రంగంలో అమెరికా సుమారు 47 వేల కోట్ల డాలర్ల ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించగా, చైనా దాదాపు 12వేల కోట్ల డాలర్లు సమీకరించింది. అదే సమయంలో భారత్ కేవలం 1,100కోట్ల డాలర్ల పెట్టుబడులతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఇది ప్రపంచంలో డేటా ఉత్పత్తిలో భారత్ వాటా సుమారు 20 శాతం ఉన్నప్పటికీ, డేటా నిల్వ సామర్థ్యం కేవలం 3శాతానికి పరిమితమవుతుండటం గమనార్హం. ఈ అసమతుల్యత ఏఐ ఆధారిత పరిశోధనలు, ఉత్పత్తుల అభివృద్ధిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఏఐ మోడళ్ల శిక్షణకు కీలకమైన జీపీయూల అందుబాటులో లేకపోవడం భారత్‌కు పెద్ద సమస్యగా మారింది. తాజా ఆర్థిక సర్వే కూడా ఇదే అంశంపై హెచ్చరించింది. జీపీయూల కొరత కారణంగా పరిశోధనల వేగం మందగించడం, ఖర్చులు పెరగడం జరుగుతోంది. మరోవైపు, సెమీ కండక్టర్ చిప్‌ల కోసం విదేశాలపై ఆధారపడటం దేశీయ ఏఐ ఎకోసిస్టమ్‌ను మరింత బలహీనపరుస్తోంది. దేశీయంగా నిధులు, మౌలిక వసతులు, మార్కెట్ యాక్సెస్ సరిగా లభించకపోవడంతో భారతీయ ఏఐ స్టార్టప్‌లు అమెరికా వైపు చూస్తున్నాయి. వందకు పైగా ఏఐ సంస్థలు ఇప్పటికే యూఎస్‌కు తరలివెళ్లడం లేదా అక్కడ కార్యకలాపాలు ప్రారంభించేందుకు ప్రయత్నించడం భారత్‌కు హెచ్చరికగా భావించాలి. ఇది బ్రెయిన్ డ్రెయిన్ మాత్రమే కాదు, ఇన్నోవేషన్ డ్రెయిన్ కూడా. అంచనాల ప్రకారం, వచ్చే ఏడాది కల్లా భారత్‌లో ఏఐ రంగంలో 23 లక్షలకు పైగా కొత్త ఉద్యోగాలు ఏర్పడే అవకాశం ఉంది. అయితే ఉన్నత విద్య వ్యవస్థను తక్షణమే సంస్కరించుకోకపోతే, దాదాపు 10 లక్షల ఏఐఉద్యోగాలు నిపుణుల లేమితో ఖాళీగానే మిగిలి పోయే ప్రమాదం ఉంది. ప్రస్తుతం ఏఐ కోర్సులు కొద్ది అగ్రశ్రేణి విద్యాసంస్థలకే పరిమితమయ్యాయి. అధిక శాతం ఇంజినీరింగ్, సైన్స్ కళాశాలల్లో ఏఐ విభాగాలు, ప్రాక్టికల్ ఓరియెంటెడ్ పాఠ్యప్రణాళికలు లేవు. ఈ పరిస్థితుల్లో దేశీయంగా ఆధునిక మౌలిక వసతులనువేగంగా అభివృద్ధి చేయడం అత్యవసరం. ఏఐ మిషన్ కింద భారీ స్థాయిలో జీపీయూలను అందుబాటులోకి తీసుకురావాలి. విశాఖపట్నంలో ఏఐ హబ్, డేటా సెంటర్, అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటు వంటి ప్రణాళికలు మౌలిక




వసతుల పరంగా సానుకూల సంకేతాలే.అయితే ఇవి కేవలం ప్రారంభ దశకే పరిమితం కాకుండా, దేశవ్యాప్తంగా విస్తరించాలి.తాజా అంతర్జాతీయ అధ్యయనాలు సూచిస్తున్న మరో కీలక అంశం స్వదేశీ ఏఐ మోడళ్ల అభివృద్ధి. విదేశీ మోడళ్లపై ఆధారపడటం డేటా భద్రత, వ్యయభారం, వ్యూహాత్మక స్వతంత్రతపై ప్రభావం చూపుతుంది. కాబట్టి ఇండియా తన భాషలు, అవసరాలు, సామాజిక వాస్తవాలకు అనుగుణంగా సొంత లాంగ్వేజ్ మోడళ్లు, అప్లికేషన్లు అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఏఐ కేవలం టెక్నాలజీ రంగానికే పరిమితం కాకుండా, దేశాల ఆర్థిక భద్రత, జాతీయ భద్రత, సామాజిక సమానత్వానికి కేంద్ర బిందువుగా మారుతోంది. అమెరికా, చైనా వంటి దేశాలు ఏఐని స్ట్రాటజిక్ నేషనల్ అసెట్‌గా పరిగణిస్తూ భారీ ప్రభుత్వ-ప్రైవేట్ పెట్టుబడులతో ముందుకెళ్తున్నాయి. భారత్ కూడా ఈమార్గంలో అడుగులు వేస్తున్నప్పటికీ, అవి ఇంకా చెల్లాచెదురుగా ఉన్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి.స్టాన్‌ఫర్డ్ ఏఐ ఇండెక్స్ రిపోర్ట్ ప్రకారం, అమెరికాలో మొత్తం ఏఐ పెట్టుబడుల్లో ప్రభుత్వ వాటా 30 శాతం దాటింది. చైనాలో అయితే ఇది ఇంకా ఎక్కువ. భారత్‌లో మాత్రం ఏఐ పెట్టుబడులు ఎక్కువగా ప్రైవేట్ రంగానికే పరిమితమవుతున్నాయి. దీని ఫలితంగా దీర్ఘకాలిక పరిశోధనలు, ఫౌండేషన్ మోడళ్ల అభివృద్ధి వంటి ఖరీదైన కార్యక్రమాలకు అవసరమైన స్థిర నిధులు అందడం లేదు. ప్రభుత్వం ముందుగా తీసుకోవాల్సిన కీలక నిర్ణయం జాతీయ ఏఐ ఫండింగ్ మోడల్. రక్షణ, అంతరిక్ష రంగాల మాదిరిగానే ఏఐకూ ప్రత్యేక నిధి ఏర్పాటు చేయాలి. ఏఐ పరిశోధనల కోసం ఐఐటీలు, ఐఐఎస్సీ, కేంద్ర విశ్వవిద్యాలయాల్లో నేషనల్ ఏఐ ల్యాబ్స్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఇవి కేవలం అకడమిక్ పరిశోధనకే కాకుండా, స్టార్టప్‌లకు ఓపెన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌గా పనిచేయాలి. మరో కీలక అంశం డేటా పాలసీ. ప్రపంచ డేటాలో ఐదవ వంతు భారత్‌నుంచి ఉత్పత్తి అవుతున్నప్పటికీ, ఆ డేటా ఆధారంగా విలువ సృష్టించుకుంటున్నవి ఎక్కువగా విదేశీ సంస్థలే. దేశీయంగా సురక్షితమైన డేటా షేరింగ్ ఫ్రేమ్‌వర్క్, పబ్లిక్ డేటా రిపోజిటరీలు ఏర్పాటు చేస్తే హెల్త్‌టెక్, అగ్రిటెక్, ఎడ్యుటెక్ రంగాల్లో దేశీయ ఏఐ మోడళ్ల అభివృద్ధికి ఊతంలభిస్తుంది. విద్యారంగంలో సంస్కరణలు మరింత అత్యవసరం. ఏఐ, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్‌ను ఎలక్టివ్‌లుగా కాకుండా కోర్ సబ్జెక్టులుగా ప్రవేశపెట్టాలి. పరిశ్రమలతో కలిసి లైవ్ ప్రాజెక్ట్స్, అప్రెంటిస్‌షిప్స్ తప్పనిసరి చేస్తేనే నైపుణ్యలోపం తగ్గుతుంది. ప్రపంచ బ్యాంక్ అంచనాల ప్రకారం, సరైన స్కిల్ అప్‌గ్రేడేషన్ జరిగితే భారత్ ఏఐ ద్వారా జీడీపీకి అదనంగా 7-8 శాతం వృద్ధిని సాధించగలదు. చివరగా, ప్రవాస భారతీయ ఏఐ నిపుణులను తిరిగి రప్పించేలా ప్రత్యేక ప్రోత్సాహక విధానాలు అవసరం. పన్నురాయితీలు, రీసెర్చ్ గ్రాంట్లు, స్టార్టప్ ఫ్రీడమ్ కల్పిస్తే భారత్ బ్రెయిన్ డ్రెయిన్‌ను బ్రెయిన్ గైన్‌గా మార్చగలదు. ఏఐ యుగంలో వెనుకబడితే, అది కేవలం ఒక టెక్నాలజీ లోటు కాదు భవిష్యత్ అవకాశాల కోల్పోవడమే. కాబట్టి ఇప్పుడే సమగ్ర జాతీయ వ్యూహంతో ముందుకెళ్లాల్సిన సమయం వచ్చింది. ప్రణాళికాబద్ధమైన పెట్టుబడులు, బలమైన మౌలికవసతులు, సమగ్ర విద్యా సంస్కరణలు, పరిశోధనలకు ప్రోత్సాహం కలిసొస్తే ఏఐ పందెంలో అగ్రదేశాలకు దీటుగా భారత్ దూసుకుపోవడం అసాధ్యం కాదు. ఇప్పుడే పునాదులు బలపరచుకోకపోతే, రేపటి అవకాశాలు విదేశాలకే జారిపో తాయన్న సత్యాన్ని విధాన నిర్ణయకర్తలు గ్రహించాల్సిన సమయం ఇదే. •

# ప్రజావాక్కు



## ప్రతిపక్షాల మధ్య సమన్వయం

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత దేశంలో పార్లమెంటు అత్యున్నతమైన శాసనసభ. ప్రజల సమస్యలను చర్చించి, పరిష్కారమార్గాలను అన్వేషించాల్సిన ఈ వేదిక నేడు నిరంతర అంతరాయాలకు నిలయంగా మారుతోంది.అధికార,ప్రతిపక్షాల మధ్య సమన్వయం లోపించడం వల్ల పార్లమెంటు విలువైన సమయం వృథా అవుతోంది. దీనివల్ల దేశ భవిష్యత్తును ప్రభావితం చేసే అనేక కీలకబిల్లులు ఆమోదం పొందకుండా పెండింగ్‌లో ఉండిపోతున్నాయి.సభలో నిరసనలు తెలపడం ప్రతిపక్షాల హక్కు అయినప్పటికీ, అది సభా సమయాన్ని పూర్తిగా హరించేలా ఉండకూడదు. ప్రతి నిమిషం పార్లమెంటునిర్వహణకు ప్రజాధనంభారీగా వెచ్చించబడుతోంది.అధికార పక్షంప్రతిపక్షాల విమర్శలనుఓర్పుతో వినాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## రాఫెల్ కొనుగోళ్లు

ఫ్రాన్స్ నుండి రాఫెల్ యుద్ధవిమానాలు కొనుగోలు చేయడంకోసం3లక్షల కోట్లవిలువైన ఒప్పందం జరగడం గొప్ప పరిణామం అయితే ఇందులో ప్రత్యేకత ఏమిటి? స్వదేశీయంగానాగపూర్‌లోను, హైదరాబాద్‌లో రాఫెల్ విమానాల భాగాలు తయారు అవుతున్నాయి. ఇది స్వదేశీయంగా తయారు కావడమే కదా చారిత్రక నేపథ్యాల నుండి చుస్తే భారత రాజ్యాంగంలో స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాతృత్వంలాంటి గుణాలను మనంఫ్రాన్స్ నుండే తీసుకున్నాం. ఇప్పుడు భారత రక్షణ వ్యవస్థకు ఆయువు పట్టులాంటి రాఫెల్ విమానాన్ని అందించడం అందులో 18 ఫ్రాన్స్‌లో 96స్వదేశీయంగా తయారు కావడం ఆహ్వానించదగిన విషయం.

- భారత అవినాష్, జనగామ

## హామీలను నెరవేర్చాలి

ఎన్నికల సమయంలో వివిధ పార్టీలు మానిఫెస్టోలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వచ్చాక తప్పకనెరవేర్చాలి. ఎన్నికల సమయంలో మానిఫెస్టోనుఎన్నికల సంఘం నిర్ధారించాలి.హామీలు నెరవేర్చేలా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలి. హామీలు నెరవేర్చని ప్రభుత్వం పార్టీ గుర్తింపును రద్దు చేయాలి. అలాగే ప్రభుత్వం ఏర్పడ్డాక బడ్జెట్‌నిధులను ప్రజలకు చేరువయ్యేలా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం పారదర్శకంగా పని చేయాలి.

- డి చాంద్ బాషా, కర్నూలు

## మనిషికి సాటిరాని కృత్రిమ మేధస్సు

డిజిటల్ యుగం వేగంగా విస్తరిస్తున్న ఈ కాలంలో కృత్రిమ మేధస్సు సమాజాన్ని కొత్తదిశల్లో నడుపుతోంది. భాష, గణితం, డేటా విశ్లేషణ ఇలాంటి అనేకరంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అద్భుత వేగంతో ముందుకు సాగుతున్నప్పటికీ, అది మనిషి సహజ మేధస్సును భర్తీ చేయగలదనే అపోహ మరింత ప్రమాదకరం. ఎందుకంటే యంత్రాలు వేగాన్ని, ఖచ్చితత్వాన్ని అందించగలిగినా, భావోద్వేగం, నైతికత, సానుభూతి, సృజనాత్మకత ఇలాంటి మానవ విలువలను అవి పునరుత్పత్తి చేయలేవు. కృత్రిమమేధస్సు అతిపెద్దశక్తి దాని విశ్లేషణ సామర్థ్యం. వైద్యం నుంచి రవాణా వరకు, పంటల ఆరోగ్యం నుంచి వాతావరణ అంచనాలవరకు అన్ని రంగాల్లో ఇది సమర్థతను పెంచుతోంది. వ్యాధులను ప్రారంభ దశలో గుర్తించడం, ట్రాఫిక్ నియంత్రణ, లాజిస్టిక్స్‌లో వృథా తగ్గించడం వంటి అభివృద్ధులు ప్రజలకు స్పష్టమైన ప్రయోజనాలను అందిస్తున్నాయి.

-కె.రామారావు, నల్గొండ జిల్లా

## నిబంధనలను పాటించాలి

వైద్యుల ప్రిస్క్రిప్షన్ చీటీలేకుండా మందులు కొనడం, అమ్మడం రెండూ నేరమేకానీ,తెలంగాణలో అన్నిజిల్లాల్లో మెడికల్ షాప్స్ ఈ నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నాయి. ధనార్జనే ధ్యేయంగాప్రజలఆరోగ్యంతో చెలగాటమాడుతున్నాయి. వైద్యుడి ప్రిస్క్రిప్షన్‌లేకుండానే మందులు అమ్మి సొమ్ము చేసుకొంటున్నారు. ఒక్కొక్క మందుల షాప్‌లో ఫార్మాసిస్ట్ లేదు. పర్యవేక్షణ లేదు. నిబంధనల ప్రకారం ప్రతి మందుల దుకాణంలో అర్హత పొందిన ఫార్మాసిస్ట్ తప్పనిసరిగా ఉండాలి. జీఎస్‌టీ, కంప్యూటరైజ్డ్ బిల్లులు ఇవ్వకపోవడంవంటి ఉల్లంఘనలు సర్వసాధారణం. మెడికల్‌షాప్స్ వారు విధిగా నిబంధనలు పాటించాలి.

-పి. జగదీశ్వర్, కరీంనగర్ జిల్లా

## అవినీతికి అంతం లేదా?

తెలంగాణ రాష్ట్రంలో అవినీతి తారాస్థాయికి చేరింది. ప్రతిరోజు ఏదో ఒకప్రాంతంలో ప్రభుత్వ ఉద్యోగులు అవినీతికి పాల్పడుతూ ఏసీబీకి చిక్కడం చర్చనీయాంశంగా మారుతుంది. సుమారు 1000 మంది అధికారులు ఏసీబీకి చిక్కారు. లంచం లేనిదే కార్యాలయాల్లో ఫైలు కదలని పరిస్థితి ఉంది. ఏసీబీ అధికారులు ఎన్ని దాడులు చేసిన లంచగొండి అధికారుల ప్రవర్తనలో మార్పడం రావడంలేదు.ఏసీబీ అధికారులు మరిన్ని దాడులు చేసి లంచగొండిల భరతం పట్టాలి.

-సి. సతీష్, భూపాలపల్లి జిల్లా

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్


(e-mail: editpage@vaartha.com)

# రంగంలోకి కొత్త 'రాఫెల్' విమానాలు!

### రూ.3.25 లక్షల కోట్లతో 114 జెట్ ఫైటర్స్ కొనుగోలుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

### 17న ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ రాక

### 8 డోర్నియర్ విమానాల కోసం హెచ్‌ఎఎల్‌తో ఎంఒయు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** భారత వైమానిక దళం కోసం ఫ్రాన్స్ నుంచి 114 రాఫెల్ యుద్ధ విమానాలను కొనుగోలు చేయాలనే రూ.3.25 లక్షల కోట్ల ప్రతిపాదనకు రక్షణ మంత్రిత్వ శాఖ గురువారం ఆమోదం తెలిపింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన నిర్వహించిన రక్షణ సముపార్జన మండలి (డిఎసి) రాఫెల్ జెట్ విమానాల కొనుగోలుకు అనుమతి ఇచ్చింది. ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ రాబోయే ఢిల్లీ అధికారిక పర్యటనకు ముందు ఈ అనుమతి లభించింది. మెక్రాన్ ఈ నెల 17న భారత పర్యటనకు వస్తున్న విషయం తెలిసిందే. రక్షణ మంత్రిత్వ శాఖ ఆమోదం పొందిన తర్వాత, ఈ ఒప్పందానికి చివరికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగే భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ నుండి అనుమతి అవసరం. ప్రతిపాదన ప్రకారం, భారత్, ఫ్రెంచ్ రక్షణ దిగ్గజం డసాల్ట్ ఏవియేషన్ నుండి 18 ఆఫ్‌దిషెల్ఫ్ రాఫెల్ యుద్ధ విమానాలను కొనుగోలు చేస్తుంది. మిగిలిన 96 యుద్ధ విమానాలు భారతదేశంలో తయారు చేయబడతాయి. ఇంకా, ఈ జెట్‌లలో కొన్ని శిక్షణ కోసం ఉపయోగించబడే జంటసీట్ల విమానాలు. ఈ ఒప్పందంలో అత్యాధునిక యుద్ధ జెట్ సాంకేతికతను బదిలీ చేయడం, 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమానికి పూరకంగా వ్యూహాత్మక భాగస్వామ్యం ఉంటుంది.

భారత వైమానిక దళం ఇప్పటికే రెండు స్క్వాడ్రన్‌లను కలిగి ఉన్న 36 రాఫెల్‌లను కలిగి ఉంది, 'సి' వేరియంట్ చివరి డెలివరీ డిసెంబర్ 2024లో జరిగింది. అయితే, 'ఎం' వెర్షన్ మరో 26 రాఫెల్ జెట్‌లను కూడా భారత నౌకాదళం కోసం రూ. 63,000 కోట్ల విలువైన ఒప్పందంలో ఆర్డర్ చేశారు. నావికా వేరియంట్‌లను విమాన వాహక నౌకలు ఐఎన్‌ఎస్ విక్రాంత్. ఐఎన్‌ఎస్ విక్రమాదిత్య నుండి నిర్వహిస్తారు. ఆ ఒప్పందంలో ఎంఆర్‌ఓ (నిర్వహణ, మరమ్మత్తు, సమగ్ర పరిశీలన) ఒప్పందం కింద విమానాల నిర్వహణ, లాజిస్టిక్స్ మద్దతు, సిబ్బంది శిక్షణను సులభతరం చేయనుంది.

**ఆపరేషన్ సిందూర్‌లో రాఫెల్ జెట్‌ల వినియోగం**

మే 2025లో పహల్గామ్ ఉగ్రవాద దాడికి భారత్ సైనికచర్యలో భాగంగా పాకిస్తాన్‌లోని ఖచ్చితమైన లక్ష్యాలను ఛేదించడానికి ఆపరేషన్ సిందూర్‌లో రాఫెల్ జెట్‌లను విజయవంతంగా ఉపయోగించారు. 250 కి.మీ కంటే ఎక్కువ దూరంలోని నిర్దేశిత లక్ష్యాలను అత్యంత ఖచ్చితత్వంతో ఛేదించగల ఎస్‌సిఎఎల్‌పి అనే వాయుప్రయోగ క్రూయిజ్ క్షి పణిని ప్రయోగించడానికి వీటిని ఉపయోగించారు. అత్యాధునిక యుద్ధ విమానం, రాఫెల్, మెటియోర్ లాంగ్‌రేంజ్ గగనతలం నుంచి గగనతలం క్షి పణులు, స్టాండ్‌ఆఫ్ స్ట్రైక్ ఆయుధం హామర్, అధునాతన ఇవార్‌ఫేర్ సూట్ అయిన స్పెక్ట్రా, అలాగే అధునాతన రాడార్, లక్ష్య వ్యవస్థలను కూడా మోసుకెళ్లగలదు.

**8 డోర్నియర్ 228 విమానాల కోసం కేంద్రం హెచ్‌ఎఎల్‌తో ఒప్పందం**

ఇండియన్ కోస్ట్ గార్డ్ (ఐసిజి) కోసం ఎనిమిది డోర్నియర్ 228 విమానాలను, ఆపరేషనల్ రోల్ పరికరాలను రూ.2,312 కోట్లకు కొనుగోలు చేయడానికి హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఎఎల్)తో ఒప్పందంపై సంతకం చేసినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ గురువారం తెలిపింది. ఈ ఆర్డర్ హెచ్‌ఎఎల్ ఉత్పత్తి పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడం, ఎంఎస్‌ఎంఇలు, అనుబంధ పరిశ్రమల విస్తృత నెట్‌వర్క్‌కు మద్దతు ఇవ్వడం ద్వారా గణనీయమైన ప్రత్యక్ష, పరోక్ష ఉపాధిని సృష్టిస్తుందని భావిస్తున్నారు. ఇది నిర్వహణ, మరమ్మత్తు, ఓవర్‌హాల్, లైఫ్ సైకిల్ సాంకేతిక మద్దతులో స్థిరమైన అవకాశాలను కూడా సృష్టిస్తుందని అధికారిక ప్రకటన తెలిపింది. రక్షణ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ సమక్షంలో బై (ఇండియన్) కేటగిరీ కింద ఒప్పందంపై సంతకం చేశారు.



## బంగ్లా ఎన్నికల్లో బిఎన్పీ కూటమి క్లీన్‌స్వీప్!

# ప్రధాని రేసులో తారిక్ రెహమాన్

**ఢాకా, ఫిబ్రవరి 12:** బంగ్లాదేశ్‌లో అత్యంత కీలక ఎన్నికలు జరుగుతున్నాయి. ఆ దేశ దశ దిశను మార్చే ఎన్నికలుగా ఇవి ఉండబోతున్నాయి. షేక్ హసీనా 2024లో జరిగిన హింసాత్మక ఘర్షణల తర్వాత, తన ప్రధాని పదవికి రాజీనామా చేసి భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. మరోవైపు, తాత్కాలిక పాలకుడిగా వచ్చిన మహ్మద్ యూనస్ పచ్చి భారత వ్యతిరేక వైఖరిని అవలంభించాడు. భారత్‌ను వ్యతిరేకిస్తూ, పాకిస్తాన్‌తో సంబంధాలు మెరుగుపరుచుకున్నాడు. గతంలో ఎప్పుడూ లేని విధంగా బంగ్లా వ్యాప్తంగా ఇస్లామిస్టులు రాజ్యమేలుతున్నారు. మతోన్మాద దాడులు, హిందువులపై అకృత్యాలు నిత్యకృత్యంగా ఉన్నాయి. ఇలాంటి తరుణంలో జరుగుతున్న ఈ ఎన్నికలకు చాలా ప్రధాన్యత ఏర్పడింది. ఈసారి ఎన్నికల్లో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ(బీఎన్‌పీ), జమాతే ఇస్లామీ కూటమికి మధ్య తీవ్ర పోటీ ఉంటుందని సర్వేలు చెబుతున్నాయి. ఇక షేక్ హసీనాకు చెందిన అవామీ లీగ్‌ను యూనస్ సర్కార్ నిషేధించింది. జమాత్ నేతృత్వంలో 11 పార్టీలు కూటమిగా ఏర్పడి పోటీ చేస్తున్నాయి. 17 ఏళ్ల ప్రవాసం తర్వాత బంగ్లాదేశ్ వచ్చిన మాజీ ప్రధాని ఖలీదా జియా కుమారుడు తారిక్ రెహ్మాన్ బంగ్లాదేశ్ ప్రధాని రేసులో ముందు వరసలో ఉన్నాడు. ఈసారి డబుల్ బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు జరగనున్నాయి. దీంట్లో ఒక ఓటు ఎంపీకి, మరో ఓటు జులై చార్టర్ రిఫరెండం కోసం. ఈ రిఫరెండం ద్వారా ప్రధాని అధికారాలపై ఆంక్షలు, జ్యుడీషియరీ స్వంతంత్రంపై ప్రజాభిప్రాయాన్ని కోరుతారు. బంగ్లాదేశ్‌లో 350 సీట్లు ఉండగా, ఇందులో 299 స్థానాలకు పోలింగ్ జరిగింది. 50 స్థానాలు మహిళలకు కేటాయించారు. వీటికి పరోక్షంగా ఎన్నికలు జరుగుతాయి. ఢాకా ట్రిబ్యూన్ రిపోర్ట్ ప్రకారం బీఎన్‌పీ అలయన్స్ 208 సీట్లు సాధించి, క్లీన్ స్వీప్ చేస్తుందని చెబుతోంది. జమాత్ అలయన్స్‌కు 46 సీట్లు, జాతియా పార్టీకి 3 సీట్లు వస్తాయని అంచనా వేసింది. ఓట్ షేర్ ప్రకారం చూస్తే బీఎన్‌పీకి 66.3 శాతం, జమాత్‌కు 11.9 శాతం ఓట్లు సాధించే ఛాన్స్ ఉందని చెప్పింది. ఎన్‌ఆర్‌సీ సర్వే ప్రకారం బీఎన్‌పీ 77 శాతం ఓట్ షేర్‌తో 220 సీట్లు గెలుస్తుందని, జమాత్ 57 సీట్లతో సరిపెట్టుకోవాల్సి వస్తుందని వెల్లడించింది. ప్రోథోం ఆలో రిపోర్ట్ మాత్రం బీఎన్‌పీ, జమాత్ మధ్య తీవ్రమైన పోటీ ఉంటుందని చెప్పింది. జమాత్ అలయన్స్ 105 సీట్లు, బీఎన్‌పీ అలయన్స్ 101 సీట్లు గెలుస్తుందని చెప్పింది. ఓట్ షేర్ బీఎన్‌పీకి 44.1 శాతం, జమాత్ అలయన్స్ 43.9 శాతం వస్తుందని అంచనా వేసింది. 77 సీట్లలో ఇద్దరి మధ్య టఫ్ ఫైట్ ఉంటుందని చెప్పింది.



## టర్కీ పార్లమెంట్‌లో ఫైటింగ్..

## కొట్టుకున్న అధికార-విపక్ష ఎంపిలు

**అంకారా, ఫిబ్రవరి 12:** టర్కీ పార్లమెంట్ రణరంగంగా మారింది. ప్రజాప్రతినిధులు వీధి రౌడీల్లా కొట్టుకున్నారు. పిడిగుద్దులు గుద్దుకుంటూ.. తన్నుకుంటూ నానా రభస చేశారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. ఇస్తాంబుల్ చీఫ్ ప్రాసిక్యూటర్ అకిన్ గుర్లెక్ పార్లమెంట్‌లో న్యాయ శాఖ మంత్రిగా ప్రమాణస్వీకారం చేయబోతుండగా ప్రతిపక్ష ఎంపీలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో అధికార-ప్రతిపక్ష ఎంపీలు ఒకరినొకరు కొట్టుకోవడం.. తన్నుకుంటూ కనిపించారు. చాలాసేపు ముష్టి యుద్ధం జరిగింది. ఇస్తాంబుల్ చీఫ్ ప్రాసిక్యూటర్‌గా గుర్లెక్.. ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన రిపబ్లికన్ పీపుల్స్ పార్టీకి చెందిన అనేకమంది సభ్యులపై ఉన్నతస్థాయి విచారణలకు అధ్యక్షు వహించారు. ప్రతిపక్షం చాలాకాలంగా ఈ విచారణలను రాజకీయంగా ప్రేరేపించబడ్డాయని విమర్శిస్తోంది. ఇప్పుడు టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగన్.. అకిన్ గుర్లెక్‌ను న్యాయమంత్రిగా నియమించింది. బుధవారం ఆయన ప్రమాణస్వీకారం చేస్తుండగా ప్రతిపక్షాలకు ఆగ్రహం తెప్పించింది. ప్రతిపక్ష రిపబ్లికన్ పీపుల్స్ పార్టీ నియంత్రణలో ఉన్న మునిసిపాలిటీలకు చెందిన వందలాది మంది అధికారులను అవినీతి దర్యాప్తులో అరెస్టు చేశారు. వీరిలో ఇస్తాంబులక్ష మేయర్ ఎక్రెమ్ ఇమామోగ్లు కూడా ఉన్నారు. ఆయనను గత సంవత్సరం అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో ప్రతిపక్షాలకు కోపం తెప్పించింది.

# ట్రంప్-నెతన్యాహు కీలక భేటీ

## ఇరాన్ అణు ఒప్పందంపై రహస్య చర్చలు

**వాషింగ్టన్, ఫిబ్రవరి 12:** ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు అగ్రరాజ్యంలో పర్యటన ఆసక్తి రేపుతోంది. బుధవారం వైట్‌హౌస్‌లో మూడు గంటలపాటు ట్రంప్- నెతన్యాహు రహస్యంగా సమావేశం అయ్యారు. పలు కీలక అంశాలపై చర్చించినట్లుగా తెలుస్తోంది. ఇక ఇద్దరి సమావేశం తర్వాత ట్రంప్ ట్రూత్ సోషల్ మీడియాలో కీలక వ్యాఖ్యలు చేశారు. టెహ్రాన్‌తో చర్చలు జరుగు తున్నాయని.. దౌత్యం అనిశ్చితంగానే ఉందని తెలిపారు. చర్చలు విఫలమైతే సమన్వయం కొనసాగుతుందని సంకేతాలు ఇచ్చారు. ఇరాన్‌తో నిరంతర చర్చలకు ఒత్తిడి తెచ్చానని.. ఇప్పటికీ చర్చలకు తలుపులు తెరిచే ఉన్నాయని పేర్కొన్నారు. మొత్తానికి వార్నింగ్‌ల దగ్గర నుంచి చర్చలకు ట్రంప్ తెరలేపారు. డిసెంబరు 28 నుంచి ఇరాన్‌లో ఉద్రిక్తత పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఖమేనీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు తిరుగుబాటు చేశారు. పెద్ద ఎత్తున హింస చెలరేగింది. ఇక భద్రతా దళాల కాల్పుల్లో 30 వేల మంది చనిపోయారు. దీంతో ట్రంప్ రంగంలోకి దిగి.. నిరసన కారులను చంపితే సైనిక చర్యకు దిగుతామని హెచ్చరించారు. అన్నట్టుగానే యుఎస్‌ఎస్ అబ్రహం లింకన్ నౌక అరేబియా సముద్రానికి వచ్చి మోహరించింది. తక్షణమే అణు ఒప్పందం చేసుకోవాలని ఇరాన్‌పై ట్రంప్ తీవ్ర ఒత్తిడి చేశారు. ప్రస్తుతం రెండు దేశాల మధ్య చర్చలు జరుగుతున్నాయి. ఇలాంటి తరుణంలో ట్రంప్-నెతన్యాహు



భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. ఇదిలా ఉంటే అమెరికా నేతృత్వంలో ఏర్పడిన బోర్డ్ ఆఫ్ పీస్‌లో ఇజ్రాయెల్ చేరింది. చాలా రోజుల తర్జన భర్జన తర్వాత నెతన్యాహు సంతకం చేశారు. ఈ ఫోరమ్‌లో పాశ్చాత్య భాగస్వాములతో పాటు టర్కీ, ఖతార్ కూడా ఉన్నాయి. గతంలో గాజాలో వారి పాత్రపై ఇజ్రాయెల్ విమర్శలు చేసింది. మొత్తానికి శాంతి మండలిలో ఇజ్రాయెల్ చేరింది.

# రాహుల్‌గాంధీ సభ్యత్వం రద్దు చేయాలి

## బిజెపి ఎంపి నిశికాంత్ దూబె




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** కాంగ్రెస్ ఎంపి రాహుల్‌గాంధీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని బిజెపి ఎంపి నిషికాంత్ దూబె డిమాండ్ చేశారు. ఈ మేరకు అతని సభ్యత్వాన్ని రద్దు చేసే ప్రక్రియను ప్రారంభించాలని కోరుతూ నోటీసు ఇచ్చారు. ఇంకా ప్రచురితం కాని భారత సైన్యం మాజీ అధిపతి జనరల్ ఎంఎం నరవణె పుస్తకం సహా పలు వివాదాస్పద అంశాలపైనా రాహుల్‌గాంధీ, బిజెపి ఎంపిల మధ్య తీవ్ర వాగ్వాదం నడిచిన సంగతి తెలిసిందే. రాహుల్ గాంధీకి ఎవరు నిధులు ఇస్తున్నారు? ఆయన చేతికి ప్రచురితం కాని పుస్తకం ఎలా వచ్చింది? భారత వ్యతిరేక శక్తులతో ఆయన సంబంధాల గురించి ఆ నోటీసులో ప్రస్తావించారు. లోక్‌సభలో రాహుల్ సభ్యత్వాన్ని రద్దు చేయాలి అని దూబె అన్నారు. అయితే ఆయనపై సభా హక్కుల తీర్మానం తీసుకురావడం లేదని చెప్పారు. బడ్జెట్ ప్రసంగం సందర్భంగా రాహుల్ గాంధీ ఎప్‌స్టీన్ ఫైల్స్ ప్రస్తావన తీసుకువచ్చారు. అదానీ, అనిల్ అంబానీ, హార్దీప్‌సింగ్ పురీ పేర్లను పేర్కొన్నారు. ఆ వ్యాఖ్యలను అధికారపక్షం నేతలు తీవ్రంగా ఖండిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ పదాలను తొలగించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఆయన చేసిన ఆరోపణలకు ఎలాంటి ధృవీకరణ లేదని పేర్కొన్నాయి.

# సేవాతీర్థ్ కాంప్లెక్స్‌కు మారుతున్న నార్త్,సౌత్ బ్లాక్‌లు!

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** దేశ రాజధాని ఢిల్లీలోని బ్రిటీష్ కాలం నాటి ఆఫీసు బిల్డింగ్‌లు ఉన్న నార్త్, సౌత్ బ్లాకులను శుక్రవారం పూర్తిగా ఖాళీ చేయనున్నారు. ప్రధానమంత్రి కార్యాలయం కూడా కొత్తగా నిర్మించిన సేవా తీర్థ్ కాంప్లెక్స్‌కు మారనున్నది. ఆఫీసును మార్చడానికి ముందు శుక్రవారం ప్రధాని మోదీ చివరిసారి క్యాబినెట్ భేటీ ఏర్పాటు చేయనున్నారు. రేపు సాయంత్రం 4 గంటలకు పాత ఆఫీసులో ఆ భేటీ ఉండనున్నది. ఢిల్లీలోని ల్యూటెన్స్ రైసినా హిల్స్‌లో ఉన్న సౌత్ బ్లాకులో చివరిసారి కేంద్ర క్యాబినెట్ భేటీ జరగనున్నది. నార్త్ బ్లాక్ నుంచి కేంద్ర హోంశాఖ కార్యాలయాన్ని పూర్తిగా షిఫ్ట్ చేశారు. కామన్ సెంట్రల్ సెక్రటేరియేట్‌లోని 347 రూమ్ కాంప్లెక్స్‌కు హోంశాఖను తరలించారు. ఒక్క పీఎంవో మినహా ఆ కాంప్లెక్స్‌లో అన్ని ప్రభుత్వ మంత్రులు, శాఖల ఆఫీసులు ఉన్నాయి. సెంట్రల్ ఢిల్లీలోని ప్రత్యేక కాంప్లెక్స్‌లో పీఎంవోను నిర్మించారు. పీఎంవోను ఇక నుంచి సేవాతీర్థ్ అని పిలవనున్న విషయం తెలిసిందే. ఫిబ్రవరి 13వ తేదీన జరిగే కార్యక్రమంలో ప్రధాని మోదీ సేవాతీర్థ్, కర్తవ్యభవన్1,2లను ఆవిష్కరిస్తారని ప్రభుత్వం గురువారం ఓ ప్రకటన రిలీజ్ చేసింది. కొత్త ఆఫీసు బిల్డింగ్‌ను ప్రారంభించడంతో భారతీయ అధికార పరిపాలనా విభాగంలో కొత్త మైలురాయి చేరు కున్నట్లు అవుతుంది. ఆధునిక, పటిష్టమైన, సౌకర్యవంతమైన పరి పాలనా వ్యవస్థను అందిచే ఉద్దేశంతో కొత్త బిల్డింగ్ లను నిర్మించినట్లు అధి కారులు పేర్కొన్నారు. గతంలో దూరం దూరం గా ఉన్న వివిధ శాఖల ఆఫీసులను ఇప్పుడు ఒకే దగ్గరికి తీసుకువచ్చారు. పరిపాలనను మరింత సులభం చేయాలన్న ఉద్దేశంతో ఈ చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. సేవా తీర్థ్‌లో ప్రధానమంత్రి కార్యాలయం, నేషనల్ సెక్యూర్టీ కౌన్సిల్ సెక్రటేరియేట్, క్యాబినెట్ సెక్రటేరియేట్ ఉంటాయి. గతంలో ఇవన్నీ వేర్వేరు ప్రాంతాలను నుంచి ఆపరేట్ అయ్యేవి. ఇక కర్తవ్య భవన్ 1,2లో కీలక మంత్రిత్వశాఖల ఆఫీసులు ఉంటాయి. ఆర్థిక, రక్షణ, ఆరోగ్య, కార్పొరేట్ సర్వీసెస్, విద్య, సంస్కృతి, న్యాయ, సమాచార ప్రసార, వ్యవసాయ, రసాయనిక, గిరిజన శాఖ ఆఫీసులు ఉంటాయి. అన్ని ఆఫీసుల మధ్య డిజిటల్ ఇంటిగ్రేషన్ ఉంటుంది. ప్రస్తుత నార్త్, సౌత్ బ్లాకుల వద్ద ప్రపంచ స్థాయి మ్యూజియంను నిర్మించనున్నారు. యుగే యుగే భారత్ మ్యూజియంలో భారతీయ నాగరికత ప్రయాణాన్ని చిత్రీకరించనున్నారు. అయితే ఇప్పటికే నార్త్ బ్లాక్ వద్ద మ్యూజియం పనులు ప్రారంభమైనట్లు తెలుస్తున్నది.


## భూమి దిశగా దూసుకొచ్చిన స్విఫ్ట్ అబ్జర్వేటరీని ఆపిన నాసా



**వాషింగ్టన్, ఫిబ్రవరి 12:** నాసా టెలిస్కోప్ 'నీల్ గెహ్రెల్స్ స్విఫ్ట్ అబ్జర్వేటరీ' భూమి దిశగా దూసుకొచ్చింది. వాతావరణ రాపిడి వల్ల ఇది తన కక్ష్య నుంచి భూమి వైపు కదిలింది. 585 కిలోమీటర్ల ఎత్తు నుంచి ఇది 400 కి.మీ. కిందికి చేరింది. దీంతో అట్మాస్ఫెరిక్ డ్రాగ్ (స్పేస్‌క్రాఫ్ట్ శక్తిని కోల్పోయేలా చేస్తుంది)ను తగ్గించేందుకు తాత్కాలికంగా సైన్స్ ఆపరేషన్లను నిలిపివేశారు. అలాగే మళ్లీ దానిని యథాస్థితికి చేర్చేందుకు నాసా రీబూస్ట్ మిషన్‌ను చేపట్టింది. విశ్వంలో చోటుచేసుకునే గామా కిరణాల పేలుళ్లను గుర్తించి, అధ్యయనం చేసేందుకు నీల్ గెహ్రెల్స్ స్విఫ్ట్ అబ్జర్వేటరీని నాసా 2004లో దీన్ని ప్రయోగించింది. సోలార్ యాక్టివిటీ వల్ల భూ ఎగువ వాతావరణం వేడక్కి, ఈ అబ్జర్వేటరీ కక్ష్య నుంచి కిందికి రావడం ప్రారంభమైంది. దీనిని అలాగే వదిలేస్తే.. 2026 చివరి నాటికి భూవాతావరణంలోకి ప్రవేశించి కాలిపోయేది. దాని వల్ల ఎలాంటి ప్రమాదం ఉండదు. అయితే దాని సేవల్ని సాధ్యమైనంత ఎక్కువకాలం కొనసాగించాలని నాసా భావిస్తోంది. రీబూస్ట్ మిషన్‌ను చేపట్టే వరకు ఆ టెలిస్కోప్‌ను 300 కి.మీ. ఎత్తులో ఉంచేందుకు.. అట్మాస్ఫెరిక్ డ్రాగ్‌ను తగ్గించేలా చర్యలు తీసుకుంటోంది. కాగా.. రీబూస్ట్ మిషన్ కోసం ఆరిజోనాకు చెందిన కాటలిస్ట్ స్పేస్ టెక్నాలజీస్‌తో నాసా ఒప్పందం కుదుర్చుకుంది. ఈ జూన్‌లో 30 మిలియన్ డాలర్లతో రోబోటిక్ లింక్ స్పేస్‌క్రాఫ్ట్ (కక్ష్యలో సర్వీసింగ్ కోసం, ఉపగ్రహ మరమ్మతు, డాకింగ్ కోసం రూపొందించిన ఒక రోబో వ్యవస్థ)ను పంపించనుంది. ఇది స్విఫ్ట్‌ను 600 కి.మీ. ఎత్తులో స్థిరమైన కక్ష్యలోకి చేరుస్తుంది. దాంతో అది మళ్లీ మరో పదేళ్లు సేవలు అందించడానికి వీలు కలుగుతుంది. ఈ ప్రయత్నం విజయవంతమైతే.. ఇప్పటివరకు సంగ్రహించిన డేటాను కాపాడుకునే వీలు కలుగుతుంది.


## సంక్షిప్తంగా..

### 3వ తరగతి నుంచే విద్యార్థులకు ఎఐ యాక్సెస్: కేంద్రమంత్రి ధర్మేంద్రప్రధాన్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** ప్రపంచవ్యాప్తంగా అన్ని రంగాల్లో మాదిరి విద్యారంగంలోను కృత్రిమ మేధ విస్తరిస్తుంది. ఈ కొత్త ఎఐ విధానాన్ని భారత్‌లోని విద్యార్థులందరికీ చేరువ చేస్తామని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు. దేశంలో 30 కోట్ల మంది విద్యార్థులు ఉన్నారని, 3వ తరగతి నుంచి అధునాతన పరిశోధనలు నిర్వహించే విద్యార్థుల వరకు ఈ కృత్రిమ మేధ అందుబాటులో ఉంటుందన్నారు. గురువారం ఢిల్లీలో జరిగిన ఎఐ కాంక్లేవ్ - 2026 సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎఐ రంగంలో భారత్ అభివృద్ధి చెందుతుందన్నారు. ఇక్కడ మేధో సామర్థ్యానికి లోటు లేదని, కృత్రిమ మేధకు సంబంధించి పలు పరిశోధనలు జరుగుతున్నాయని వెల్లడించారు. భారత్‌లో గణనీయమైన యువశక్తి ఉందన్నారు.

### తొలితరం న్యూస్ యాంకర్ సరళామహేశ్వరి కన్నుమూత



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** భారత టెలివిజన్ రంగంలో సుపరిచితురాలు, దూరదర్శన్ సీనియర్ న్యూస్ యాంకర్ సరళా మహేశ్వరి (71) కన్నుమూశారు. ఆమె మృతి పట్ల దూరదర్శన్ నేషనల్ చానల్ సోషల్ మీడియా వేదికగా తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. ఆమె సౌమ్యమైన స్వరం, స్పష్టమైన ఉచ్చారణ, వార్తలను హుందాగా అందించే తీరుతో భారతీయ వార్తా ప్రపంచంలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని నివాళి అర్పించింది. దూరదర్శన్ కుటుంబం తరఫున సరళా మహేశ్వ రికి హృదయపూర్వక నివాళులు. ఆమె తన సరళత, హుందాతనంతో వీక్షకులలో చెరగని ముద్ర వేశారు" అని డీడీ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. సరళాతో కలిసి పనిచేసిన సీనియర్ యాంకర్ షమ్మీ నారంగ్ కూడా ఆమె మృతిపై విచారం వ్యక్తం చేశారు.

# ఎర్రకోట దాడి వెనుక జైషే హస్తం

## ఐక్యరాజ్యసమితి సంచలన నివేదిక



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** గతేడాది ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన పేలుడు ఘటనపై ఐక్యరాజ్యసమితి కీలక నివేదిక ఇచ్చింది. ఈ పేలుడుకు పాకిస్తాన్ కేంద్రంగా పనిచేస్తోన్న జైషే మహ్మద్ ఉగ్ర ముఠాతో సంబంధం ఉందని పేర్కొంది. ఆర్థిక ఆంక్షలు, అంతర్జాతీయ ఒత్తిడి ఉన్నప్పటికీ జైషే సహా పలు ఉగ్ర ముఠాలు దక్షిణాసియాలో క్రియాశీలకంగా తమ నేర కార్యకలాపాలు సాగిస్తున్నాయని వెల్లడించింది. ఈ మేరకు ఐక్యరాజ్య సమితి భద్రతా మండలికి సమర్పించిన నివేదికలో ఈ విషయాలు ప్రస్తావించింది. ఆంక్షలు ఉన్నప్పటికీ జైషేముఠా పలు ఉగ్రదాడులకు పాల్పడినట్లు తెలుస్తోంది. అందులో ఒకటి 2025 నవంబరు 10న ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన దాడి అని ఐక్య రాజ్యసమితి సభ్యదేశం ఒకటి ఆరోపించింది. ఇక అంతర్జాతీయ నిఘా నుంచి తప్పించుకునేందుకు జైషే కొత్త పన్నాగాలు పన్నుతోంది. గతేడాది జమాత్ ఉల్ ముమినత్ పేరుతో మహిళా వింగ్‌ను ఏర్పాటు చేసుకుంది. ఇలా చాలా ఆందోళనకర పరిణామం అని ఐక్యరాజ్య సమితి తమ నివేదికలో పేర్కొంది. ఈ సందర్భంగా జమ్మూకశ్మీర్‌లో జరిగిన పహల్గాం ఘటనను కూడా ఐక్యరాజ్య సమితి తన నివేదికలో ప్రస్తావించింది. ఆ దాడికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులు హతమైనట్లు తెలిపింది. జైషే, లష్కరే తోయిబా వంటి ఉగ్ర ముఠాలు ఉనికిలో లేవని గత కొంతకాలంగా పాకిస్తాన్ పదే పదే వాదిస్తూ వస్తోంది. ఈ క్రమంలోనే తాజాగా ఐక్యరాజ్యసమితి ఇచ్చిన నివేదిక ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నివేదికతో దాయాది పాక్ వక్రబుద్ధి మరోసారి బయటపడినట్లయింది. ఎర్ర కోట వద్ద పేలుడు ఘటనపై ఎన్ఐఎ దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులో వచ్చాయి.

# డికె సిఎం కావాలంటున్న 90 మంది ఎమ్మెల్యేలు!



**బెంగళూరు, ఫిబ్రవరి 12:** డీకే శివకుమార్ ముఖ్యమంత్రి కావాలని 80 నుంచి 90 మంది ఎమ్మెల్యేలు కోరుకుంటు న్నారని కర్ణాటక కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ పునరుద్ఘాటించారు. కర్ణాటకలో గత కొన్ని నెలలుగా ముఖ్యమంత్రి మార్పు అంశంపై చర్చ సాగుతోంది. ఈరోజు ఇక్బాల్ హుస్సేన్ మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ కోసం శివకుమార్ చేసిన కృషికి ఆయన ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోవాలని చాలామంది ఎమ్మెల్యేలు ఆశిస్తున్నారని అన్నారు. కర్ణాటకలో రానున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని శివకుమార్‌కు ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని తాము డిమాండ్ చేస్తున్నామని అన్నారు. 140 మంది ఎమ్మెల్యేలు మార్పును ఆశిస్తున్నారని, 80 నుంచి 90 వరకు ఎమ్మెల్యేలు ఈ అంశంపై చర్చించుకుంటున్నారని, తామంతా మద్దతిస్తున్నామని అన్నారు.

# సైబర్ మాఫియా గుట్టురట్టు చేసిన కాంబోడియా

**నాంఫే, (కాంబోడియా), ఫిబ్రవరి12:** సినిమా తెరపై కనిపించే భయానక సామ్రాజ్యాలను తలపించేలా కంబోడియా సరిహద్దుల్లో సాగుతున్న ఒక భారీ సైబర్ నేర సామ్రాజ్యాన్ని థాయ్‌లాండ్ పోలీసులు రట్టు చేశారు. కేజీఎఫ్ సినిమాలోని గనుల మాదిరిగా, వందల మంది యువతను బంధించి, ప్రైవేటు సైన్యంతో కాపలా పెట్టి, రోజుకు 18 గంటల పాటు బలవంతంగా పని చేయిస్తున్న తీరు అంతర్జాతీయంగా సంచలనం సృష్టిస్తోంది. ఓస్మాచ్ పట్టణంపై థాయ్ సైన్యం చేపట్టిన వ్యూహాత్మక దాడిలో ఆరు అంతస్తుల భారీ భవన సముదాయం బయటపడింది. బయటకు ఐటీ కంపెనీలా కనిపించే ఈ భవనం లోపల అసలు సిసలు సైబర్ మోసాల కర్మాగారం నడుస్తోందని అధికారులు గుర్తించారు. ఉద్యోగాల పేరుతో మానవ అక్రమ రవాణా ముఠాల ద్వారా వివిధ దేశాల యువతను అక్కడికి రప్పించి, వారి పాస్‌పోర్టులను లాక్కుని బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెంచేశారు. వారిని నిర్బంధించి డిజిటల్ అరెస్టులు, బ్యాంకు మోసాలు, ఫేక్ పోలీసు కాల్స్ వంటి ఆన్లైన్ స్కామ్‌లు చేయించేవారు. ఈ బందీల్లో భారతీయులు, ముఖ్యంగా తెలుగు వారు కూడా ఉన్నట్లు సమాచారం. నిర్దేశించిన టార్గెట్ పూర్తి చేయకపోతే తీవ్రమైన హింసకు గురిచేసేవారని, కనీసం సూర్యుడిని చూసే అవకాశం కూడా లేని గదుల్లో వారిని బంధించేవారని బాధితులు వాపోతున్నారు. ఆ భవనంలో భారత్, చైనా, ఆస్ట్రేలియా వంటి దేశాల పోలీస్ స్టేషన్లను తలపించే సెట్లు, ఆయా దేశాల పోలీసు దుస్తులు, జాతీయ జెండాలను ఏర్పాటు చేసి మరీ ఈ మోసాలకు పాల్పడేవారు. ఈ గదుల్లో వందలాది కంప్యూటర్లు, హార్డ్ డిస్క్‌లు, వేల సంఖ్యలో సిమ్ కార్డులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అక్కడ పనిచేస్తున్న వారు ఎదురు తిరిగితే శిక్షించేందుకు ప్రత్యేక రక్షణ సిబ్బందిని కూడా ఏర్పాటు చేసుకున్నారు. ఇలాంటి సైబర్ నేరాల ద్వారా ఏటా సుమారు 12.5 బిలియన్ డాలర్లు కంబోడియాకు చేరుతున్నట్లు అంచనా వేస్తున్నారు. అయితే ఈ అంతర్జాతీయ ముఠాల ప్రభావం భారతీయ పల్లెలకు కూడా పాకి ప్రాణాలు తీస్తోంది. ములుగు జిల్లాకు చెందిన ఒక కూలీ, సైబర్ నేరగాళ్ల బెదిరింపులకు భయపడి ఆత్మహత్యకు పాల్పడటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే వీడియో కాల్స్, పోలీసుల పేరుతో వచ్చే బెదిరింపుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

# వారసురాలిగా కూతురు కిమ్‌జ్యూయే!



**ప్యాంగ్యాంగ్, ఫిబ్రవరి 12:** ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ వారసురాలిగా ఆయన కూతురు కిమ్ జు యే ను ఎంపిక చేసినట్లు దక్షిణ కొరియా వెల్లడించింది. ఈ విషయాన్ని కిమ్ ఇంకా అధికారికంగా ప్రకటించకపోయినా, కిమ్ తన కుమార్తెనే దేశాధినేతగా నిర్ణయించారని దక్షిణ కొరియాకు చెందిన నిఘా సంస్థ నేషనల్ ఇంటెలిజెన్స్ సర్వీస్ ప్రకటించింది. ఈ అంశాన్ని దక్షిణ కొరియా తన దేశంలోని చట్టసభల నేతలకు తెలిపింది. ఉత్తర కొరియాలో ప్రతి ఐదేళ్లకోసారి నిర్వహించే కాంగ్రెస్ సమావేశం ఈ నెల చివరిలో జరగనుంది. ఈ నేపథ్యంలో దేశానికి కొత్త నాయకత్వం ఎవరూ అనే అంశంపై చర్చ జరుగుతుండగా అనేక పేర్లను పరిశీలించిన కిమ్ తన కూతురును భవిష్యత్ నాయకురాలిగా ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆమెకు ఈ అంశంపై తగిన శిక్షణ, అవగాహన కల్పిస్తున్నట్లు సమాచారం.



సూర్యప్రభపై స్వామి, చప్పరం వాహనంలో అమ్మవారు

# సూర్యప్రభ వాహనంపై శివయ్య

## చప్పరంలో జ్ఞాన ప్రసూనాంబ దివ్యదర్శనం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం స్వామి వారిని సూర్యప్రభ వాహనంపై దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారిని సప్పర వాహనంపై ప్రతిష్టించి గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం స్వామి అమ్మవార్లను చక్కగా అలంకార మండపంలో రాజేష్, సూరి గురుకుల్స్ ముస్తాబు చేసారు. ఇక్కడ స్వామి అమ్మవార్ల ఉత్సవర్లకు ఆలయ చైర్మన్ కొట్టెస సాయిప్రసాద్, ఇఒ డి.బాపిరెడ్డి పూజలు జరపగా సంప్రదాయ బద్ధంగా అర్చకులు హారతులిచ్చి స్వామి అమ్మవార్లను గ్రామోత్సవాలకు తరలించారు. పంచమూర్తులను శివయ్య గోపురం, రాజగోపురం గుండా అలంకార మండపం వద్దకు చేర్చారు. అక్కడ సోమస్కందమూర్తి శ్రీకాళహస్తీశ్వరుని సూర్యప్రభ వాహనంపై, దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారిని సప్పర వాహనంలో ప్రతిష్టించారు. స్వామి అమ్మవార్లకు దిష్టి తీసి గ్రామోత్సవానికి శ్రీకారం చుట్టారు. కోలాటాల కళాకారులు సంప్రదాయ బద్ధంగా కోలాటాల నృత్యాలు చేస్తుండగా మేళ తాళాలు మంగళవాయిద్యాలతో ఉభయదారులు వెంటరాగా ఉత్సవం నాలుగుమాఢ వీధులతో పాటు బాబూఅగ్రహారం కోనేరు చుట్టూ ఉత్సవం నిర్వహించారు. ఉత్సవంతో ఆలయ ఇన్‌స్పెక్టర్, ఉత్సవాల ఇన్‌చార్జిలు వెంకటస్వామి, నాగభూషణం యాదవ్ వెంటరాగా వైభవంగా ఉత్సవం సాగింది. ఉత్సవాల సందర్భంగా ట్రాఫిక్ ఎఎస్ఐ గోవిందు, ప్రత్యేక విధులపై వచ్చిన సిబ్బంది ఎలాంటి ఇబ్బంది లేకుండా పర్యవేక్షించారు.

# సిఎం చంద్రబాబుతో బండ్ల గణేష్ భేటీ




విజయవాడ, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త ప్రతినిధి: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని అసెంబ్లీలోని ఆయన ఛాంబర్‌లో బండ్ల గణేష్ గురువారం కలిశారు. వైసిపి ప్రభుత్వం చంద్రబాబుపై 2023లో అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపింది. సిఎం చంద్రబాబు జైలు నుంచి విడుదలై ముఖ్యమంత్రి అయితే తిరుమలకు పాదయాత్రగా వస్తానని బండ్ల గణేష్ మొక్కుకున్నారు. 2024లో జరిగిన ఎన్నికల్లో కూటమి విజయం సాధించి చంద్రబాబు 4వసారి సిఎం అయ్యారు. సంకల్ప యాత్ర పేరుతో షాద్‌నగర్ ఇంటి నుంచి జనవరి 19న పాదయాత్ర చేపట్టి ఈ నెల 10వ తేదీన తిరుమలకు చేరుకున్నారు. 23 రోజుల పాటు 535 కి.మీ మేర బండ్ల గణేష్ పాదయాత్ర సాగింది. రెండ్రోజుల క్రితం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకుని బండ్ల గణేష్ తన మొక్కును చెల్లించుకున్నారు. ఈ నేపథ్యంలో గురువారం అమరావతిలో సీఎం చంద్రబాబును కలిశారు. తిరుమల నుండి తీసుకువచ్చిన శ్రీవారి ప్రసాదాన్ని ముఖ్యమంత్రికి అందజేశారు. బండ్ల గణేష్‌ను సీఎం చంద్రబాబు ఆత్మీయంగా పలకరించి ఆలింగనం చేసుకున్నారు.



# నిరూపయోగంగా ప్రభుత్వ భవనం

నెల్లూరు అగ్రికల్చర్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: నెల్లూరు రూరల్ మండలం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఓ రెండంతస్తుల భవనం నిరూపయోగంగా మారింది. నెల్లూరు చెరువు దర్గా ప్రాంతంలో ఉన్న పినాకిని గెస్ట్ హౌస్‌కు సంబంధించిన ఈ ప్రభుత్వ భవనం అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఉపయోగంలో లేకుండాపోయింది. నగరంలో అనేక కార్యాలయాలు అద్దె భవనాల్లో నడుస్తున్నప్పటికి ప్రభుత్వ భవనంగా ఉన్న ఈ కార్యాలయం గత కొంతకాలంగా నిరూపయోగంగా దర్శనమిస్తోంది. 2019కి ముందు కొంత మంది ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లకు ఆశ్రయం కల్పించిన ఈ భవనం ఆ తర్వాత ఉపయోగంలో లేకుండా పోయింది. అద్దె భవనాల్లో నడుస్తున్న ఏదో ఒక కార్యాలయాన్ని ఈ భవనంలోకి తరలించే సదుపాయం ఉన్నప్పటికీ, ఆ దిశగా ఉపయోగించుకునే సూచనలు కనిపిస్తున్న దాఖలాలు లేవు. ఇది ఖాళీగా ఉండడంతో రాత్రి వేళల్లో కొంత మంది తలుపు గొళ్ళెం పగలగొట్టి లోపలకు ప్రవేశిస్తున్న సందర్భాలు ఉన్నాయి. కొంత మంది ప్రైవేటు వ్యక్తులు చీకటి కార్యకలాపాలకు కూడా వాడుకుంటున్నట్లు సమాచారం. ఏది ఏమైనా అద్దె చెల్లిస్తున్న బీసీ కార్పొరేషన్ లాంటి ప్రభుత్వ శాఖలు ఇలాంటి నిరూపయోగ భవనాలను ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉంది. ఈ భవనం ఉపయోగంలోకి వస్తే అద్దె చెల్లింపుల్లో కొంత వరకైనా ప్రభుత్వానికి ఊరట లభిస్తుందన్నది ప్రజల అభిప్రాయం.

# గోవిందా గోవిందా! గోవింద

## గరుడ వాహనంపై శ్రీనివాసుడి స్వైరవిహారం

### పోటెత్తిన భక్తజన సందోహం... పోలీసుల పటిష్ట భద్రత



చంద్రగిరి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: ఏడుకొండలవాడా వెంకటరమణా గోవిందా గోవిందా గోవింద అంటూ భక్తజనుల గోవింద నామస్మరణల నడుమ శ్రీనివాసుడి నిత్య వాహనమైన గరుడ వాహన సేవ గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం రాత్రి 7 గంటలకు స్వామివారి ఉత్సవమూర్తిని మండపానికి వేంచేపు చేశారు. శ్రీనివాసుడి బ్రహ్మోత్సవాలలో అత్యంత ప్రధానమైన గరుడ వాహన సేవలో స్వామివారిని వీక్షించడం ద్వారా మోక్షం సిద్ధిస్తుందని భక్తుల విశ్వాసం. శ్రీవారి నిత్యవాహనమైన గరుడుడిని వాహనంగా చేసుకుని శ్రీనివాసుడు తిరుమాడవీధులలో విహరిస్తుండగా దర్శించుకోవడం ద్వారా సకల పాపహరణ, మోక్షప్రాప్తి లభిస్తుందని శాస్త్రాలు వివరిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ యం.గోపినాథ్, సూపరింటెండెంట్స్ వల్లంశెట్టి రమేష్‌బాబు, రాజ్‌కుమార్, టెంపుల ఇన్‌స్పెక్టర్ డి.మునికుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుం బట్టు ధనశేఖర్, ఆలయ కంకణ భట్టార్ బాలాజీ రంగకుమార్, ప్రధాన అర్చకులు పార్థసారధి నారాయణాచార్యులు పాల్గొన్నారు.

**మోహినీ అవతారంలో కళ్యాణ వెంకన్న**

శ్రీనివాస మంగాపురంలో వెలసిన శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలలో 5వ రోజు ఉదయం స్వామివారు మోహినీ అవతారంలో పల్లకిపై విహరించగా, తిరుచ్చిపై చిన్నికృష్ణుడి అలంకరణలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. మోహినీ అవతారంలో స్వామివారిని దర్శించుకోవడం ద్వారా మోహాలు తొలగి సర్వం శ్రీహరి మయం కాగలదని పురాణాలు తెలియజేస్తున్నాయి.

**వైభవంగా ఆండాళ్ అమ్మవారి మాలలు ఊరేగింపు**

కళ్యాణ వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని గురువారం తిరుపతి గోవిందరాజస్వామి వారి ఆలయం నుండి ఆండాళ్ అమ్మవారి మాలలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. ఇందులో భాగంగా అశేష భక్తులతో ప్రారంభమైన గోదా కళ్యాణయాత్ర అంబారీపై మాలలను తీసుకుని ఆలయానికి చేరుకున్నారు. ఆలయ అర్చకులు స్వామివారి సన్నిధిలో విశేష పూజలు జరిపించి అలంకరించారు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్దజియ్యర్ స్వామి, చిన్న జియ్యర్ స్వామి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

**అంగరంగ వైభవంగా శోభాయాత్ర**

కళ్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని సంప్రదాయానుసారం లక్ష్మీకాసుల హారం టిటిడి అదనపు ఈఓ సిహెచ్ వెంకయ్య చౌదరి ఆలయ అర్చకులకు అందజేశారు.

# ఏరియా ఆస్పత్రి నిర్వహణ శ్రీకాళహస్తి దేవస్థానంకు అప్పగించండి

**● 22ఏ చట్టాన్ని సడలించండి ● ట్రాఫిక్ స్టేషన్ మంజూరు చేయండి ● అసెంబ్లీలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అభ్యర్థన**



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: శాసనసభ సమావేశాల ప్రశ్నోత్తరాల సమయంలో శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి తన నియోజకవర్గానికి సంబంధించిన సమస్యలపై గళం విప్పారు. తన అభ్యర్థనను స్పీకర్ దృష్టికి అలాగే సంబంధిత మంత్రులకు మొరబెట్టుకున్నారు. గురువారం సమావేశంలో పలు కీలక అంశాలను ప్రస్తావించారు. ముఖ్యంగా శ్రీకాళహస్తిలో 1999లో ముఖ్యమంత్రి చంద్రబాబు 11 ఎకరాల విస్తీర్ణంలో ఏరియా ఆస్పత్రిని నిర్మింపజేసి ప్రారంభించారు. తిరుమల, శ్రీశైలం దేవాలయాలు ఆస్పత్రులను నిర్వహిస్తున్నాయి. కాబట్టి ఆస్పత్రిని దేవాలయంలో అనుసంధానం చేయాలని కోరారు. ఈ ఆసుపత్రిలో గత ప్రభుత్వ హయాంలో రూ.12 కోట్లతో రెండవ అంతస్తును నిర్మించారు. ప్రారంభించనే లేదు. ఉరుస్తుంది. పూర్తి స్థాయిలో పని చేయలేదని అసెంబ్లీలో ప్రస్తావించారు. అందుకే ఆలయ ఆదాయంతో ఆస్పత్రిని అభివృద్ధి చేస్తే సామాన్య రోగులకు మెరుగైన సేవలందించుటకు అవకాశం ఉంటుందని సభ దృష్టికి తెచ్చారు. కాగా 22ఏ చట్టం కారణంగా శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని పేదలు, రైతులు, పట్టాదారులు తమ సొంత భూములపై హక్కులు వినియోగించుకోలేక పోతున్నారని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేసారు. ఈ చట్టాన్ని సడలించి రైతులను ఆదుకోవాలని కోరారు. 22ఏ చట్టాన్ని సవరించి అర్హులైన వారికి ఇంటినివేశన స్థలాలు,పట్టాలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత రెవెన్యూశాఖ మంత్రిని కోరారు.

**టెంపుల్ సిటిగా అభివృద్ధికి ప్రత్యేక నిధులివ్వండి:** శ్రీకాళహస్తీశ్వరాలయానికి ప్రతి నిత్యం తిరుమలకు వచ్చేభక్తులు 75శాతం వస్తున్నారు. ఈ ప్రాంతాన్ని టెంపుల్ సిటిగా అభివృద్ధి చేయటానికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి కోరారు. అయితే రాజుల కాలం నాటి పట్టణం కాబట్టి ఆనాటి అవసరాలకు తగ్గట్లు పట్టణాన్ని రూపకల్పన చేసారు. నేడు జనాభా పెరిగింది. పట్టణ స్వరూపం మారింది. వాహనాల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఆలయానికి వచ్చే భక్తులు పెరిగారు. కానీ ట్రాఫిక్ సమస్య జటిలంగా ఉంది. నిత్యం ట్రాఫిక్ చిత్తడిలో పట్టణ ప్రజలే కాకుండా దూరం నుంచి వచ్చే భక్తులు కూడా ట్రాఫిక్ సమస్యతో సతమతమౌతున్నారు. ఇక్కడ 'ట్రాఫిక్ పోలీసు' స్టేషన్‌తో పాటు సిబ్బందిని ఇవ్వాలని సంబంధిత హోంశాఖ మంత్రిని కోరారు. గతంలో కూడా మూడు సార్లు ఈ సమస్యను విన్నవించాను.

**కాంటాక్టు ఔట్ సోర్సింగ్ సిబ్బందికి న్యాయం చేయండి:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో సుమారు 1100 మంది కాంటాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది చాలా మంది పని చేస్తున్నారని వారికి చాలీ చాలనీ వేతనాలతో కుటుంబాలు గడుపులేక తల్లడిల్లుతున్నారు. వారికి న్యాయం చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి సభలో ప్రస్తావించారు. ఆయన అభ్యర్థనలకు సంబంధిత మంత్రులు సానుకూలంగా స్పందించారు.

# నేటి నుండి మహాశివరాత్రి ఉత్సవాలు

## - కలశ స్థాపన, ధ్వజారోహణం



ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త : విజయవాడ ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో నేటి నుండి శివరాత్రి మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. శుక్రవారం కలశ స్థాపన, ధ్వజారోహణం, అగ్ని ప్రతిష్టాపనలతో ప్రారంభం అవుతాయి. శుక్రవారం ఉదయం శ్రీ గంగా పార్వతి సమేత మల్లేశ్వర స్వామివార్లకు మంగళస్నానములు నిర్వహించి నూతన వధూవరులుగా అలంకరిస్తారని, మూల హవనములు, బలిహరణ, హారతి మంత్రపుష్పం, జరిపి భక్తులకు తీర్థప్రసాద వితరణ చేస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ఉత్సవాలకు శాస్త్రోక్తంగా గణపతి పూజ, మండపారాధన, కలశస్థాపన, ధ్వజారోహణ, అగ్ని ప్రతిష్టాపన, మూలమంత్ర హవనములు, బలిహరణ, హారతి, మంత్రపుష్పం జరుగుతాయన్నారు.

**నిత్యాన్నదాన పథకానికి విరాళాలు:** శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అన్నదాన పథకానికి గురువారం హైదరాబాద్‌కు చెందిన వి సుబ్బలక్ష్మి, వి గున్నేశ్వరరావు కుటుంబసభ్యులు రూ.1లక్షను విరాళంగా అందించారు.

అలాగే పశ్చిమగోదావరి జిల్లా బీమవరంకు చెందిన గుప్త దాతలు (వారిపేర్లు నమోదు చెయ్యలేదు) రు. 1,01,116ల విరాళం నిత్యాన్నదాన పథకానికి అందించారు. దాతలకు దుర్గమ్మవారి ఏర్పాటు చేసి, దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, మెమొంటో అందించారు. వేదపండితులు వేదాశీర్వచనం పలికారు.

# గాంధీ ఆశయాలకు మోడీ తూట్లు

## రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల



కావలి (నెల్లూరు), ఫిబ్రవరి 12 ప్రభాతవార్త : గాంధీజీని గాడ్జే ఖూనీ చేస్తే ప్రధాని నరేంద్రమోడీ గాంధీజీ పేరు మీద ఉన్న జాతీయ ఉపాధి హామీ పథకానికి పేరు మార్చి ఆయన ఆశయాలను ఖూనీ చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్.షర్మిలరెడ్డి తెలియజేశారు. ఉపాధి హామీ పరిరక్షణ యాత్రలో భాగంగా కావలి రూరల్ మడలం అముదాలదిన్నె గ్రామంలో కావలి నియోజకవర్గం కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జ్ పొదలకూరి కళ్యాణ్ ఆధ్వర్యంలో గురువారం ఉపాధిహామీ కూలీలతో ముఖాముఖి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో షర్మిలకు మహిళల చేత సారెను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వైఎస్ షర్మిల మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ఆర్ ఉన్నప్పుడు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడంతో రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. పనికి ఆహార పథకానికి వందరోజులు పని దినాలుగా కేటాయించడం జరిగిందని తెలిపారు. బిజెపి ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరంలో 52 పనిదినాలను కల్పించి 125రోజులు పనిదినాలను కల్పిస్తామని చెప్పడం పచ్చి బూటకం అని తెలిపారు. రానున్న రోజుల్లో 12గంటలు పనిచేయాల్సి వస్తుందని తెలిపారు. అందరిలో చైతన్యం వచ్చి నిలదీయాలన్నారు. నూతన చట్టం ద్వారా ఆహార పథకానికి కేంద్ర ప్రభుత్వం 60శాతం నిదులు ఇస్తే రాష్ట్ర ప్రభుత్వం 40శాతం నిధులను కేటాయించాలని అన్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం 40శాతం నిధులు కేటాయించే పరిస్థితిలో లేనందున కేంద్రం ఇచ్చే 60శాతం నిదులు కూడా ఇవ్వరనితెలిపారు. రాష్ట్రంలో 18లక్షల జాబ్‌కార్డులను తొలగించడం జరిగిందన్నారు. కేంద్రంలోని బిజెపి పార్టీకి కూటమి పార్టీలు,వైఎస్ఆర్ సిపి పార్టీ అమ్ముడు పోయిబానిసలుగా తయారైనరన్నారు. ఈ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్న కూడా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బిజెపికి మోడీకి వ్యతిరేకంగా మాట్లాడడం లేదంటే ప్రజల పక్షాన ఉన్నట్టా లేనట్టా ఆలోచించుకోవాలన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిగా చేసుకుటే రాష్ట్ర విభజన హామీలన్నింటిని నెరవేర్చుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మాంగాటి గోపాల్‌రెడ్డి, ఉదయగిరి నియోజకవర్గ కోఆర్డినేటర్ అనిల్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఓబిసి ఉపాధ్యక్షులు కలవకూరి శ్రీనివాసులుగౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైసిపికి ప్రతిపక్ష హోదా రాదు

## జనసేన ఎమ్మెల్యేలు లోకం మాధవి, సుందరపు విజయ్‌కుమార్

విజయవాడ, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రతిపక్ష నాయకుడుగా జగన్‌ను చూడాలంటే ప్లకార్డులు ప్రదర్శించి, ఆందోళనలు చేసినా ప్రయోజనం లేదని జనసేన ఎమ్మెల్యేలు లోకం మాధవి, సుందరపు విజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. తాడేపల్లి ఇంట్లోనే అసెంబ్లీ సెట్ వేసుకోండి... బొత్సను స్పీకర్‌గా పెట్టుకోండి అంటూ మండిపడ్డారు. జీతాల కోసమే వైసిపి నాయకులు సభకు వచ్చారు. 10 నిమిషాల్లో హాజరు వేసుకొని 11వ నిమిషంలో వెళ్లి పోయారన్నారు. వాళ్లకు ప్రజా సమస్యలు కంటే ప్రతిపక్ష హోదానే ముఖ్యమన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో జనసేన ఎమ్మెల్యేలు లోకం మాధవి, సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ, "జగన్ అండ్ కోకి చట్టసభలు అన్నా, మన సంప్రదాయాలు అన్నా కనీస గౌరవం లేదు. గవర్నర్ అబ్దుల్ నజీర్ ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగిస్తుండగా ఆందోళనలు చేపట్టి సభా మర్యాదను మంటగలిపారు. కాసులకు కక్కుర్తిపడి శ్రీవారి దివ్య ప్రసాదాన్ని కల్తీ నెయ్యితో తయారు చేసి కోట్లాది భక్తుల మనోభావాలను దెబ్బతీశారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష హోదా ఇస్తేనే సభకు వస్తానని చెబుతున్న జగన్, ఇంట్లోనే అసెంబ్లీ సెట్ వేసుకొని బొత్స సత్యనారాయణని స్పీకర్‌గా పెట్టుకోవాలని హితవు పలికారు.

## మంత్రి ఫ్లెక్సీ సాక్షిగా అర్ధరాత్రి దాటిన తరువాత

# మట్టి దోపిడి గ్యాంగ్ దందా



సాలూరు (పార్వతీపురం మన్యం జిల్లా), ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: సాలూరు పట్టణంలో మట్టి మాఫీయా దోపిడి రోజు రోజుకి మితిమీరిపోతోంది. ఇంత జరుగుతున్నా రెవిన్యూ, మైనింగ్, పోలీస్ డిపార్ట్‌మెంట్ అధికారులు దీనిపై చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వ ఆదాయాన్ని కొల్లగొడుతున్న వారిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవంతో అమ్ముడై పోయారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఇది ఇలా ఉంచితే రూరల్‌లో ఉన్న సర్కార్ భూముల్లో నుంచి గత నాలుగు రోజులుగా అర్ధరాత్రి 12 గంటల తరువాత లారీలలో మట్టిని దొంగతనంగా ఎమ్మార్వో ఆఫీస్, జాతీయ రహదారి మీదుగా మంత్రి ఫ్లెక్సీ సాక్షిగా తీసుకెళ్లడం హైలెట్ అనే చెప్పకోవచ్చు. అలాగే గుట్టుగా సాగుతున్న మట్టి మాఫీయా గ్యాంగ్ దోపిడీ ఫోటోస్, వీడియోస్ సాలూరు పలు చరవాణి గ్రూపుల్లో హల్ చల్ చేస్తున్నా ఆఫీసర్స్ ఇంతవరకు యాక్షన్ లోకి దిగకపోవడం గమనార్హం. ఈ మట్టి దోపిడీ చేస్తున్న వారిని పర్మిషన్ ఉన్నదా అని ప్రశ్నిస్తే ఉన్నాయని చెపుతున్నారని వినికిడి. అయితే అర్ధరాత్రి ఎందుకు దొంగతనంగా తీసుకెళ్లడం అనే ప్రశ్న అందరిలో వ్యక్తమవుతోంది.

**మట్టి మాఫియాకి ఎమ్మార్వో వార్నింగ్ :**

విలేజీల్లో గవర్నమెంట్ కు సంబంధించిన చెరువులు, చెరువు పోరంబోకు, అలాగే గెడ్డ పోరంబోకు నుండి మట్టిని అక్రమంగా తరలించడం నేరమని తాసిల్దార్ నీలకంతరావు మట్టిదోపిడి గ్యాంగ్ ను హెచ్చరించారు. అలాగే ప్రైవేట్ జిరాయితీ ల్యాండ్ మట్టిని అనుమతి లేకుండా తరలిస్తే చట్టపరంగా చర్యలు ఉంటాయని స్పష్టం చేసారు. ఎవరికి ఇంతవరకు ఎటువంటి పర్మిషన్ ఇవ్వలేదని అర్ధరాత్రి మట్టిలోడు తీసుకువెళ్లే లారీలపై చర్యలు తీసుకోవాలని టౌన్ పోలీస్ వారికి ఇన్ఫర్మేషన్ ఇచ్చామని విలేకరులు అడిగిన ప్రశ్నకు గురువారం ఉదయం క్లారిటీ ఇచ్చారు.

# సైబర్ నేరగాళ్ల ఉచ్చులో టీచర్

అమలాపురం, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నా నిత్యం ఎక్కడో చోట సైబర్ నేరగాళ్లలో చిక్కుతూనే ఉన్నారు. తాజాగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మగటపల్లిలో ప్రభుత్వ పాఠశాలలో టీచర్ కొనుకు శ్రీనివాస్ నేరగాళ్లకు చిక్కి రూ.24.50లక్షలు పోగొట్టుకున్నారు. ఫేస్‌బుక్‌లో లింకును క్లిక్ చేయడంతో కేంద్ర ప్రభుత్వ స్కీం పేరుతో సైబర్ వలవిసిరారు. రూ.10 లక్షల విలువైన ఎరువులు పంపిస్తున్నామని లాభాలు పొందవచ్చునని సైబర్ నేరగాళ్లు నమ్మించారు. లారీ ద్వారా సరుకు వస్తుందని అది అమ్మితే భారీ మొత్తంలో లాభాలు వస్తాయని సొల్లు కబుర్లు చెప్పారు. అది నమ్మిన శ్రీనివాస్ ఫోన్ పే ద్వారా పలుమార్లు నేరగాళ్లకు రూ.24.50 లక్షలు బదిలీ చేశారు.అయినా ఇంకా డబ్బులు పంపించమనడంతో అప్పటికి శ్రీనివాస్ అనుమానంతో సైబర్ క్రైం1930 నెంబర్‌కి సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన బ్యాంక్ అధికారులు రూ.9 లక్షలు ఫ్రీజ్ చేశారు. దీనిపై నగరం ఎస్ఐ చైతన్యకుమార్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దీనిపై సిఐ రుద్రరాజు దర్యాప్తు చేపట్టారు



# పాతకారులో మృతదేహం

విజయవాడ, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త ప్రతినిధి: ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని గుణదలలో ఓ పాత కారులో వ్యక్తి మృతదేహం కలకలం రేపింది. గుణదల రామవరప్పాడు రింగ్ నుంచి విజయవాడ వైపునకు వచ్చే రహదారి వెంబడి నిలిపి ఉంచిన పాత కారులో ఓ మృతదేహం ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు, క్లూస్ టీం ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు మంగళగిరి ప్రాంతానికి చెందిన వాడుగా గుర్తించారు. గుణదల మేరీ మాత తిరునాళ్లకు వచ్చి కారులో నిద్రలోనే మృతి చెందినట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# భర్త గొంతు కోసిన భార్య



మదనపల్లెక్రైమ్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: మద్యం తాగి ఇంటికి వచ్చాడనే కోపంతో ఓ భార్య తన భర్తపై కొడవలితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం మదనపల్లిలో చోటుచేసుకుంది. బాధితుని కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.

మదనపల్లి మండలం, వలసపల్లి గ్రామ పంచాయతీ నాయుని వారిపల్లికి చెందిన మల్లూరి సుబ్రహ్మణ్యం రెడ్డి(43), భార్య శ్యామల వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గురువారం ఉదయం సుబ్రహ్మణ్యం రెడ్డి మద్యం తాగి ఇంటికి వచ్చి భోజనం సరిగ్గా లేదని భార్యను మందలించడంతో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఆ సమయంలో శ్యామల, ఇంట్లో ఉన్న కొడవలిని తీసుకుని సుబ్రహ్మణ్యం రెడ్డి మెడపై బలంగా నరికింది. తీవ్ర రక్తస్రావమై ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాధితుడిని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి 108 వాహనం ద్వారా మదనపల్లి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న మదనపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# దొంగతనం నింద తట్టుకోలేక పదో తరగతి విద్యార్థి బలవన్మరణం



తోటపల్లి గూడూరు (నెల్లూరు), ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: మండల పరిధిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థి సుదీప్ బలవన్మరణానికి పాల్పడిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పెదూరు పంచాయతీకి చెందిన సుదీప్, తనపై వచ్చిన దొంగతనం ఆరోపణలను తట్టుకోలేక ఇంట్లో ఉరివేసుకున్నట్లు సమాచారం. పాఠశాలలో ఓ విద్యార్థికి చెందిన నగదు పోవడంతో, ఆ దొంగతనం సుదీప్ చేశాడని తోటి విద్యార్థులు, కొందరు సిబ్బంది ఆరోపించినట్లు తెలుస్తోంది. అందరి ముందూ తనను దొంగగా ముద్రవేయడంతో తీవ్ర మనస్తాపానికి గురైన సుదీప్ పాఠశాల నుంచి ఇంటికి వచ్చి ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సుదీప్ మృతితో తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్తులు పెద్దఎత్తున పాఠశాల వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యమే ఈ విషాదానికి కారణమని ఆరోపిస్తూ గేటు ముందు బైఠాయించారు. విద్యార్థి మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు కన్నీరు మున్నీర య్యారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు భారీగా మోహరించారు. ఘటనపై సమాచారం అందుకున్న రూరల్ డిఎస్పి ఘట్టమనేని శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

# మహిళా టీచర్‌పై దాడి, దోపిడీ

## మూడు గంటల్లో ముద్దాయిని పట్టుకున్న పోలీసులు



గూడూరు (నెల్లూరు), ఫిబ్రవరి 12, ప్రభాతవార్త: గూడూరు రూరల్ మండల పరిధిలో సంచలనం రేపిన మహిళా ఉపాధ్యాయురాలిపై దాడి చేసి దోపిడీ చేసిన ఘటనలో పోలీసులు సత్వరమే స్పందించి మూడు గంటల్లోనే నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఏఎస్పి సిహెచ్ సౌజన్య తెలిపారు. దాడి ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న టీచర్‌ను ఏ.ఎస్.పి గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దాడి సమాచారం అందిన ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాలతో వెంటనే క్రైమ్ టీమ్స్ స్పందించడం, ఎస్పీ సమన్వయం చేసుకుంటూ సూచనలు చేయడం వంటి చర్యలతో ముద్దయిని అదుపులోకి తీసుకొని విచారణ చేస్తునన్నట్లు ఆమె తెలిపారు. బాలాయపల్లిలో టీచర్‌గా పనిచేస్తున్న మహిళ గూడూరు టౌన్‌లో ఆటో ఎక్కి వెళుతుండగా, గూడూరు రూరల్ పరిధిలోని చీమర్తి దగ్గర మహిళపై ఆటో డ్రైవర్ దాడి చేసి మెడలోని బంగారు సరుడును లాక్కొని వెళ్లాడని పేర్కొన్నారు. బాధిత మహిళ కూడా నిందితున్ని ధైర్యంగా ఎదుర్కొని గాయపరిచిందని చెప్పారు. బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు, జిల్లా యస్.పి. ఆదేశాలతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గంటల వ్యవధిలో ముద్దాయిని, ఆటోను గూడూరు రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం బాధిత మహిళను మెరుగైన చికిత్స కోసం నెల్లూరు కిమ్స్ హాస్పిటల్లో చేర్చామని, చికిత్స జరుగుతున్నట్లు ఆమె తెలిపారు.

# బ్రాహ్మణ కుటుంబాలకు అండగా 'గరుడ'

విజయవాడ, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త ప్రతినిధి: ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న బ్రాహ్మణ కుటుంబాలకు అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం " గరుడ" పథకం ద్వారా చర్యలు తీసుకుంటోంది. ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ ఈ గరుడ పథకాన్ని అమలు చేస్తోంది. కుటుంబ సభ్యులెవరైనా మరణించిన తరుణంలో, వారి అంత్యక్రియల ఖర్చుల కోసం ప్రభుత్వం ఈ పథకం ద్వారా రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అందిస్తోంది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని అధికారులు చెప్తున్నారు.

అర్హతలు ఇవే: మరణించిన వ్యక్తి అలానే దరఖాస్తుదారుడు బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన వారు అయి ఉండాలి. అలానే కుటుంబ వార్షిక ఆదాయం రూ.75,000 మించి ఉండకూడదు. దరఖాస్తుదారుడు మరణించిన వ్యక్తికి భార్య/భర్త, కుమారుడు, కుమార్తె, తల్లిదండ్రులు, సోదరుడు లేదా మనవడు అయి ఉండాలి. ఇంక ఇతర ప్రభుత్వ పథకాల ద్వారా ఇలాంటి సాయం పొంది ఉండకూడదు.

కావలసిన పత్రాలు: దరఖాస్తు సమయంలో దరఖాస్తుదారుని ఫోటో, ఆధార్ కార్డు, మరణించిన వ్యక్తి ఆధార్, మరణ ధృవీకరణ పత్రం, మీసేవ ద్వారా పొందిన కుల, ఆదాయ, నివాస ధృవీకరణ పత్రాలు సిద్ధం చేసుకోవాలి. వీటితో పాటు ఆంధ్ర బ్యాంక్ లేదా ఎస్బీఐ ఖాతా పుస్తకం నకలును జత చేయాలి. బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ అధికారిక వెబ్‌సైట్‌పై క్లిక్ చేయాలి. వ్యక్తిగత, బ్యాంకు వివరాలను నమోదు చేసి, పైన పేర్కొన్న పత్రాలను అప్‌లోడ్ చేయాలి. దరఖాస్తు పూర్తయ్యాక వచ్చే రిఫరెన్స్ నంబర్‌ను భద్రపరుచుకోవాలి. దరఖాస్తు చేసుకున్న వారు సాయం నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ అవుతుందని కార్పొరేషన్ వర్గాలు స్పష్టం చేశాయి. మరణించిన వ్యక్తి యొక్క జీవిత భాగస్వామి, పిల్లలు లేదా కుటుంబ సభ్యులు ఈ సాయం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ వెబ్‌సైట్‌లో దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు అందుబాటులో ఉంటాయి. ఏదైనా సహాయం కోసం బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ హెల్ప్‌లైన్ నంబర్లు 0866 6650345, 0866 6650300 సంప్రదించవచ్చు.

# బెంగళూరు- కడప కొత్త రైల్వే మార్గం ఏర్పాటు చేయండి

- కేంద్ర మంత్రిని కోరిన రాష్ట మంత్రి రాంప్రసాద్ రెడ్డి
- సానుకూలంగా స్పందించిన అశ్విని వైష్ణవ్
- కడప నుంచి విమాన సేవలు పెంపొందించండి
- రామ్మోహన్‌నాయుడుకు మంత్రి మండిపల్లి విజ్ఞప్తి
- మంత్రి వెంట ఎంపి పురందేశ్వరి, సాయి లోకేష్



విజయవాడ, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త ప్రతినిధి: బెంగళూరు నుంచి కడప వరకు కొత్త రైల్వే మార్గం ఏర్పాటు చేయాలంటూ రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను ఢిల్లీలో సమావేశమై కోరారు. ఈ భేటీలో ఎంపి పురందేశ్వరి, అన్నమయ్య జిల్లా బీజేపి అధ్యక్షుడు సాయి లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బెంగళూరు-కడప రైల్వే మార్గం ఏర్పాటు చేస్తే రాయలసీమ ప్రాంతానికి రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు ఆర్థిక, పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడుతుందని కేంద్ర మంత్రికి వివరించారు. రాయలసీమ ప్రాంత అభివృద్ధి సీఎం చంద్రబాబు నాయుడు సారథ్యంలోనే సాధ్యం అని మంత్రి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ప్రాంత ప్రజల దీర్ఘకాలిక ఆకాంక్ష అయిన ఈ రైల్వే మార్గాన్ని త్వరితగతిన మంజూరు చేయాలని కోరగా కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు.

**విమాన సేవల విస్తరణపైనా**

కడప విమానాశ్రయం నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలకు విమానాల సేవలను పెంపొందించాలని కోరుతూ రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఢిల్లీలో కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడుని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు గారి సారథ్యంలో రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా ముందుకుసాగుతున్న క్రమంలో, కడప విమానాశ్రయం ద్వారా కడప జిల్లాకు మెరుగైన విమాన కనెక్టివిటీ కల్పిస్తే రాయలసీమ ప్రాంత అభివృద్ధికి, వ్యాపార, పర్యాటక రంగాల పురోగతికి దోహద పడుతుందని మంత్రి రాంప్రసాద్ రెడ్డి కేంద్ర మంత్రికి వివరించారు.

**ఏపిని క్రీడా హబ్‌గా తీర్చిదిద్దటమే లక్ష్యం**

ఢిల్లీ పర్యటనలో ఉన్న రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి జాతీయ యువజన వ్యవహారాలు, ఎస్ఏఐ జాయింట్ సెక్రెటరీ వినీల్ కృష్ణతో జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో రాయచోటి నియోజకవర్గంలో క్రీడల అభివృద్ధికి అవసరమైన నిధులు, ఖేలో ఇండియా పథకం కింద ప్రతిపాదనల ఆమోదం, అలాగే ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రశ్రేణి క్రీడా హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తరఫున రాష్ట్ర ప్రభుత్వానికి అదనపు నిధుల మంజూరు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఎంపి పురందేశ్వరి, సాయి లోకేష్ పాల్గొన్నారు.

# ఇంటర్ ఫస్టియర్ పరీక్షా విధానంలో మార్పులు

- 32 పేజీల బుక్‌లెట్‌లోనే రాయాలి
- అదనపు పేపర్లు ఇవ్వరు
- మార్కుల విధానంలో మార్పులు చేర్పులు
- ఇంటర్ బోర్డు మార్గదర్శకాలు విడుదల

విజయవాడ, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో ఈనెల 23 నుంచి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఆరంభమవుతున్నాయి. ఇందుకుగానూ ఇంటర్మీడియట్ విద్యా మండలి ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇంటర్మీడియట్ విద్యార్థులు మొత్తం 10,57,899 మంది ఉండగా వీరిలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 5,31,275, ద్వితీయ సంవత్సరం వారు 5,26,624 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ప్రథమ సంవత్సరానికి సంబంధించి ఈ ఏడాది సిలబస్‌తో పాటు ప్రశ్నపత్రాల విధానంలోనూ కొన్ని మార్పులు, చేర్పులు తీసుకు వచ్చారు. ఈసారి ఫస్ట్ ఇయర్ స్టూడెంట్స్‌కు 32 పేజీల బుక్‌లెట్ ఇవ్వనున్నారు.

**అదనంగా పేజీలు ఇవ్వరు:** ఇప్పటివరకు సమాధానాలు రాయడానికి 24 పేజీల బుక్‌లెట్ ఇస్తుండేవారు. ఈసారి మాత్రం 32 పేజీల బుక్‌లెట్ ఇవ్వాలని నిర్ణయించారు. అన్ని ప్రశ్నలకు అందులోనే సమానాధాలు రాయాల్సి ఉంటుంది. అదనంగా ఎలాంటి పేజీలు ఇవ్వరు. పార్ట్‌ఏలో బోటనీ నుంచి 43, పార్ట్‌బిలో జువాలజీ నుంచి 42 మార్కులకు ప్రశ్నలు ఉంటాయి. వీటికి జవాబులు రాసేందుకు విడివిడిగా 24 పేజీల 2 బుక్‌లెట్లు ఇస్తారు. బుక్‌లెట్లపై వృక్ష శాస్త్రం, జంతుశాస్త్రం అని ప్రత్యేకంగా పేర్కొంటారు.

ఈ ఏడాది నుంచి ఫస్ట్ ఇయర్ వారికి ఒక్క మార్కు ప్రశ్నలు ఉంటాయి. సెకండ్ ఇయర్ ప్రశ్నపత్రాల్లో ఎలాంటి మార్పు ఉండదు. అదే విధంగా ఆర్థిక శాస్త్రం, పౌరశాస్త్రం, చరిత్ర సబ్జెక్టుల మార్కుల్లో ఎలాంటి మార్పు లేదు. అయినా ప్రశ్నల సంఖ్య పెరగడంతో వీటికి సైతం 32 పేజీల బుక్‌లెట్ ఇస్తారు.

భౌతిక, రసాయన, జీవశాస్త్రం సబ్జెక్టులకు మొదటి ఏడాదిలో 85 మార్కులకు రాత పరీక్ష ఉంటుంది. ఈ సబ్జెక్టుల్లో 35 శాతం మార్కులు వస్తే పాసయినట్లే. ఆ లెక్కన 29.75 మార్కులు రావాల్సి ఉండగా, 29 మార్కులు వచ్చిన కూడా ఉత్తీర్ణులైనట్లే పరిగణిస్తారు.

ద్వితీయ సంవత్సరంలో 85 మార్కులకు గానూ 30 మార్కులు తెచ్చుకోవాలనే నిబంధనను పెట్టారు.

రెండు సంవత్సరాలకు కలిపి 35 శాతం కింద 59.5 మార్కులు సాధించాల్సి ఉండగా, 59 మార్కులను ఉత్తీర్ణతగా నిర్ణయించారు. ఈ అర్థ మార్కును సర్దుబాటు చేస్తున్నారు.

రెండో ఏడాదిలో ప్రాక్టికల్స్ 30 మార్కులకు ఉత్తీర్ణత మార్కులను 10.5 నుంచి 11కు పెంచారు.

గణితం 12, రసాయనశాస్త్రం 9, భౌతికశాస్త్రం 9, వృక్షశాస్త్రం 5, జంతుశాస్త్రంలో 4 ప్రశ్నలుగానూ సబ్జెక్టుల వారీగా ఒక్క మార్కు ప్రశ్నలనూ ఉండనున్నాయి.

అన్ని కేంద్రాల్లోను కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. వీటిని జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఇంటర్మీడియట్ బోర్డుకు అనుసంధానం చేయనున్నారు. రాష్ట్ర స్థాయిలో ఒక్కో జిల్లాను ఒక్కో అధికారి పర్యవేక్షి ంచనున్నారు. ఆయా కళాశాలలు సీసీ కెమెరా ఫుటేజ్ హార్డ్‌డిస్క్‌ను ఆర్ఐఓలకు ఇస్తాయి. అక్కడ వాటిని భద్రపరచనున్నారు.

# నోరులేని మూగజీవాలకు వరంగా గరివిడి పశువైద్య కళాశాల

- అద్భుత వైద్యం... అత్యాధునిక పరికరాలు... నామమాత్రపు ఫీజు



గరివిడి (విజయనగరం జిల్లా), ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: నోరులేని మూగజీవాలకు గరివిడి పశువైద్య కళాశాల వరంలా నిలుస్తోంది. అత్యాధునిక పరికరాలు, నిష్ణాతులైన వైద్యులతో అద్భుతమైన చికిత్సలు అందిస్తూ మూగ జీవాలకు ప్రాణం పోస్తోంది. ఉత్తరాంధ్రకే తలమానికంగా నిలిచే గరివిడి పశువైద్య కళాశాల వేలాది జీవులకు ఊపిరిపోస్తూ ప్రాణవాయువుగా నిలుస్తోంది. ఉత్తరాంధ్ర జిల్లాలు నుండి ఇక్కడ తమ పశువులు, పక్షులు ఇతర నోరులేని మూగజీవాలకు పశుపోషకులు తీసుకువచ్చి వైద్యాన్ని అందిస్తూ ఉన్నారు. వేరేప్రాంతాల్లో వేల రూపాయలు వ్యయం అయ్యే శస్త్ర చికిత్సలు గరివిడి పశువైద్య కళాశాలలో నామమాత్రపు రుసుముతో శస్త్ర చికిత్సలు అందిస్తూ మూగజీవాల పాలిట కల్పతరువుగా ఈ వైద్య కళాశాల నిలుస్తోంది. తమ పశువులకు, పెంపుడు జంతువులకు వైద్యంతో పునర్జన్మ ను అందించే ఇక్కడ వైద్యులకు పశుపోషకులు నిత్యం కృతజ్ఞతలు తెలువుకుంటూ ఉన్నారు.

ఉత్తరాంధ్రలో మరెక్కడా లేని వైద్య పరికరాలతో వైద్యాన్ని జీవాలకు అందిస్తూ ఉండటం ఈ కళాశాల ఎంతో ఖ్యాతి గడిస్తూ ఉందని చెప్పక తప్పదు. గరివిడి పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ మక్కేన శ్రీను పర్యవేక్షణలో గరివిడి పశువైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్, పశువైద్య పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, సీనియర్ సర్జన్ డాక్టర్ పి.రవి కుమార్ పశువులకు శస్త్రచికిత్సలు అందిస్తూ మూగజీవాలకు ఊపిరిపోస్తున్నారు. రోజుకి అరడజనుకి పైగా శస్త్ర చికిత్సలు చేస్తున్న డాక్టర్ రవికుమార్,తన జూనియర్ డాక్టర్ లతో కలసి అనేక జీవాలకు మెరుగైన వైద్యాన్ని అందిస్తూ పశుపోషకులు నుండి ప్రశంసలు అందుకుంటున్నారు. ఉత్తరాంధ్ర లో చౌకైన వైద్యం, మెరుగైన సేవలతో పశువులకి జీవనాన్ని అందిస్తున్న గరివిడి పశువైద్య కళాశాల ఈ ప్రాంత పశుపోషకులు కల్పతరువుగా, మూగ జీవాలకు వరంగా నిలుస్తుందని పేర్కొనక తప్పదు. తమ రోగం చెప్పుకోలేని జీవాలకు వైద్యం అందించే పశువైద్యులు దైవంతో సమానులుగా పశుపోషకులు నుండి కీర్తి గడిస్తున్నారు. మెరుగైన, మేలైన సేవలను అందించే గరివిడి పశువైద్య కళాశాలను పశుపోషకులు సద్వినియోగపరచుకొని పశు సంపదను కాపాడుకోవాల్సిన అవశ్యం అవసరం ఎంతైనా ఉంది. ఆ దిశగా పశుపోషకులు అడుగులు వేస్తారని అభిలషిద్దాం.

# ప్రజా సమస్యలు ప్రతిబింబించేలా చర్చలు జరగాలి

- మండలిలో సమయపాలన..ఉదయం 10నుంచి 1.30వరకు సభ
- శాసనమండలి బిఏసి నిర్ణయం
- మండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు

సచివాలయం, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: ప్రజా సమస్యలు ప్రతిబింబించేలా చర్చలు జరగాలని చైర్మన్ కొయ్యే మోషేను రాజు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనమండలి బడ్జెట్ సమావేశాల నిర్వహణపై మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు అధ్యక్షతన బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బిఏసి) సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రభుత్వం తరపున మంత్రులు,విపక్ష నేతలు అన్నీ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.సభను అర్థవంతంగా, క్రమశిక్షణతో నిర్వహించడమే లక్ష్యంగా పలు కీలక మార్గదర్శకాలను చైర్మన్ ఖరారు చేశారు.సమావేశాల షెడ్యూల్‌పై చర్చించిన బిఏసి, ప్రతిరోజూ ఉదయం 10.00గంటలకు సభను ప్రారంభించి,మధ్యాహ్నం 1.30గంటల వరకు నిర్వహించాలని నిర్ణయించింది. ప్రజలకు సంబంధించిన కీలక బిల్లులు, బడ్జెట్ అంశాలపై చర్చించేందుకు తగిన సమయం కేటాయించడమే కాకుండా, సభా సమయాన్ని వృధా చేయకూడదని చైర్మన్ స్పష్టంచేశారు. సాధారణంగా సభలో ప్రశ్నోత్తరాల సమయం సుదీర్ఘంగా సాగుతుంటుంది. దీన్ని క్రమబద్ధీకరించేందుకు బిఏసి ఈ క్రింది నిర్ణయాలు తీసుకుంది. ప్రశ్నోత్తరాల సమయాన్ని గరిష్టంగా 90నిమిషాలకు పరిమితం చేశారు. తద్వారా ఇతర సభా వ్యవహారాలకు, బిల్లులపై చర్చకు ఆటంకం కలగకుండా చూడవచ్చని భావించారు. సభ్యులు అడిగే ప్రశ్నలు సుదీర్ఘ ప్రసంగాల మాదిరిగా ఉండకూడదని, నేరుగా సమస్యను ప్రస్తావించాలని చైర్మన్ సూచించారు. అదేవిధంగా మంత్రులు కూడా తమ సమాధానాలను సాగదీయకుండా, గణాంకాలు మరియు వివరాలతో క్లుప్తంగా వివరించాలని కోరారు. ప్రశ్నలు క్లుప్తంగా ఉంటేనే ఎక్కువ మంది సభ్యులకు అవకాశం లభిస్తుందని గుర్తుచేశారు. సభ సజావుగా సాగేలా అధికార, ప్రతిపక్ష పార్టీలు సమన్వయంతో వ్యవహరించాలని కోరారు. బిఏసిలో తీసుకున్న నిర్ణయాలను తూచా తప్పకుండా పాటించాలని, సభా గౌరవాన్ని కాపాడలని సూచించారు. ఈ సమావేశంలో శాసనసభ వ్యవహారాల మంత్రి,ప్రతిపక్ష నేత ఇతర పార్టీల ముఖ్యనేతలు పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకున్నారు. బడ్జెట్ కేటాయింపులు, సంక్షేమ పథకాలు రాష్ట్రాభివృద్ధిపై ఈ సమావేశాల్లో విస్తృతంగా చర్చ జరిగే అవకాశం ఉంది.

# తిరుపతిలో డ్రగ్స్ కలకలం

- 8 మంది అరెస్ట్...
- మాదకద్రవ్యాలు, సిరప్ బాటిళ్లు స్వాధీనం

తిరుపతి, పిబ్రవరి 12 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుపతి జిల్లా కేంద్రం లో తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిషేధిత మందులను అక్రమంగా విక్రయిస్తున్న ముఠాపై పోలీసులు దాడులు చేశారు. ఎనిమిది మంది ముద్దాయిలను అరెస్ట్ చేసి, 33 బ్యాగులు డ్రగ్స్‌ను, సిరప్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం తెలిపారు. తిరుపతి నగరంలో నిషేధిత, మత్తు మందుల అక్రమ విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, ఇలాంటి కార్యకలాపాలపై కఠిన చర్యలు కొనసాగించాలని పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. యువతను, కార్మిక వర్గాలను లక్ష్యంగా చేసుకుని అక్రమంగా మందులు విక్రయించే వ్యక్తులపై ప్రత్యేక దృష్టి పెట్టామని, ఫార్మసీలు, మెడికల్ డిస్ట్రిబ్యూటర్లపై కూడా నిరంతర తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

### నేరం జరిగిన విధానం:

ప్రధాన ముద్దాయి లక్కిసెట్టి నాగార్జున అనంతపురం ప్రాంతంలో మెడికల్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా నిషేధిత మందులను సరఫరా చేస్తుండగా, పాతకమూరి నాగేశ్వరరావు వాటిని తక్కువ ధరకు కొనుగోలు చేసి మధ్యవర్తుల ద్వారా విక్రయించేవాడు. అలతూరు రాజ్ కుమార్ ఈ మందులను భారీ మొత్తంలో కొనుగోలు చేసి తిరుపతి ప్రాంతంలో ఆటో డ్రైవర్లు, వలస కూలీలకు అధిక ధరలకు విక్రయిస్తూ అక్రమ లాభాలు పొందుతున్నాడు. ఇతర ముద్దాయిలను కూడా ఈ వ్యాపారంలో భాగస్వామ్యం చేసి మందులను సరఫరా చేయించగా, పోలీసులు సమాచారంపై దాడి చేసి మందులను పంచుకుంటున్న సమయంలో ఎనిమిది మందిని పట్టుకొని డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్‌కి లక్కిసెట్టి నాగార్జున, కుడుముల జనార్ధన్, పాతకమూరి నాగేశ్వరరావు, మేదూరి గౌతమ్, అలతూరు రాజ్ కుమార్, కోనేటి జగదీష్ బాబు, దిగవిండ్లు ఆంజనేయులు, వెంకటేష్లను అరెస్ట్ చేశారు ధనమ్మ, పద్మ, చందు, ప్రతాప్, విష్ణు, ప్రదీప్ పరారీలో ఉన్నారు.

# ఉద్యోగుల తప్పిదం... ఓ తల్లికి మిగిల్చిన ఆవేదన



దత్తిరాజేరు (విజయనగరం జిల్లా), ఫిబ్రవరి 12, ప్రభాతవార్త: ఉద్యోగులు చేసిన తప్పిదం కారణంగా ఓ తల్లి ఆవేదనకు గురి అయింది. ఓ విద్యార్థికి తల్లికి వందనం మంజూరు విషయంలో వాస్తవ పరిస్థితులను తెలుసుకోకుండా ఉద్యోగులు చేసిన ఆన్లైన్ అప్ లోడ్ తప్పిదం వల్ల ఆ తల్లికి ఆవేదన మిగిల్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. దత్తిరాజేరు మండలం చిన్న కాద గ్రామానికి చెందిన మన్యాల జానకి, చంద్రరావు దంపతులకు ధనశ్రీ, హార్షవర్ధన్ అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య భర్తల మధ్య మనస్పర్ధలు కారణంగా గత ఎనిమిది సంవత్సరాలుగా ఇద్దరు వేర్వేరుగా ఉంటున్నారు. పిల్లలు సంరక్షణ బాధ్యత మాత్రం తల్లి జానకి చూసుకుంటున్నది. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం ప్రకటించిన తల్లికి వందనం పథకం ఇద్దరు పిల్లలకు వర్తిస్తుందని ఆశగా ఎదురు చూసింది. అయితే తల్లికి వందనం సొమ్ము కేవలం కూతురు ధనశ్రీకి మాత్రమే జమ అయిందని, కొడుకు హార్షవర్ధన్ పేరిట రావలసిన తల్లికి వందనం సొమ్ము ఇంతవరకు జమ కాలేదని ఆ తల్లి ఆవేదన చెందుతుంది. అటు గ్రామ సచివాలయానికి, ఇటు ప్రాథమిక పాఠశాలకు ఎన్నిసార్లు తిరిగి మొరపెట్టుకున్న సమస్య పరిష్కారం కాలేదని జానకి విలేకరులకు వివరించింది. అయితే తన సంరక్షణలో ఉన్న కుమారుడు హార్షవర్ధన్ పేరును తండ్రి చంద్ర రావు పేరుతో లింక్ అవ్వడం వల్లనే తనకు సమస్య ఎదురయిందని జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ లో మొరపెట్టుకున్న తనకు న్యాయం జరగలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. తన సంరక్షణలో ఉన్న కొడుకు పేరును తండ్రి ఆధార్ కార్డుకు ఎలా లింక్ చేశారని ఆమె ప్రశ్నిస్తున్నది. ఆ తప్పిదానికి పాల్పడిన సచివాలయ ఉద్యోగులపై చర్యలు చేపట్టాలని జానకి కోరుతున్నది.

# హజ్ యాత్రికుల ఆరోగ్య భద్రతే ముఖ్యం

గుంటూరు, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త ప్రతినిధి: పవిత్ర హజ్ యాత్రకు వెళ్లే యాత్రికుల ఆరోగ్య భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ జనాబ్ షేక్ హసన్ బాషా పేర్కొన్నారు. గురువారం గుంటూరు జిజిహెచ్‌లో హజ్ యాత్రికుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మెడికల్ స్క్రీనింగ్, వ్యాక్సినేషన్ క్యాంపును చైర్మన్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా చైర్మన్ హసన్ బాషా మాట్లాడుతూ హజ్ యాత్రకు వెళ్లే ప్రతి యాత్రికుడికి అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం అవసరమైన మెనింజైటిస్, పోలియో, సీజనల్ ఇన్ఫ్లుయెంజా వ్యాక్సిన్లను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. యాత్రికులు సౌదీ అరేబియాలో ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా, క్షేమంగా యాత్రను ముగించుకుని తిరిగి రావాలన్నదే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, హజ్ కమిటీ ప్రధాన ఉద్దేశమని అన్నారు.




యాత్రికులు ఆరోగ్య సూత్రాలను పాటిస్తూ, యాత్రను విజయవంతం చేసుకోవాలని కోరారు.

# స్పీకర్ చాంబర్‌లోకి వెళ్లి బెదరించారు.. ఇదిగో ఆధారం!

- విపక్ష ఎంపీలపై కేంద్రమంత్రి రిజిజు ఆరోపణలు
- స్పీకర్ చాంబర్‌లో ఘటనపై విడియో విడుదల



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** లోక్‌సభ స్పీకర్ చాంబర్‌లోకి దూసుకెళ్లి విపక్ష ఎంపీలు దుర్భాషలాడారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు. ఇందుకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో విడుదల చేశారు. స్పీకర్ ఛాంబర్ లోపల అనేక మంది మహిళా కాంగ్రెస్ ఎంపీలు బిజెపి మంత్రులతో తీవ్ర వాగ్వాదానికి దిగిన దృశ్యాలను ఈ ఫుటేజ్‌లో కనిపిస్తుంది. ఫిబ్రవరి 4న జరిగిన పార్లమెంటరీ ప్రతిష్టంభన సమయంలో కాంగ్రెస్ ఎంపీలు స్పీకర్ ఓం బిర్లాపై దూషణలు చేసి, ప్రధానమంత్రి నరేంద్ర మోడీని లక్ష్యంగా చేసుకుని బెదిరింపులు జారీ చేశారని ఆరోపించారు. 20-25 మంది కాంగ్రెస్ ఎంపీలు లోక్ సభ స్పీకర్‌ను దుర్భాషలాడి, ప్రధానిని బెదిరించారని ఆరోపించారు. బిజెపి, ఎన్డీఏ ఎంపీలకు 'పూర్తి స్వేచ్ఛ' ఇచ్చి ఉంటే పరిస్థితి గందరగోళంగా మారేదని, కానీ అధికార కూటమి అసహ్యకరమైన దృశ్యాన్ని నివారించడానికి సంయమనం పాటించిందని అన్నారు. 'దాదాపు 20-25 మంది ఎంపీలు స్పీకర్ ఛాంబర్‌లోకి బలవంతంగా ప్రవేశించారు. అప్పుడు ఏమి జరిగిందో, వారు ఎలాంటి దుర్వినియోగం చేస్తున్నారో చూడటానికి తాను పరిగెత్తాను. వారు దుర్భాషలాడుతున్నారు. ప్రియాంక గాంధీ కూడా అక్కడే ఉన్నారు. వారు స్పీకర్, ప్రధాన మంత్రిని ఆమె ముందు దుర్భాషలాడారు' అని రిజిజు అన్నారు. కాంగ్రెస్ నాయకులు కె.సి. వేణుగోపాల్, ప్రియాంక గాంధీ వాద్రా ఎవరినీ దుర్భాషలాడలేదని, అయితే అనేక మంది కాంగ్రెస్ ఎంపీలు వారి సమక్షంలో అభ్యంతరకర వ్యాఖ్యలతో దూషించారని ఆయన ఆరోపించారు.

**అవన్నీ అబద్ధాలు: ప్రియాంకగాంధీ**

పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు చేసిన ఆరోపణలన్నీ 'అబద్ధం' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, ఎంపి ప్రియాంక గాంధీ పేర్కొన్నారు. 'తాము ఎవరినీ దుర్భాషలాడలేదు. పరుష పదజాలం ఉపయోగించలేదు. ఒకరు లేదా ఇద్దరు ఎంపీలు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రోత్సహించాననడం శుద్ధ అబద్ధం. తాను మౌనంగా కూర్చున్నా. చివరికి, తాను స్పీకర్‌కు శాంతియుతంగా కొన్ని విషయాలు చెప్పాను.' అని ప్రియాంక గాంధీ వివరించారు.

# రాజ్ కెసిరెడ్డికి సుప్రీంలో చుక్కెదురు

**బెయిల్ పిటిషన్ విచారించేందుకు నిరాకరణ**

విజయవాడ, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త ప్రతినిధి: మద్యం కుంభకోణం కేసులో రాజ్ కెసిరెడ్డికి రెగ్యూలర్ బెయిల్ పిటిషన్‌ను ఉపసంహరించుకోవడానికి ధర్మాసనం అనుమతించింది. ఈ క్రమంలో ఏపీ మద్యం కుంభకోణం కేసులో కసిరెడ్డి పాత్రపై సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. మొత్తం వ్యవహారానికి ఆర్కిటెక్ట్ రాజ్ కెసిరెడ్డి అని సుప్రీంకోర్టు పేర్కొంది. ఏపీ మద్యం కుంభకోణం చాలా పెద్దదని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. అధికారులు కుమ్మక్కు కాకపోతే ఇలాంటి పెద్ద స్కామ్‌లు జరగవని, కుమ్మక్కైన అధికారులను అరెస్టు చేయకపోవడం దురదృష్టకరమని సీజేఐ అన్నారు. కెసిరెడ్డి తరఫు న్యాయవాది వాదిస్తూ కెసిరెడ్డి ప్రభుత్వానికి సలహాదారు మాత్రనేనని అన్నారు. ఈ వాదనలను సీజేఐ ధర్మాసనం తోసిపుచ్చింది. కెసిరెడ్డిసలహాదారు కాదని, మొత్తం స్కామ్‌కు ఆయనే ఆర్కిటెక్ట్ అని ధర్మాసనం పేర్కొంది. పదవిలో ఉన్నవారి అండ లేకుంటే అధికారులు ఇలా చేయలేదని, ఈ కుంభకోణంలో ప్రధాన సూత్రదారుడు రాజ్ కెసిరెడ్డేనని ధర్మాసనం తేల్చి చెప్పింది. ఇప్పటికే 10 నెలలుగా కెసిరెడ్డి జైలులో ఉన్నారని, సప్లిమెంటరీ ఛార్జిషీట్లు కూడా దాఖలు చేశామని ఆయన తరఫు న్యాయవాది తెలపగా, ఏం కాదు మరికొంతకాలం జైలులో ఉండనీయండని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. కెసిరెడ్డికి రెగ్యులర్ బెయిల్ ఇచ్చేది లేదంటూ రాజ్ కెసిరెడ్డి పిటిషన్‌ను డిస్మిస్ చేసేందుకు సీజేఐ ధర్మాసనం సిద్ధమైంది. ఈ నేపథ్యంలో పిటిషన్‌ను ఉపసంహరించుకుంటామని రాజ్ కెసిరెడ్డి తరఫు న్యాయవాది తెలిపారు. దీంతో రాజ్ కెసిరెడ్డి పిటిషన్‌ను ఉపసంహరించుకోవడానికి ధర్మాసనం అనుమతించింది.

# విడాకుల తర్వాత భర్త ఇంట్లోకి వెళ్లే హక్కు భార్యకు లేదు!

## ఢిల్లీ హైకోర్టు స్పష్టమైన తీర్పు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** గృహహింస నిరోధక చట్టం కింద మహిళలకు కల్పించిన హక్కులపై ఢిల్లీ హైకోర్టు స్పష్టమైనవివరణ ఇచ్చింది. ఒక మహిళ భర్తతో విడాకులు తీసుకుని స్వచ్ఛంధంగా అత్తారింటిన విడిచి పెట్టి ఆ తర్వాత తిరిగి అతడి ఇంట్లోకి ప్రవేశం కల్పించాలని కోరే హక్కు ఉండదని స్పష్టం చేసింది. అలాగే నివసించడానికి ప్రత్యామ్నాయ వసతి ఉన్నప్పుడు అత్తా రింటిపై పట్టుబట్టడం చట్ట విరుద్ధమని కూడా కోర్టు పేర్కొంది. ముఖ్యంగా 81 ఏళ్ల వయసు కల్గిన ఓ వృద్ధురాలు మాజీ భర్త ఇంట్లో ఉండడానికి అవకాశం కల్పించాలంటూ వేసిన పిటిషన్‌ను నిర్మొహమాటంగా కొట్టేసింది. 81 ఏళ్ల వయసున్న ఒక మహిళ గతంలోనే తన భర్తతో విడాకులు తీసుకుంది. అయినప్పటికీ అతడి ఇంట్లోనే ఉంటూ వచ్చింది. అతడికి వేరే ఇళ్లు ఉండగా అతనక్కడికి వెళ్లిపోయాడు. అయితే దాదాపు 60 ఏళ్లుగా ఆ ఇంట్లోనే ఉన్న వృద్ధురాలు 2023 ఏప్రిల్‌లో కేవలం వైద్య చికిత్స కోసం తన కుమార్తె ఇంటికి వెళ్లింది. మళ్లీ ఇప్పుడు తిరిగి తన ఇంటికి రాగా భర్త లోపలికి రానివ్వకుండా అడ్డుకున్నాడు. దీనివల్ల తాను ఆశ్రయం లేనిదాన్ని అయ్యానని చెబుతూ ఆమె ట్రయల్ కోర్టుకు వెళ్లారు. విచారణ జరిపిన సదరు న్యాయస్థానం ఆమె అభ్యర్థనను తిరస్కరించింది. దీంతో ఆమె హైకోర్టును ఆశ్రయించారు. ఈక్రమంలోనే విచారణ జరిపిన న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించింది. సదరు మహిళ తన ఇష్ట పూర్వకంగానే ఏప్రిల్ 2023లో రెండో ఇంటికి మారారని కోర్టు గుర్తించింది. ఇంటి బయట ఆమె పేరుతో ఉన్న నేమ్ ప్లేట్ కూడా ఉందని, ఇది తాత్కాలిక మార్పు కాదని, శాశ్వత నివాసమేనని కోర్టు ధృవీకరించింది. అయితే ఇప్పుడు ఆమె వెళ్లాలనుకుంటున్న ఇంటికి భర్త రానివ్వకపోవడం వల్ల ఆమె ఏమీ రోడ్డున పడలేదని చెప్పింది. మొన్నటి వరకు కుమార్తెతో కలిసి ఉన్న ఇళ్లు కూడా ఆమె భర్తదే అని గుర్తించింది. అక్కడితో ఆగకుండా న్యాయస్థానం.. ఈ పిటిషన్ వెనుక ఆస్తి వివాదం దాగి ఉందని చెప్పింది. కుమార్తెకు ఆస్తిలో వాటా ఇప్పించడానికే వృద్ధురాలు ఈ చట్టాన్ని వాడుకుంటున్నట్లు భర్త తరపు లాయర్ చేసిన వాదనను కోర్టు పరిగణనలోకి తీసుకుంది. ఒకసారి స్వచ్ఛందంగా నివాసం మార్చిన తర్వాత ప్రస్తుతం ఆ ఇంట్లో ఉంటున్న వారిని ఇబ్బంది పెడుతూ రీఎంట్రీ ఇవ్వడం చట్టం పరిధి దాటడమే అవుతుందని స్పష్టం చేసింది. అలాగే గృహహింస చట్టంలోని సెక్షన్ 19 ప్రకారం ఒక మహిళ నిరాశ్రయురాలు కాకుండా చూడటమే మెజిస్ట్రేట్ బాధ్యత అని తేల్చి చెప్పింది. ఇది విచక్షణాధికారం మీద ఆధారపడి ఉంటుందని బాధితురాలికి సమాన స్థాయి కలిగిన ప్రత్యామ్నాయ వసతి ఉన్నప్పుడు, ఒక నిర్దిష్ట ఆస్తిలోనే ఉండాలని కోరే హక్కు ఆమెకు ఉండదని జస్టిస్ దుదేజా స్పష్టం చేశారు. గృహహింస చట్టం అనేది నిజమైన బాధితుల కోస మాత్రమే అని.. దుర్వినియోగం చేసే వారి కోసం కాదని స్పష్టం చేసింది.




## టి20 వరల్డ్ కప్‌లో శ్రీలంక జోరు

### ఒమెన్‌పై 105 రన్స్ తేడాతో సూపర్ విక్టరీ

**న్యూఢిల్లీ:** ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో శ్రీలంక జోరు కొనసాగుతోంది. వరుసగా రెండో మ్యాచ్‌లోనూ విజయం సాధించింది. గ్రూప్ బీ లో భాగంగా పల్లెకెలె వేదికగా గురువారం జరిగిన మ్యాచ్‌లో శ్రీలంక 105 పరుగుల తేడాతో ఒమన్‌ను చిత్తు చేసింది. ఈ మ్యాచ్‌లో శ్రీలంక పూర్తి ఆధిపత్యం చెలాయించగా, ఒమన్ తేలిపోయి కనీస పోటీనివ్వలేకపోయింది. ఈ విజయంతో గ్రూప్ బీ నుంచి సూపర్ 8 అవకాశాలను మెరుగుపర్చుకోగా, ఒమన్ ఇంటిబాట పట్టేందుకు సిద్ధమైంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 225 పరుగులు చేసింది. కుశాల్ మెండీస్(45 బంతుల్లో 7 ఫోర్లతో 61), పవన్ రత్నాయక(28 బంతుల్లో 8 ఫోర్లు, సిక్స్‌తో 60), దసన్ షనక(20 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్స్‌లతో 50) హాఫ్ సెంచరీలతో రాణించారు. ఒమన్ బౌలర్లలో జితెన్ రమణంది(2/41) రెండు వికెట్లు తీయగా, జయ్ ఒడెద్రా, సుఫ్యాన్ మెహమూద్ చెరో వికెట్ తీసారు. అనంతరం ఒమన్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 120 పరుగులు చేయగలిగింది. మహమ్మద్ నదీమ్(56 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 53 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. శ్రీలంక బౌలర్లలో దుష్మంత్ చమీరా(2/19), మహీష్ తీక్షణ(2/11) రెండేసి వికెట్లు తీయగా, దునిత్ వెల్లలేగే, దుషన్ హేమంత, కామిందు మెండీస్ తలో వికెట్ తీసారు. ఈ గెలుపుతో శ్రీలంక గ్రూప్‌బీలో టాపర్‌గా కొనసాగుతోంది.




## వరల్డ్‌కప్ అరంగేట్రంలో సంచలనం..

### అనామక ఇటలీ చేతిలో చిత్తైన నేపాల్

**న్యూఢిల్లీ:** టీ20 ప్రపంచకప్ 2026లో పసికూన ఇటలీ సంచలనం సృష్టించింది. ముంబయి వేదికగా గురువారం నేపాల్‌తో జరిగిన మ్యాచ్‌లో ఏకంగా 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. చిన్న జట్టు ఇటలీ అరంగేట్రంలోనే మాతో జాగ్రత్త అనే హెచ్చరికలు పంపుతూ బోణీ కొట్టింది. గత మ్యాచ్‌లో ఇంగ్లండ్‌ను వణికించిన నేపాల్‌ను గడగడ వణికిస్తూ జయభేరి మోగించింది. ఓపెనర్ల విధ్వంసంతో 124 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఉఫ్‌మని ఊదేసి. మేము చెలరేగితే ఇలా ఉంటది అని చాటింది. ఊహించని ఓటమితో నేపాల్ షాక్‌లో కూరుకుపోయింది. నేపాల్ నిర్దేశించిన 124 పరుగుల లక్ష్యాన్ని ఇటలీ 12.4 ఓవర్లలో ఒక్క వికెట్ కూడా కోల్పోకుండా ఛేదించింది. ఓపెనర్లు జస్టిన్ మోస్కా (60 పరుగులు), ఆంథని మోస్కా (62 పరుగులు) హాఫ్ సెంచరీలతో చెలరేగారు. దీంతో 44 బంతులు మిగిలుండగానే ఇటలీ విజయం సాధించింది. అంతకుముందు బ్యాటింగ్ చేసిన నేపాల్ 19.3 ఓవర్లలో 123 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఆరిఫ్ షేక్ (27 పరుగులు), రోహిత్ పౌడెల్ (23 పరుగులు), ఆసిఫ్ షేక్ (20 పరుగులు) ఫర్వాలేదనిపించారు. ఇటలీ బౌలర్లలో క్రిషన్ 3, బెన్ 2, అలీ హసన్, జస్ప్రీత్ సింగ్, సమ్స్ తలో 1 వికెట్ దక్కించుకున్నారు. కాగా, ఇదే టోర్నీలో రీసెంట్‌గా తొలి మ్యాచ్‌లో పటిష్ఠమైన ఇంగ్లాండ్‌ను ఓడించినంతపని చేసిన నేపాల్ ఈ మ్యాచ్‌లో కనీసం పోటీ ఇవ్వకపోవడం గమనార్హం. ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసిన ఇటలీ రెండో మ్యాచ్‌తో టోర్నీలో బోణీ కొట్టింది.

### షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో..

## ఐశ్వరీ ప్రపంచ రికార్డు



**న్యూఢిల్లీ:** ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్ 2026లో భారత్‌కు చెందిన షూటర్ ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్ ప్రపంచ రికార్డు సాధించింది. పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3 పి ఈవెంట్‌లో స్వర్ణం గెలుచుకున్నాడు. గురువారం ఢిల్లీలో జరిగిన షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ ఫైనల్‌లో ఐశ్వర్య అద్భుత ప్రదర్శన కనపరిచాడు. రెండుసార్లు ఒలింపియన్ అయిన తోమర్, నీరజ్ కుమార్‌ను కేవలం 0.2 పాయింట్ల తేడాతో ఓడించి ఆసియా ఛాంపియన్‌గా నిలిచాడు. పోటీలో చివరి షాట్ కంటే 0.2 పాయింట్లు వెనుకబడి, తోమర్ అద్భుతమైన 10.7 పాయింట్లు సాధించి తన మొత్తం 362 పాయింట్లను ప్రపంచ రికార్డుగా నమోదు చేశాడు. నీరజ్ తన చివరి షాట్‌లో 10.3 పాయింట్లు మాత్రమే సాధించి రజతంతో సరిపెట్టుకున్నాడు. అనుభవజ్ఞుడైన అఖిల్ షెరాన్ కాంస్య పతకం కోసం మూడవ స్థానంలో నిలిచాడు. ఫైనల్‌లో అతను 343.5 స్కోరుతో కాంస్య పతకాన్ని గెలుచుకున్నాడు. అంతకుముందు నీరాజ్ 593 స్కోరుతో క్వాలిఫికేషన్ రౌండ్‌లో అగ్రస్థానంలో నిలిచాడు. పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత స్వప్నిల్ కుసాలే ఈ ఖండాంతర పోటీలో పాల్గొనలేదు.

### ఆసియా ఫుట్‌బాల్ కప్‌లో

## భారత్ మహిళల, పురుషుల జట్లు డ్రా

**న్యూఢిల్లీ:** ఎఎఫ్‌సి అండర్17 ఆసియాకప్-2026లో భారత ఫుట్‌బాల్ జట్లు కఠినమైన పోటీలో మ్యాచ్‌లను డ్రా గా ముగించాయి. కౌలాలంపూర్‌లో గురువారం జరిగిన ఫైనల్ డ్రాలో ఎఎఫ్‌సి అండర్ 17 మహిళల ఆసియా కప్ గ్రూప్ బి లో జపాన్, ఆస్ట్రేలియా, లెబనాన్‌లతో కలిసి భారత్ జట్టు డ్రాగా ముగించింది. ఇదే సమయంలో ఎఫ్‌సి అండర్ 17 పురుషుల ఆసియా కప్ గ్రూప్ డి లో ఉజ్బెకిస్తాన్, ఆస్ట్రేలియా మరియు డిపిఆర్ కొరియాతో కలిసి ఉంది. క్వాలిఫయర్స్‌లో ఇరాన్, లెబనాన్, పాలస్తీనా, చైనీస్ తైపీలను అధిగమించి భారత్ చరిత్రలో 10వ సారి ఎఎఫ్‌సి అండర్17 ఆసియా కప్‌కు అర్హత సాధించింది. బ్లూ కోల్ట్స్ జట్టు ఆస్ట్రేలియాతో తమ ప్రచారాన్ని ప్రారంభించి, ఆ తర్వాత ఉజ్బెకిస్తాన్ మరియు డిపిఆర్ కొరియాతో తలపడుతుంది. ఉజ్బెకిస్తాన్ డిఫెండింగ్ ఛాంపియన్ కావడంతో ఈ టోర్నమెంట్‌కు స్వయంచాలకంగా అర్హత సాధించింది. గత 2025 ఎడిషన్‌లో ఆస్ట్రేలియా గ్రూప్ దశలోనే ఓడిపోయింది మరియు జోర్డాన్, భూటాన్, ఫిలిప్పీన్స్‌పై విజయాల తర్వాత 2026 టోర్నమెంట్‌కు అర్హత సాధించింది. రెండుసార్లు మాజీ ఛాంపియన్లు అయిన డిపిఆర్ కొరియా 2025లో సెమీఫైనలిస్టులుగా నిలిచింది. తద్వారా ప్రస్తుత ఎడిషన్‌కు ఇప్పటికే అర్హత సాధించింది. గ్రూప్ ఎ లో ఆతిథ్య సౌదీ అరేబియా తజికిస్తాన్, థాయిలాండ్, మయన్మార్‌లతో డ్రా చేసుకుంది.

### టి20 వరల్డ్ కప్‌లో..

## గ్రూప్ ఆఫ్ డెత్‌లో అఫ్ఘానిస్థాన్

### సూపర్ 8 నుండి ఒమెన్, ఐర్లాండ్ ఔట్



**న్యూఢిల్లీ:** టీ20 ప్రపంచ కప్-2026లో ఆఫ్ఘనిస్తాన్ వరుసగా రెండు పరాజయాలను చవిచూసింది. దీంతో వారు సూపర్ 8 దశకు అర్హత సాధించే విషయం కష్టక్లిష్టంగా మారింది. ఇక రెండు మ్యాచ్‌లకు రెండు ఓడిన ఐర్లాండ్, ఒమన్ సూపర్ 8 రేసు నుంచి తప్పుకున్నాయి. కాగా దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో సూపర్ ఓవర్‌లో ఉత్కంఠభరితమైన ఓటమి తర్వాత ఆఫ్ఘనిస్తాన్ ప్రపంచ కప్‌కు వెళ్లే మార్గం మరింత కష్టతరంగా మారింది. కానీ సూపర్ 8 రౌండ్‌కు చేరుకోవాలనే వారి ఆశలు ఇంకా పూర్తిగా ముగియలేదు. దక్షిణాఫ్రికా చేతిలో ఓడిపోయిన తర్వాత ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడవలసి ఉంటుంది. ఆఫ్ఘన్ ఇప్పుడు వారి నికర రన్ రేట్‌ను మెరుగుపరచుకోవడానికి యుఎఇ, కెనడాతో జరిగే మిగిలిన రెండు గ్రూప్ మ్యాచ్‌లను పెద్ద తేడాతో గెలవాల్సిన పరిస్థితి తప్పనిసరి అయింది. ఆఫ్ఘనిస్తాన్ జట్టు సూపర్ 8 కి అర్హత సాధించడానికి రెండు కీలక పరిస్థితులు కనిపిస్తున్నాయి.

మొదటి సందర్భంలో, న్యూజిలాండ్ దక్షిణాఫ్రికాను ఓడిస్తే, యుఎఇ దక్షిణాఫ్రికాను ఓడించి, కెనడా యుఎఇని ఓడిస్తే ఆఫ్ఘనిస్తాన్‌కు ఒకింత సూపర్ 8కి అవకాశాలు ఉంటాయి. ఈ సందర్భంలో న్యూజిలాండ్ గ్రూప్ డిలో అగ్రస్థానంలో ఉంటుంది. అయితే ఆఫ్ఘనిస్తాన్, దక్షిణాఫ్రికా 4 పాయింట్లతో సమానంగా ఉంటాయి. ఇక్కడ నిర్ణయం నికర రన్ రేట్ ఆధారంగా ఉంటుంది. దీంతో పెద్ద తేడాతో గెలిస్తే ఆఫ్ఘనిస్తాన్ తదుపరి రౌండ్‌కు టికెట్ పొందవచ్చు. రెండవ సమీకరణం న్యూజిలాండ్‌ను ఓడిస్తే, దక్షిణాఫ్రికా 8 పాయింట్లతో గ్రూప్‌లో అగ్రస్థానంలో ఉంటుంది. ఈ సందర్భంలో, కెనడా న్యూజిలాండ్‌ను ఓడించి, ఆపై యుఎఇ కెనడాపై గెలిస్తే ఆఫ్ఘనిస్తాన్ మరియు న్యూజిలాండ్ రెండూ చెరో 4 పాయింట్లు కలిగి ఉంటాయి.

మరోసారి, సూపర్ 8కి చేరుకున్న రెండవ జట్టు నికర రన్ రేట్ ద్వారా నిర్ణయించబడుతుంది. దీనిలో ఆఫ్ఘనిస్తాన్ న్యూజిలాండ్ కంటే మెరుగైన స్థితిలో ఉండాలి. ఇక ఈ టోర్నమెంట్‌లో మూడు బలమైన జట్లను కలపడంతో దీన్ని గ్రూప్ ఆఫ్ డెత్ గా పరిగణించారు. ఈ గ్రూప్‌లో బలమైన ఆఫ్ఘనిస్తాన్, న్యూజిలాండ్ మరియు దక్షిణాఫ్రికా ఒకదానిపై ఒకటి పోటీపడుతున్నాయి. గత టీ20 ప్రపంచ కప్‌లో సెమీ ఫైనలిస్ట్ అయిన ఆఫ్ఘనిస్తాన్ ప్రస్తుతం కీలకమైన క్లిష్టపరిస్థితిని ఎదుర్కొంటోంది. రషీద్ ఖాన్, అతని బృందం తదుపరి ఈ నె 16న యుఎఇతో మరియు ఫిబ్రవరి 19న కెనడాతో తలపడనుంది.




### పురుషుల ప్రో లీగ్..

## భారత్ ఓటమి

### 3-1తో బెల్జియం విక్టరీ


**న్యూఢిల్లీ:** పురుషుల ప్రో లీగ్ 2025-26లో బెల్జియం చేతిలో భారత్ ఓటమిపాలయింది. పురుషుల ప్రో లీగ్ రూర్కెలా లెగ్‌లో బెల్జియం భారత్‌ను 3-1 తేడాతో చిత్తు చేసింది. బెల్జియం తరపున నెల్సన్ ఓనానా (23వ నిముషం), థామస్ క్రోల్స్ (53), ఆర్నో వాన్ డెస్సెల్ (57) గోల్స్ సాధించగా, భారత్ తరపున శిలానంద్ లక్రా (29) గోల్స్ చేశాడు. బెల్జియంకు 4వ నిమిషంలోనే పెనాల్టీ కార్నర్ లభించింది, అయితే, అలెగ్జాండర్ హెండ్రిక్స్ డ్రాగ్‌ఫ్లిక్‌ను భారత తొలి రషర్ వివేక్ సాగర్ ప్రసాద్ ఆపాడు. బెల్జియం (14) మరో పెనాల్టీ కార్నర్‌ను గెలుచుకుంది. కానీ ఈసారి టామ్ బూన్ అడ్డుకోవడంతో లక్ష్యం నుండి తృటిలో దూరమైంది. రెండవ క్వార్టర్‌లో (21) బెల్జియంకు పెనాల్టీ కార్నర్ లభించినా భారత గోల్ కీపర్ పవన్ అలెగ్జాండర్ హెండ్రిక్స్ గోల్ చేయకుండా నిరోధించాడు. బెల్జియంకు చెందిన థామస్ క్రోల్స్ గోల్ సాధించాడు. కానీ పవన్ తన గోల్‌ను కాపాడుకోవడానికి మరో కీలకమైన సేవ్ చేశాడు. ఈ సమయంలో థామస్ బంతిని నెల్సన్ ఓనానా (23)కి పాస్ చేయడంతో అతను గోల్ చేశాడు. ఆతిథ్య జట్టు (29) మరో అద్భుతమైన దాడి చేసి పెనాల్టీ కార్నర్‌ను గెలుచు కుంది. మూడవ క్వార్టర్‌లో (38) బెల్జియం మరో పెనాల్టీ కార్నర్‌ను గెలుచుకుంది. జర్మన్‌ప్రీత్ సింగ్ గోల్ లైన్‌లో సేవ్ చేసి స్కోర్‌లను సమంగా ఉంచాడు. నీలకంఠ శర్మ (53) కార్తీ సెల్వమ్‌కు అద్భుతమైన పాస్ అందించినా ఫార్వర్డ్ గోల్‌పై షాట్ తీసుకోలేకపోయాడు. లూకాస్ బాల్తాజార్ బేస్‌లైన్ నుండి సర్కిల్‌లోకి సరైన పాస్‌ను ఆడాగా, థామస్ క్రోల్స్ (53) ఆధిక్యాన్ని అందించాడు. థామస్ మళ్లీ (57) బంతిని సెట్ చేసి బెల్జియంకు విజయాన్ని అందించాడు.

## నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

### నిఫ్టీ, ఐటి సూచీల్లోనే 1.62 లక్షలకోట్లు ఆవిరి




**ముంబయి, ఫిబ్రవరి 12:** దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం నష్టాలతో ముగిశాయి. ప్రధానంగా ఐటీ రంగ షేర్లలో భారీ అమ్మకాల ఒత్తిడి సూచీలను కిందకు లాగింది. కొన్ని బ్యాంకింగ్, ఫైనాన్షియల్ స్టాక్స్‌లో కొనుగోళ్లు కనిపించినా, టెక్నాలజీ రంగంలో బలహీన సెంటిమెంట్‌ను అధిగమించలేకపోయాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్ఈ సెన్సెక్స్ 558.72 పాయింట్లు నష్టపోయి 83,674.92 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 146.65 పాయింట్లు క్షీణించి 25,807.2 వద్ద ముగిసింది. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ ఐటీ ఇండెక్స్ ఏకంగా 5.51 శాతం కుప్పకూలింది. టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు తీవ్ర అమ్మకాల ఒత్తిడికి గురై నష్టాలు చవిచూసిన కంపెనీలుగా నిలిచాయి. ఆటో దిగ్గజం మహీంద్రా మహీంద్రా కూడా నష్టాల్లోనే ముగిసింది. మరోవైపు, మార్కెట్ బలహీనంగా ఉన్నప్పటికీ బజాజ్ ఫైనాన్స్, ఐసీఐసీఐ బ్యాంక్, భారత్ ఎలక్ట్రానిక్స్ (బీఇఎల్), ట్రెంట్ వంటివి లాభపడి సూచీలకు కొంత మద్దతు ఇచ్చాయి. నిఫ్టీ 25,840-25,900 స్థాయిని దాటనంత వరకు స్వల్పకాలికంగా మార్కెట్ బలహీనంగానే కొనసాగిందని అంచనావేసారు. ఐటీతో పాటు రియల్టీ, ఆయిల్ అండ్ గ్యాస్ రంగాల షేర్లు కూడా ఒత్తిడికి గురయ్యాయి. బ్రాడర్ మార్కెట్లలో మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా నష్టాలతోనే ముగిశాయి. ప్రత్యేకించి నిఫ్టీలో ఐటి సూచీ 5.51శాతం దిగజారింది. నిఫ్టీ ఐటి కంపెనీ మొత్తం మార్కెట్ విలువలు రూ.27,32,579 కోట్లకు చేరింది. సూరుగా 1.6 లక్షలకోట్లు కంపెనీల షేర్లరూపంలో నష్టం వచ్చినట్లు తెలుస్తోంది. టిసిఎస్ 5.48శాతం 52 వారాల కనిష్టం రూ.2750కి చేరింది. ఇన్ఫోసిస్ 5.48, టెక్‌మహీంద్ర 6.40శాతం, హెచ్‌సిఎల్ టెక్, ఎంఫసిస్, విప్రో కంపెనీలు 4.5 నుంచి ఐదుశాతం చొప్పున దిగజారాయి. మొత్తం ఐటి సూచీని డేంజర్‌జోన్‌లోకి గురువారం నెట్టివేసినట్లయింది. ఒక బిఎస్ఇ మిడ్‌క్యాప్ సూచీ 0.46శాతం క్షీణించింది. స్మాల్‌క్యాప్‌సూచీ కూడా 0.86శాతంమేర దిగజారింది. బిఎస్ఇలో 1676 కంపెనీలు పెరిగితే 2530 కంపెనీలుక్షీణించాయి. డాలరుతో రూపాయి మారకం విలువలు 96.82గా కొనసాగి రూపాయి క్షీణతను కొనసాగించారు. కమోడిటీ మార్కెట్‌లో బ్రెంట్ ముడిచమురు ఏప్రిల్ సెటిల్‌మెంట్లకుగాను 39 సెంట్లు క్షీణించి బ్యారెల్‌కు 69.01 డాలర్లుగా మారాయి.



## వేతన పెంపును ప్రకటించిన 'విప్రో'

**బెంగళూరు, ఫిబ్రవరి 12:** సాఫ్ట్‌వేర్ సేవల కంపెనీ విప్రో తన ఉద్యోగులకు మార్చి ఒకటవ తేదీనుంచి జీతాలను పెంచుతున్నట్లుప్రకటిం చడంతో ఉద్యోగులకు కొండంత ఊరట లభించింది. వేతన పెంపు ఎంతమేర ఉంటుం దన్నది ఇప్పటివరకూ స్పష్టత ఇవ్వలేదు. భారతీయ ఐటి సేవల కంపెనీలు వేతనాల పెంపుపై ఫోకస్ పెంచాయి. అలాగే వేరియబ్ వేతనాలపెంపును కూడా పరిశీలిస్తున్నాయి. అనిశ్చిత వాణిజ్య పరిస్థితుల్లో వేరియబుల్ పే మంచిదన్న భావనతో ఉన్నారు. సుంకాల యుద్ధం, భౌగోళిక ఉద్రిక్తతలు ఇందుకు కీలకంగా భావించాలి. టిసిఎస్ ఏప్రిల్‌ణుంచి పెంచాలని చూసినా గత సెప్టెంబరునుంచే పెంచుతున్నట్లు ప్రకటించింది.

## హిందాల్కో నికరలాభం రూ.2049 కోట్లు

**ముంబయి, ఫిబ్రవరి 12:** హిందాల్కో ఇం డస్ట్రీస్ నికరలాభం మూడో త్రైమాసికంలో రూ.2049 కోట్లు ఆర్జించినట్లు ప్రకటిం చింది. అయితే గత ఏడాది ఇదే కాలంలో 4741 కోట్లు ఆర్జించిన సంస్థ 56.8శాతం నికరలాభాలు క్షీణించినట్లు ప్రకటించింది. రాబడులపరంగా 0.7 శాతం పెరిగాయి. రూ. 66,521గా నమోదయింది. గతత్రైమాసి కంలో 66,058 కోట్లనుంచి స్వల్పంగా పెరిగింది. ఎబిడిటా కూడా 10.8శాతం క్షీణించి రూ.7994 కోట్లుగా ఉంది. అంతకుముందు ఏడాది ఇదే కాలంలో రూ. 8996 కోట్లుగా ఉంది.ఎబిడిటా మార్జిన్ 13.6శాతంనుంచి 12శాతానికి తగ్గింది. కంపెనీ న్యూయార్క్ లోని ఒస్వేగో ప్లాం ట్‌లో అగ్నిప్రమాదం కారణంగా రూ. 2610 కోట్లు భారం పడింది. ఇదే త్రైమా సిక ఫలితాలపై ప్రభావంచూపించిందని కంపెనీ చెపుతోంది. ఇక అల్యూమినియం విభాగం త్రైమాసిక ఎబిడిటా రూ.4832 కోట్లుగా ఉంది. 14శాతంపెరిగింది. ఆదిత్య ఎఫ్ఆర్‌పి, బ్యాటరీ ఫాయిల్, ఎసి ఫిన్ కోటింగ్; కాపర్ ట్యూబ్స్ వంటివాటిలో మంచి బిజినెస్ చేసుకోగలిగామని హిం దాల్కో ఎండి సతీష్‌పాయ్ అన్నారు. త్రైమా సిక పలితాలప్రకటనకు ముందు హిం దాల్కో షేర్లు 0.65శాతం దిగువన అంటే రూ.964.40వద్ద ఎన్ఎస్ఇలో కొనసా గాయి. బెంచ్‌మార్క్ నిఫ్టీ 0.57శాతం పత నం అయితే షేహిందాల్కో షేర్లు మరింత క్షీణించాయి.

## జనవరి రిటైల్ ద్రవ్యోల్బణం 2.75%



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** వినియోగదారుల ధరలసూచీ ఆధారంగా నిర్ధారించే ద్రవ్యోల్బణాన్ని జనవరి నెలకుగాను 2.75శాతంగా ఉందని కేంద్ర అర్థగణాంకశాఖ పథక అమలుశాఖ వెల్లడించింది. అఖిలభారత వినియోగదారుల ఆహార ధరల సూచీ ఆధారంగా జనవరిలో 2.13శాతంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ఆహార ఉత్పత్తులధరలు 1.96శాతంపెరిగాయి. పట్టణప్రాంతాల్లో 2.44శాతంగా ఉన్నట్లు మోస్పి వెల్లడించింది. ఏటికేడాది హౌసింగ్ ద్రవ్యోల్బణం రేటు జనవరిలో 2.05శాతంగా ఉంది. హౌసింగ్ దరలు కూడా 2.39శాతం గ్రామీణప్రాంతాల్లోను 1.92శాతం పట్టణప్రాంతాల్లోను పెరుగుదలనమోదుచేసాయి. జనవరి సిపిఐ ద్రవ్యోల్బణ డేటాను 2024 బేస్ ఇయర్‌గా చేసుకుని నిర్ధారించారు. గడచిన 12 ఏళ్లుగా వ్యయం తీరు ఎలా మార్పులు చెందిందీ కూడా ఈ బేస్ ఇయర్ మార్పువల్ల తెలుస్తుందని మోస్పి వెల్లడించింది. కొత్త వ్యవస్థలో సేవలరంగానికి కొంత ఒత్తిడిపెరుగుతుంది. ఆహార ఉత్పత్తుల వాటా మాత్రం కొంతమేర తగ్గుతుంది. ఇక గ్రామీణ హౌసింగ్, ఆన్‌లైన్ మీడియా సర్వీస్ ప్రొవైడర్లు లేదా స్ట్రీమింగ్ సేవలసంస్థలు, విలువలు జోడింపు ఉన్న డైయిరీ ఉత్పత్తులు, బార్లే, ఇతర ఉప ఉత్పత్తులు, పెన్‌డ్రైవ్ బాహ్య హార్డ్ డిస్క్, అటెండెంట్, బేబి సిట్టర్, కసరత్తుల సామనరగి వంటి వాటిని కూడా ఈసారి ద్రవ్యోల్బణంలో మదింపుకోసం ఎంచుకున్నారు. విసిఆర్, డివిడి ప్లేయర్లు, రేడియో టేప్‌రికార్డరు, సెకండ్‌హ్యాండ్ దుస్తులు, పీచు లేదా పీచుతో రూపొందించిన తాడు వంటిఉత్పత్తులను మాత్రం మదింపునుంచి మినహాయించారు. 2012 వరకూ వచ్చిన బేస్ ఇయర్‌సాయంతో రిటైల్‌ద్రవ్యోల్బణాన్ని గణించారు. ఈసూచీలో ఆహారం, శీతలపానీయాలకు ఎక్కువ వాటా ఉంది. ఆ తర్వాత హౌసింగ్, ఇంధనం, సేవలరంగం అంటే రవాణా, ఆరోగ్యం, విద్యారంగాలు కూడా నిలిచాయి. ప్రతి కేటగిరికి ఇచ్చిన ప్రాధాన్యం కుటుంబీకుల వ్యయ సర్వేల ఆధారంగా ఉంటుందని సగటు వ్యయం ఆధారంగా మదింపుచేసి నిర్ధారించడం జరుగుతుందని మోస్పి వెల్లడించింది.






Print and Published by Gireesh Sangh, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at 11-37, Moramputi, Rajamahendravaram-533 103. Phone: 24 2460408. RNI No.64863/96, Editor: Damerla Sai Baba, Responsible for selection of News-under the PRB Act. Regd: No.H/SD/337/09-11 . Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



# ఛాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో** ఛాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్ట్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత పేర్కొన్నారు.జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో వసతి గృహాల విద్యార్థులకు స్థానిక ఆర్ట్స్ కళాశాల సమీపంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాలు గురువారం సాయంత్రం పరుపులు అందజేసే కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పేద మరియు నిరుపేద వర్గాలకు సమన్యాయం చేయడంలో న్యాయ సేవాధికారి సంస్థ నిబద్ధతతో పనిచేస్తోందని తెలిపారు. జాతీయ,రాష్ట్ర న్యాయ సేవాధికారి సంస్థలు సరైన దిశానిర్దేశం చేస్తున్నాయని వెల్లడించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో ఉన్న సుమారు 500 సంక్షేమ వసతి గృహాలను 65 మంది న్యాయ అధికారులతో కలిసి సందర్శించి, విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనపై నివేదిక సమర్పించామని తెలిపారు. ఆ నివేదికల ఆధారంగా అనేక చోట్ల వసతులు మెరుగు పర్చినట్లు పేర్కొన్నారు. ఆర్థిక నిధుల విడుదలలో జాప్యం వల్ల కొంత ఇబ్బందులు ఎదురవు తున్నప్పటికీ, వాటిని పరిష్కరించేందుకు న్యాయ సేవాధికారి సంస్థ చర్యలు తీసుకుంటోందన్నారు. వసతి గృహాల్లో సమస్యలు ఉంటే విద్యార్థులు వార్డెన్ లేదా సంబంధిత అధికారులకు తెలియ జేయాలని, స్పందన లేనిపక్షంలో న్యాయ సేవాధికారి సంస్థకు ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదుదారుల పేర్లు గోప్యంగా ఉంచబడతాయని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల సమీపంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో 370 మంది విద్యార్థులకు పరుపులు అందజేసే కార్యక్రమం నిర్వహించారు. దాతృత్వం చూపించిన ఛాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్ట్ కి ప్రశంసా పత్రాలు అందజేశారు. సేకరించిన నిధుల్లో 90 శాతం ఇటువంటి సేవా కార్యక్రమాలకు వినియోగించడం అభినందనీయమన్నారు మానవ జీవితం చిన్నదైనా, సమాజానికి మేలు చేసే కార్యక్రమాలు చేపట్టడం ద్వారా పలువురికి స్ఫూర్తిగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డి.ఎల్.ఎస్.ఎ కార్యదర్శి ఎన్. శ్రీలక్ష్మి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి ఎం.డి. ఘయాజుద్దిన్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్ట్ ప్రతినిధులు బాల నాగు గణేష్ గుప్తా, ఐ. మురళీధర్, బి. సుబ్బారాయుడు, వై. వెంకటేశ్వరరావు, ఎల్. వీరభద్రరావు, ఎస్. సీతారామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.




తూర్పుగోదావరి, కాకినాడ
డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ

వార్త

రాజమహేంద్రవరం | శుక్రవారం 13 ఫిబ్రవరి 2026 | I


# క్రీడలతో కీర్తి... సేవలతో గుర్తింపు

### ఆదిదంపతులకి ఘన సన్మానం



**అమలాపురం,పిబ్రవరి12,ప్రభాతవార్త** అనునిత్యం ప్రజలతో మమేక మవుతూ వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ క్రీడారంగంలో సైతం ప్రతిభ చాటుతున్న ఆశెట్టి ఆదిబాబు యువతకు ఆదర్శమని శ్రీదేవి ఉత్సవ కమిటీ అధ్యక్షులు గంగాబత్తుల రాంబాబు అన్నారు. ఉభయ గోదావరి జిల్లాల పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బెంచ్ ప్రెస్ విభాగంలో బంగారు పతకం సాధించిన ఆదిబాబును,ఆయన సతీమణి ఆదర్శనీయ కౌన్సిలర్ ఆయన సతీమణి ఆశెట్టి నాగ దుర్గ దంపతులను స్థానిక శ్రీదేవి మార్కెట్లో శ్రీదేవి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సత్కరించారు.పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య దుశ్శాలువా నూతన వస్త్రాలు, జ్ఞాపికలు అందజేసి,ఉత్సవ కమిటీ సభ్యులు,వర్తకులు పూలమాలలతో అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ,పట్టణ అభివృద్ధికి కృషి చేయడమే కాక ప్రజాప్రతినిధులుగా,రాజకీయం గా, సేవాభావంలోను,వివాద రహితులుగా మెలుగుతూ గొప్ప ఆదర్శ నీయు దంపతులుగా అభివర్ణించారు.ఈ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని ఉద్బోధించారు.ఈ సందర్భంగా ఆదిబాబు మాట్లాడుతూ తమకి సన్మానం చేసిన ఉత్సవ కమిటీ అధ్యక్షులు రాంబాబు,కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తా యని యువత క్రీడల వైపు ఆసక్తి చూపుతూ,సమాజ సేవలో భాగస్వాములైతే సమాజం మరింత ముందుకు సాగుతుంద న్నారు. భవిష్యత్తులోనూ క్రీడా రంగంలో మరింత ప్రతిభ చూపడం తో పాటు, సేవా కార్యక్రమాల్లో కొనసాగుతానని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు సలాది గోవిందు,ఆకుల నాగేశ్వర రావు,రేపాక సత్య నారాయణ, కొండేటి వెంకటేశ్వర రావు, మామిడిపల్లి రాంబాబు,కోకా నానిబాబు,వంటెద్దు గంగాద్రి, కుప్పాల రామకృష్ణ,గంగాబత్తుల దొరబాబు, కొర్లపాటి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# శిక్షణ పూర్తిచేసుకున్న యువతకు సర్టిఫికెట్లు ప్రదానం



**యు.కొత్తపల్లి, ఫిబ్రవరి 12 (ప్రభాతవార్త):** యువతగా ఉన్నప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించగలమని, ఎంత ఎక్కువగా మేధస్సును అంతగా విజయాలను సాధించగలమని లెఫియస్ ఫార్మా సీనియర్ వైస్ ప్రెసిడెంట్, ఆపరేషన్స్ లక్ష్మీ నారాయణ అన్నారు. మహిళా నైపుణ్యాభివృద్ధి, ప్రతిభా కేంద్రాల ద్వారా ఉచిత శిక్షణ పొందిన192 మంది యువతీయువకులకు గురువారం సర్టిఫికేట్ లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతగా ఉన్నప్పుడే అనుకున్న లక్ష్యాలను సాదించగలమని, ఎంత ఎక్కువ మేధస్సును ఉపయోగిస్తే అంతగా విజయాలను సాదించగలమన్నారు. ప్రతిభ కేంద్రం ద్వారా ప్రైవేట్, ప్రభుత్వ రంగాలలో అవకాశాలను అన్వేషించడానికి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అలాగే మహిళా నైపుణ్యా భివృద్ధి కేంద్రం ద్వారా కుట్టుపని, చీర పెయింటింగ్, డిజైనర్ బ్లౌజ్‌లు కుట్టడం వంటి వాటిలో శిక్షణ ఇచ్చి స్వంత వ్యాపారాన్ని ప్రారంభించడానికి సంస్థ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ హెచ్.ఆర్ డిపార్టుమెంటు సీనియర్ జనరల్ మేనేజర్ సాంబశివరావు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆలయ హుండీ లెక్కింపు

**రామచంద్రపురం,ఫిబ్రవరి 12 ( ప్రభాతవార్త):** శ్రీ మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి వారి దేవస్థానం హుండీ ఆదాయం గురువారం లెక్కింపు నిర్వహించారు.ఈఓ ఏ. వెంకట దుర్గా భవాని పర్యవేక్షణలో హుండీ లెక్కింపు చేపట్టారు 78 రోజులకు గాను రూ.26,59,090 అన్నదానం రూ.87,526 హుండీల ఆదాయం వచ్చిందని దేవస్థాన ఈఓ తెలిపారు.హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ సిబ్బంది,భక్త బృందం,అర్చకులు,ఎస్ఐ ఎమ్ లక్ష్మణ్,సొసైటీ చైర్మన్ ముప్పనపల్లి గణేష్,సలాది శ్రీను,ఆళ్ల బుజ్జి,దవులూరి రామకృష్ణ,అల్లం రామకృష్ణ,తదితరులు పాల్గొన్నారు...

# హాట్‌స్పాట్ గ్రామాల్లో వెట్టి విమోచనపై విస్తృత ప్రచారం



**దేవరపల్లి, ఫిబ్రవరి 12 (ప్రభాతవార్త):** వెట్టి విమోచన చట్టం స్వర్ణోత్సవాన్ని పురస్కరించుకుని దేవరపల్లి మండలంలోని హాట్‌స్పాట్ గ్రామాల్లో వెట్టి చాకిరి నిర్మూలనపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వెట్టి విమోచన కోయిలేషన్ జిల్లా కన్వీనర్ విజయనిర్మల ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టారు. మండల పరిధిలోని ఇటుక బట్టీలు, ఫ్యాక్టరీలు, చిన్న పరిశ్రమలు, ఆటో స్టాండ్లు మరియు కార్మికులు అధికంగా పనిచేసే ప్రాంతాల్లో ప్రత్యేక ప్రచారంతో పాటు ఆటోల్లో మైక్ ప్రచారం ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించారు. వెట్టి చాకిరి నేరమని, అప్పుల పేరుతో బలవంతపు శ్రమకు గురిచేయడం చట్టవిరుద్ధమని గ్రామాల్లో ఆటోమైక్ ద్వారా విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయనిర్మల మాట్లాడుతూ, పలు కార్మికులు మరియు అట్టడుగు వర్గాల ప్రజలు వెట్టి చాకిరీకి గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున వారిలో చట్టంపై అవగాహన పెంపొందించడం అత్యవసరమని తెలిపారు. పోస్టర్లు, పాంప్లెట్ పంపిణీ చేస్తూ కార్మికులతో ప్రత్యక్షంగా మాట్లాడి చైతన్యం కల్పించారు. మండలంలో వెట్టి చాకిరి పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వ యంత్రాంగం, కార్మిక శాఖ మరియు స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేస్తున్నాయని నిర్వాహకులు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ప్రచార కార్యక్రమాలు విస్తృతంగా చేయనున్నట్లు తెలిపారు.

# ఉపాధి కూలీల ఆవేదన.. గ్రామ సభలో నిరసన



**కాట్రేనికోన ఫిబ్రవరి 12(ప్రభాతవార్త)** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిర్వహణ విధులపై కాట్రేనికోన గ్రామ సచివాలయం వద్ద గురువారం సర్పంచ్ గంటి వెంకట సుధాకర్ అధ్యక్షతన సామాజిక తనిఖీ గ్రామ సభ జరిగింది. ఈ సందర్భంగా స్థానిక ఉపాధి పనులపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామ సభ జరుగుతున్నట్లు ఎవరికీ తెలియదని అన్నారు. పనుల్లో జవాబుదారీతనం, పారదర్శకత కరువైందన్నారు. పనులు చేసే ప్రదేశాలలో కనీసం మంచినీరు సౌకర్యం కల్పించడం లేదని లేదని,ప్రమాదాలు జరిగితే ప్రథమ చికిత్స సౌకర్యాలు కూడా లేవని ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో మండల స్థాయి ఉపాధి సిబ్బంది కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించే వారని ప్రస్తుతం నిర్లక్ష్యంగా పట్టించుకోవడంలేదని వారు ఆరోపించారు. గ్రామసభను మొక్కుబడి తంతు గా నిర్వహించారని స్థానికులు ఆరోపించారు. ఈ సామాజిక తనిఖీ గ్రామ సభలో కొందరు ఉపాధి కూలీలు తప్ప, స్థానిక గ్రామ ప్రజలు లేకపోవడంపై నిరసన వ్యక్తంమైంది.పంచాయతీ కార్యదర్శి జె వి వి సత్యనారాయణ, మండల ఉపాధి ఏపీవో చంద్రమోహన్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# తునిలో సార్వత్రిక సమ్మె విజయవంతం



**తుని, ఫిబ్రవరి 12,( ప్రభాతవార్త )** దేశవ్యాప్తంగా చేపట్టిన సార్వత్రిక సమ్మెలో భాగంగా తుని పట్టణంలో సిఐటియు, ఉద్యోగ, కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ శాంతియుతంగా విజయవంతమైంది. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థలు బంద్ కారణంగా మూతపడ్డాయి. సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ, ఆశా, పారిశుద్ధ్య కార్మికులు, కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు తుని పట్టణంలో భారీ నిరసన ర్యాలీ చేపట్టారు.ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, ఉద్యోగుల, కార్మికుల హక్కులను కాపాడాలని కోరుతూ తాసిల్దార్ కు వినతిపత్రం అందించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి పట్టణంలోని స్థానిక గొల్ల అప్పారావు సెంటర్ వద్ద మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నేత నెక్కెళ్ళ శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని, ఉపాధి హామీ పథకం 200 రోజులకు పొడిగించాలని అన్నారు. అదేవిధంగా అంగన్వాడి, మధ్యాహ్న భోజన కార్మికులను ఆశా వర్కర్స్ ని రెగ్యులైజ్ చేసి వారికి జీతభత్యాలు సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ ఉపాధి పథకం లో మహాత్మా గాంధీ పేరు తొలగించడాన్ని ఆయన వ్యతిరేకించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నేత తాజుద్దీన్, జర్నలిస్ట్ ఫెడరేషన్ నేత బోడపాటి ప్రవీణ్ చక్రవర్తి, కార్మిక సంఘ నేతలు, అంగన్వాడీలు, ఆశా వర్కర్స్, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ అభివృద్ధిపై ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే బత్తుల



**సీతానగరం, ఫిబ్రవరి 12, (ప్రభాతవార్త):** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ భేటీ అయ్యారు. గురువారం అసెంబ్లీ సమావేశాల అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబును ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి, నియోజకవర్గ సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా శ్రీ సత్యసాయి తాగునీటి పథకాన్ని పునరుద్ధరించాలని, అలాగే రూ.681.90 కోట్లతో ప్రతిపాదించిన అమరజీవి జలధార వాటర్ గ్రిడ్ ప్రాజెక్టును మంజూరు చేయాలని కోరారు. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం భూ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలని, కోరుకొండలో లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఇనాం భూములు 1200 ఎకరాలు 22ఏ జాబితా నుండి తొలగించాలని, నియోజకవర్గంలో రోడ్లు, డ్రైన్ల అభివృద్ధికి నిధులు కేటాయించాలని, నిలిచిపోయిన ఎన్ డి బి రోడ్డు పనులను వేగవంతం చేయాలని కోరారు. వడిసలేరు ప్రమాద బాధితులకు, దివాన్‌చెరువులో బోరుబావిలో పడి మరణించిన బాలుడి కుటుంబానికి, అలాగే అనారోగ్యంతో ఉన్న పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఆర్థిక సాయం అందించడానికి నిధులు విడుదల చేయాలని, తదితర అంశాలతో కూడిన వినతి పత్రాన్ని సీఎంకు అందించారు. పై విషయాలకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి, నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి హామీ ఇస్తూ, బాధితులకు వైద్య సాయం నిమిత్తం తక్షణమే సీఎంఆర్ఎఫ్ నిధులు విడుదల చేయాలని అధికారులను ఆదేశించారని ఎమ్మెల్యే తెలిపారు.

# నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు కోరుతూ కార్మికుల సమ్మె



**రావులపాలెం, ఫిబ్రవరి 12 (ప్రభాతవార్త) :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం చేపట్టిన దేశవ్యాప్త సమ్మెలో భాగంగా అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలో సీఐటీయూ, ఏఐటీయూసీ, ఆర్టీసీ, ఎల్ఐసీ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమ్మె నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా అనంతరం కార్మికులు ర్యాలీగా జాతీయ రహదారిపై కళా వెంకట్రావు సెంటర్‌కు చేరుకుని మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరాం, యూటీఎఫ్ నాయకులు బాలాజీ, ఏఐటీయూసీ నాయకులు రామిరెడ్డి, అంగన్వాడీ ప్రాజెక్టు అధ్యక్షురాలు వెంకటలక్ష్మి, వీవోఏల జిల్లా అధ్యక్షురాలు పాము వెంకటలక్ష్మి తదితరులు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మికుల మెడకు ఉరితాళ్లు బిగించేలా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని ఆరోపించారు. కార్మికుల పొట్ట కొట్టి కార్పొరేట్లకు మేలు చేయడానికే ఈ చట్టాలు రూపొందించబడ్డాయని విమర్శించారు.యూనియన్ నాయకులను జైలులో పెట్టడం, యూనియన్ గుర్తింపు రద్దు చేయడం వంటి చర్యలకు ఈ కోడ్‌లు దారి తీస్తున్నాయని అన్నారు. అదే విధంగా స్కీం వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని, అన్ని పంటలకు గిట్టుబాటు ధరలపై చట్టం చేయాలని, కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలని, పాత ఉపాధి హామీ పథకాన్ని అమలు చేసి 200 రోజులు పని కల్పించి రోజుకు రూ.600 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు రాణి, ఇందిరా, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్, ఆశా వర్కర్స్ నాయకులు దుర్గలక్ష్మి, నాగ మణిలక్ష్మి, గౌరీ, మిడ్‌డే మీల్ వర్కర్స్ నాయకులు లక్ష్మి, ఇసుక ర్యాంప్ నాయకులు కిరణ్, తాతాజీ, లక్ష్మణరావు, స్వామి, రమేష్, కొబ్బరి సంఘం నాయకులు రామకృష్ణ, పితాని కుమార్, ఆర్టీసీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# భవిష్యత్తులో మరిన్ని పదవులను చేపట్టాలి..



**అంబాజీపేట,ఫిబ్రవరి 12 (ప్రభాతవార్త):** పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తూ, పార్టీ అధిష్టానం ఆదేశాలను పాటిస్తూ అందరి మన్ననాదు పొంది మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు గంగాధరరావు (పెదబాబు) అన్నారు. అంబాజీపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులుగా ఇటీవల నియమితులైన గూడాల ఫణి, రవణం రాములను వారి వారి స్వగృహాల వద్ద తెలుగుదేశం నాయకులు అభినందనలు తెలిపి, ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పెదబాబుతో పాటు క్లస్టర్ ఇన్చార్జిలు గణపతి వీరరాఘవులు, నాగాబత్తుల వెంకట సుబ్బారావులు మాట్లాడుతూ మండలంలో పార్టీ అభివృద్ధికి మరింత కృషి చేయాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు గెలుపొందేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మట్టపర్తి చంద్రశేఖర్, మేడిది శ్రీనివాసరావు, దొమ్మేటి వెంకట రామారావు, నేదునూరి కళ్యాణ్, నేదునూరి రాజ్ కుమార్, అధికారపు బాబ్జి, ఉప్పలగుప్తం సురేష్, కాప నాగభూషణం, ఆకుల సూరిబాబు, మట్టపర్తి సతీష్, ఓలేటి వెంకట్రావు, మట్టపర్తి శ్రీనివాసరావు, జనసేన నాయకుడు మైపాల తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుండి శ్రీ ఉమా మందేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవాలు

### సహాయ కమిషనర్ ఆలయ ఈవో సురేష్ బాబు



**కొత్తపేట, ఫిబ్రవరి 12, (ప్రభాతవార్త)** డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం మందపల్లి గ్రామంలో వేంచేసియున్న పురాణ ప్రసిద్ధిగాంచిన శ్రీ ఉమామందేశ్వర (శనేశ్వర) స్వామి వారి దేవస్థానం లో గురువారం నుంచి ఈనెల 18 వ తేదీ బుధవారం వరకు స్వామి వారు అమ్మవార్ల కళ్యాణ మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తామని దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ అలాగే ఆలయ కార్య నిర్వహణ అధికారి దారపురెడ్డి సురేష్ బాబు తెలిపారు శ్రీ ఉమా మందేశ్వర స్వామి శ్రీ ఉమా బ్రహ్మేశ్వర స్వామి వారి శ్రీ ఉమా నాగేశ్వర స్వామి వార్ల వార్షిక దివ్య కళ్యాణ మహోత్సవములు అత్యంత వైభవంగా జరుపుతామన్నారు ఈ కళ్యాణ మహోత్సవములలో భాగంగా 13 వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుండి గ్రామోత్సవం కార్యక్రమం మేళ తాళములు వివిధ సాంస్కృతిక కార్యక్రమముల నడుమన ఊరేగింపుగా ప్రారంభమై అనంతరం రాత్రి 10 గంటలకు శ్రీ స్వామి వార్ల అమ్మవార్ల దివ్య కళ్యాణం దేవస్థానం అర్చకులు వేదపండితులచే అత్యంత వైభవంగా నిర్వహించ పడుతుందని తెలిపారు 14 వ తేదీ శనివారం శని త్రయోదశి పర్వదినం అమావాస్య ముందు వచ్చుచున్నది అదేవిధంగా 15 వ తేదీ ఆదివారం మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా ఈ పర్వదినములలో యావన్మంది భక్తులు శ్రీ స్వామి వారికి తైలాభిషేకములు నిర్వహించుకొని శ్రీ స్వామి వార్లను అమ్మవార్లను సేవించి తీర్థ ప్రసాదములు స్వీకరించాలని కోరుచున్నట్లు ఈవో సురేష్ బాబు తెలిపారు

# నాణ్యతలోపంగా రోడ్డు నిర్మాణం



**అయినవిల్లి ఫిబ్రవరి 12 ప్రభాత వార్త** రోడ్డు నిర్మాణంలో నాణ్యతా లోపం కారణంగా ఆరు నెలలకే ముక్కలై శిధిలవైపోతున్నాయి కోట్ల రూపాయల ఖర్చుపెట్టి వేసిన రోడ్లు సంవత్సరం తిరక్కుండానే గోతులుగా మారి రాత్రి పగలు సమయాల్లో ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు అయినవిల్లి మండలం సిరిపల్లి వంట కాలువ వంతెన నుండి మాగం రోడ్డు సవాల వంతెన వరకు సుమారు కిలోమీటర్ రోడ్డు ఆరు నెలల క్రితమే నిర్మాణం చేశారు ఈ రోడ్డు వెడల్పు చేసి నిర్మాణం చేయవలసి ఉండగా పాత రోడ్డు నే పునరుద్ధరించారు ఆరు నెలలకే గోతులు పడి రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి ఈ రోడ్డు నిర్మాణాల్లో నాణ్యత లోపం కారణంగా శిధిలమవుతుందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించాలని కోరుతున్నారు

# అగ్ని ప్రమాదంలో 11తాటాకిళ్లు దగ్ధం.రూ. 10 లక్షల ఆస్తినష్టం



**మామిడికుదురు.ఫిబ్రవరి 12(ప్రభాతవార్త)** మామిడికుదురు ఆలక్యాస్ట్ కాలనీలో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో 11తాటాకిళ్లు అగ్నికి ఆహుతి అయ్యాయి. మొత్తం 14కుటుంబాల వారు నిరాశ్రయులై కట్టుబట్టలతో మిగిలారు. మొత్తం ఆస్తి నష్టం 10లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు.గ్యాస్ సిలెండర్ వల్ల ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు.ప్రమాద సమాచారం అందిన వెంటనే రాజోలు అగ్ని మాపక సిబ్బంది అధిపతి కెవిన్ వి రమణ ఆధ్వర్యంలో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. మంటలలో డిగ్రీ చదువుతున్న తమ సర్టిఫికెట్లు కాలిపోయాయని జల్లి నాగరాజు,కల్లి దుర్గా ప్రసాద్ లు కన్నీటి పర్యంతమయ్యారు.బాధితులకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్,తహశీల్దార్ పి.సునీల్ కుమార్, ఎంపిడిఓ జి.భవానీ, ఎంఈఓ మోకా వెంకన్నబాబు,కూటమి నేతలు బాధితులను పరామర్శించారు.బాధితులకు ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా,స్థానిక సర్పంచ్ గౌస్ మొహిద్దీన్,సోసైటీ అధ్యక్షులు ఈలి శ్రీనివాస్,టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు బోనం బాబు,మొల్లేటి శ్రీనివాస్, జాలెం శ్రీనివాసరాజు తదితరులు బాదితులను పరామర్శించారు.

# చేతివృత్తుల కళాకారుల నైపుణ్యానికి అద్దం పట్టిన ప్రదర్శన



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో** భారత ప్రభుత్వ ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖకు చెందిన ఎంఎస్ఎంఈ–డిఎఫ్ఓ విశాఖపట్నం,ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్న మూడు రోజుల 'పిఎం విశ్వకర్మ ఎగ్జిబిషన్–కమ్–ట్రేడ్ ఫెయిర్' గురువారం రాజమండ్రిలో ఘనంగా ప్రారంభించడం జరిగిందనీ ఎంఎస్ఎంఈ–డిఎఫ్ఓ, విశాఖపట్నం జాయింట్ డైరెక్టర్ ఆర్. సెంథిల్ కుమార్ పేర్కొన్నారు. గురువారం దానవాయిపేట లోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జరుగుతున్న ఈ ప్రదర్శన ఫిబ్రవరి 12, 13, 14 తేదీలలో ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రదర్శనలో 50కు పైగా స్టాల్స్ ఏర్పాటు చేసి, హస్తకళలు, కొబ్బరి పీచు ఉత్పత్తులు, కొబ్బరి చిప్పలతో తయారైన కళాఖండాలు, వివిధ చేతివృత్తుల ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారన్నారు. పిఎం విశ్వకర్మ లబ్ధిదారులకు ఉచితంగా స్టాల్స్ కేటాయించి, మార్కెటింగ్ అవకాశాలు కల్పించడం జరిగిందని తెలిపారు. బిజినెస్–టు–బిజినెస్ (బీ2బీ), బిజినెస్–టు– కస్టమర్ (బీ2జ) సంబంధాలను మెరుగు పరచడం, విశ్వకర్మ బ్రాండ్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లడం ఈ ప్రదర్శన కమ్ అమ్మకాలు యొక్క ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. రాష్ట్రంలో పిఎం విశ్వకర్మ పథకం అమలు తీరు, లబ్ధిదారులకు అందుతున్న రుణాలు, శిక్షణ, టూల్‌కిట్ ప్రోత్సాహకాలపై వివరించారు. చేతివృత్తుల అభివృద్ధి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుందని తెలిపారు. జిల్లా పరిశ్రమల కేంద్రం, రాజమండ్రి జనరల్ మేనేజర్ శ్రీవనిధర్ రామన్ మాట్లాడుతూ లబ్ధిదారు లకు అవసరమైన మార్గదర్శకాలు, రుణ సౌకర్యాలపై పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. జిల్లా పరిశ్రమల కేంద్రం, కాకినాడ జనరల్ మేనేజర్ సిహెచ్. గణపతి 'ఒక కుటుంబం––ఒక పారిశ్రామికవేత్త' పథకం లక్ష్యాలను వివరించారు. లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ డి.వి. ప్రసాద్ మాట్లాడుతూ రుణాల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు బ్యాంకులను సంప్రదించాలని, అవసరమైన సహాయం అందిస్తామని తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి మురళి శిక్షణ, స్టైపెండ్ అంశాలపై అవగాహన కల్పించారు. డిఐసిసిఐ ప్రతినిధి జార్జ్ బాబు లబ్ధిదారులు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని కోరగా, గోల్డ్ స్మిత్ అసోసియేషన్ కార్యదర్శి సతీష్ స్వర్ణకారులు రుణాలను సద్వినియోగం చేసుకుని సకాలంలో చెల్లించాలని సూచించారు. ప్రజలు కుటుంబ సభ్యులు, మిత్రులతో కలిసి ట్రేడ్ ఫెయిర్‌ను సందర్శించి విశ్వకర్మ కళాకారులను ప్రోత్సహించాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. రుణాలు, శిక్షణ, స్టైపెండ్‌లకు సంబంధించి సమస్యలు ఉన్న లబ్ధిదారులు ఈ వేదికను వినియోగించుకోవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, బ్యాంకుల ప్రతినిధులు, చేతివృత్తుల కళాకారులు పాల్గొన్నారు.

# ట్రినిటీ హాస్పిటల్ కు ఎన్ ఎ బి హెచ్ : హాస్పిటల్ చైర్మన్ కౌశిక్ హరి



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో ఫిబ్రవరి 12 ప్రభాతవార్త** ట్రినిటీ హాస్పిటల్ కు ఎన్ ఎ బి హెచ్ ఆమోదం లభించిందని హాస్పటల్ చైర్మన్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ కౌశిక్ హరి పేర్కొన్నారు. కాకినాడ జిల్లా పవర్ గ్రామంలో గల ట్రినిటీ హాస్పిటల్ నందు గురువారం ఆయన మాట్లాడుతూ హాస్పిటల్లో ప్రారంభించి మూడు సంవత్సరాలు పూర్తి చేసుకుని నాలుగో సంవత్సరంలోకి అడుగుపెడుతున్నామని, ట్రినిటీ హాస్పిటల్ కు నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్ ఆమోదం మరియు ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆమోదం పొందిందని తెలిపారు. మూడు సంవత్సరాల కాలంలో హాస్పిటల్ 10000 కంటే ఎక్కువ శస్త్రచికిత్సలు నిర్వహించిందని మరియు దాదాపు 99% మంది రోగులు శస్త్రచికిత్సల తర్వాత బాగా కోలుకున్నారని , మరణాల రేటు చాలా తక్కువగా ఉందని కూడా ఆయన తెలియజేశారు. ఆగస్టు 1, 2026 నుండి కార్డియాలజీ విభాగం (గుండె సంబంధిత సేవలు) మరియు గైనకాలజీ /పీడియాట్రిక్ విభాగం (తల్లి మరియు పిల్లల సంబంధిత ఆరోగ్య సంరక్షణ సేవలు) ప్రారంభించబోతున్నామని డాక్టర్ కౌశిక్ హరి తెలియజేశారు. రాబోయే సంవత్సరాల్లో రోగులకు నిరంతరం ఉత్తమ సేవలను అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ టి. మోహన్ విజయ్, డాక్టర్ యాళ్ల రాజా, డాక్టర్ ఎం. భరత్ మరియు ఇతర డైరెక్టర్లు ఈ ఆమోదాలపై తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.



# డాక్టర్ వివేకానంద వర్మ కన్నుమూత

**అమలాపురం,పిబ్రవరి12,ప్రభాతవార్త** కోనసీమ ప్రాంతంలో సుదీర్ఘకాలం పాటు వైద్య సేవలు అందించిన ప్రముఖ సీనియర్ సర్జన్ డాక్టరు వివేకానంద వర్మ అకస్మిక మృతి పట్ల కోనసీమ జిల్లా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు ఘన నివాళులర్పించారు. గత 45 ఏళ్లుగా సర్జన్‌గా ఆయన అందించిన సేవలు వెలకట్ట లేనివని,ఆయన మరణం కోనసీమ వైద్య రంగానికి తీరని లోటని పేర్కొన్నారు.డాక్టరు వర్మ మృతి నేపథ్యంలో నిర్వహించిన సంతాప సమావేశంలో పలువురు వైద్యులు పాల్గొని ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.ఆయన ఉన్నతమైన వ్యక్తిత్వం, వృత్తి పట్ల ఆయనకు ఉన్న అంకితభావం తోటి వైద్యులకు ఎప్పుడూ ఆదర్శప్రాయమని సభ్యులు కొనియాడారు.డాక్టరు వివేకానంద వర్మ కేవలం గొప్ప వైద్యుడిగానే కాకుండా, అచంచలమైన దేశభక్తి, జాతీయ భావాలు కలిగిన వ్యక్తిగా అందరి ప్రశంసలు అందుకున్నార ని వక్తలు తెలిపారు.?సమావేశంలో ఆయన ఆత్మకు శాంతి చేకూరాల ని కోరుతూ మౌనం పాటించి,వారి కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలిపారు.

# కోనసీమ తిరుమలలో పార్వేట మహోత్సవం... అశేష సంఖ్యలో భక్తులు.



**ఆత్రేయపురం, ఫిబ్రవరి, 12,(ప్రభాత వార్త )** కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో గురువారం వార్షిక గోవిందమాల దీక్షాధారణ కార్యక్రమాల్లో భాగంగా మాఘ బహుళ దశమి సందర్భంగా పార్వేట మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది.ఈ సందర్భంగాఖండవల్లి సాయికృష్ణ ఆధ్వర్యంలో అర్చకులు, వేద పండితులు శ్రీవారికి విశేష పూజలు నిర్వహించారు. మాఘమాసం పురస్కరించుకొని ఆ ప్రత్యక్ష భగవానుడు సూర్యనారాయణ మూర్తిని ఆరాధించుకునే క్రమంగా అరుణ పారాయణ, సూర్య నమస్కారలు, అనంతరం తిరుప్పావడ సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. తిరుమల క్షేత్రంలో మకర సంక్రమణం రోజు నిర్వహించే పార్వేట మహోత్సవాన్ని ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, (గబ్బర్ సింగ్)ముదునూరి రామభద్రరాజు లు పాల్గొని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తిలకించి పులకించారు. అనంతరం శ్రీ స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, ఆలయ ఎరుబండి రాజు, ఏపుగంటి వెంకటేష్,టెంపుల్ ఇన్స్పెక్టర్ వై, శ్రీనివాస్,శ్రీకాకోలాపు సుబ్బారావు, హరీష్ రెడ్డి,అర్చకులు,గోవింద మాలదారులు అధిక సంఖ్యలోభక్తులు పాల్గొన్నారు.

# మత్స్య సంపద కేంద్రంను సందర్శించిన కార్పొరేషన్ చైర్మన్




**కడియం ,ఫిబ్రవరి 12 (ప్రభాతవార్త)** మండల కేంద్రమైన కడియం లో గల చేప పిల్లలు ఉత్పత్తి , పెంపకం హేచరీ (మత్స్య సంపద కేంద్రం) ను రాష్ట్ర మత్స్య కార కార్పొరేషన్ ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన హేచరీ నందు ఎంతమేర చేపపిల్ల ఉత్పత్తి, ఏ సైజ్ వరకూ పెంపకం జరుగుతుంది అనే విషయాలను ఫిషరీస్ డెవలప్మెంట్ ఆఫీసర్ గోపాలరావు ను అడిగి తెలుసుకున్నారు.ఈ కేంద్రం ద్వారా మత్స్యకారులకు ఏ విధమైన సంపద కలుగుతుంది, ఏ విధంగా మత్స్యకారులను ఆదుకొని , సహకరించగలం అనే వివరాలు తెలుసుకున్నారు . మత్స్య కార సొసైటీలు, చేపల పెంపకం రైతులకు సీడు అందించే విధానం తదితర అంశాలు అడిగి తెలుసుకున్న పెద్దిరాజు అధికారులకు పలు సూచనలు చేసారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు మేరకు ఛైర్మన్ హోదాలో పర్యటిస్తూ మత్స్య సంపద కేంద్రాలను సందర్శించి, లోటుపాట్లు, స్థితిగతులు, మౌలిక వసతులు తదితర అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లడం జరుగు తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడి సుమలత, ఎఫ్డీఓ గోపాల రావు, మల్లాడి శ్రీను, సత్తిబాబు పాల్గొన్నారు.

# 22 నుండి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

### ఆలయ చైర్మన్ పాతపాటి వెంకటసత్యనారాయణ రాజు.





**ఆత్రేయపురం, ఫిబ్రవరి, 12,(ప్రభాత వార్త)** ఈనెల 22తేదీ ఆదివారం నుండి 26 తేదీ గురువారం వరకు ఆత్రేయపురం గ్రామం లో వేంచేసి యున్న శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారి ఏకాదశ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించినుట్లు ఆలయ చైర్మన్ పాతపాటి వెంకటసత్యనారాయణ రాజు తెలిపారు. ఈ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని గురువారం పందిరి రాట వేసి పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం కరపత్రిక ఆవిష్కరించారు. శ్రీవారి బ్రహ్మోత్సవ పనులు ప్రారంభం కానున్నాయి, అలాగే శ్రీవారి బ్రహ్మోత్సవాలు శోభాయమానంగా , తిరుమల తరహాలో శ్రీవారు వివిధ వాహన సేవలలో విహరిస్తారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో ఈ బ్రహ్మోత్సవాలు జరగనున్నాయని ఆలయ చైర్మన్ పాతపాటి వెంకటసత్యనారాయణ రాజు తెలిపారు. ఈ కార్యక్రమం ఆలయ అర్చకులు వాడపల్లి పవన్ దీక్షితులు , పెద్దింటి రవికృష్ణ,పెరవలి సాయిపవన్ బ్రహ్మత్వం లో మేనేజర్ గోరింట వినయ్ కుమార్ రాజు పర్యవేక్షణలో నిర్వహించారు.ఈ కార్యక్రమం లో ముదునూరి సోమరాజు , మంతెన ఆనందరాజు , వేగేశ్న కాశి విశ్వనాథ రాజు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.



## దేశవ్యాప్త సమ్మెకు మద్దతు

అమలాపురం, ఫిబ్రవరి12, ప్రభాతవార్త దేశ వ్యాప్తంగా జరిగిన సార్వత్రిక సమ్మెకు మద్దతుగా ఏపిఎన్జీవో అసోసియేషన్ పిలుపు మేరకు అంబేద్కర్ కోనసీమ జిల్లా జెఎసి చైర్మన్ మాధవరపు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శన చేశారు. అమలాపురం గడియార స్తంభం సెంటర్ నందు జేఏసీ లోని అన్ని ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్స్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం రాష్ట్ర పరిశీలకులు గా విచ్చేసిన రాష్ట్ర అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్ఎస్ హరనాథ్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా గా తీసుకు వచ్చిన నూతన చట్టాలు రద్దు చేయాలని ప్రభుత్వం ఉద్యోగ వ్యతిరేక విధానాలు రద్దు చేయాలని కార్మికులకు కనీస పెంక్షన్ రూ9 వేలు అమలు చెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో జిల్లా కార్యదర్శి కోలా కృష్ణ, సహధ్యక్షులు మొటూరి రామారావు, ఉపాధ్యక్షులు చిక్కాల సూర్యారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ డి రామకృష్ణ, ఎస్ కృష్ణవేణి, అమలాపురం తాలూకా అధ్యక్షులు నిమ్మకాయల శ్రీనివాస్, కార్యదర్శి కోదండ రామయ్య, రామచంద్రాపురం తాలూకా అధ్యక్షులు వైవిఎస్ నాయుడు, కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు, కొత్తపేట తాలూకా అధ్యక్షులు వై సురేష్, కార్యదర్శి కృష్ణమూర్తి, ముమ్మిడివరం తాలూకా అధ్యక్షులు సిహెచ్ దొరబాబు, కార్యదర్శి బి రాజేష్, అమలాపురం పెన్షన్ యూనియన్ అధ్యక్షులు సాయి వరప్రసాద్, జిల్లా సెక్రటరీ కే కే వి నాయుడు, సిఐటియు ప్రతినిధి కారెం వెంకటేశ్వరరావు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## శివాలయం పునర్నిర్మాణానికి గబ్బర్ సింగ్ బ్రదర్స్ 10 లక్షలు విరాళం....



ఆత్రేయపురం, ఫిబ్రవరి, 12,(ప్రభాత వార్త) ఆత్రేయపురం గ్రామంలో అతి పురాతన ఆలయమైన శ్రీ బాల త్రిపుర సుందరి సమేత రాజరాజేశ్వరి ఆలయ పునఃనిర్మాణానికి రూ, 5లక్షలు, రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల్ స్వామి ఆలయ పునః నిర్మాణానికి రూ, 5లక్షలు చప్పున ఆత్రేయపురం గ్రామానికి చెందిన ముదునూరి సోమరాజు, బంగారమ్మ , దంపతులు, వారి కుమారులు,వాడపల్లి దేవస్థాన చైర్మెన్ ముదునూరి వెంకటరాజు, (గబ్బర్ సింగ్) సొసైటీ అధ్యక్షులు, ముదునూరి రామభద్రరాజు లు ,రూ 10 లక్షల నగదును ఆయా ఆలయాల చైర్మెన్లు, వేగేశ్న ప్రసాద్ రాజు, పులవర్తి కాశి,లకు విరాళంగా అందజేశారు.

## నిమ్మకు నీరెత్తని డీఈవో, ఎంఈఓ



పి.గన్నవరం ఫిబ్రవరి 12 (ప్రభాతవార్త) నరేంద్రపురం గ్రామపంచాయితీ పరిధి లో గల బూరుగుగుంట గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాల భవనం మూసివేసి సుమారు 10 నెలలు గడుస్తున్న కొత్త భవన నిర్మాణానికి కానీ మరమ్మతులు కానీ ఇప్పటివరకు ప్రభుత్వ అధికారులు. డి ఈ ఓ. ఎమ్ ఈ ఓ.కానీ మండల అధికారులు కానీ ఎవ్వరు. స్పందించడం లేదు.. విద్యార్థుల అందరికీ దగ్గర్లో ఉన్న అంగన్వాడి కేంద్రం లో క్లాస్ లు నిర్వహిస్తున్నారు అక్కడ కూడా ఒక్కటే గది వుండటం వల్ల అంగన్వాడి పిల్లలు, పాఠశాల విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు చాలా ఇబ్బంది. పడుతున్నారు..విద్యార్థులు తల్లిదండ్రులు కూడా మండల అధికారులకు మరియు ప్రభుత్వ అధికారులు దృష్టికి తీసుకువెళ్లిన ఇప్పటివరకు ఎవ్వరు. స్పందించడం లేదు..కావున దయచేసి ప్రభుత్వ అధికారులు మరియు భవన నిర్మాణానికి పునాదులు వెయ్యాలి అని మనవి.

## పొగాకు, మాదకద్రవ్యాల వాడక వ్యతిరేక ర్యాలీ..




అంబాజీపేట, ఫిబ్రవరి 12, (ప్రభాతవార్త): మాదక ద్రవ్యాల వ్యసనానికి బానిసలై నిండు జీవితాలను పాడుచేసుకోవద్దని, మాదకద్రవ్యాల వాడకం వల్ల అనారోగ్యంతో పాటు కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందని పిహెచ్సీ వైద్యురాలు వి. గౌతమి,ఎస్సై కె.చిరంజీవిలు అన్నారు. అంబాజీపేట పిఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పొగాకు, మాదక ద్రవ్యాల వాడక వ్యతిరేక ర్యాలీని ఈగిల్ క్లబ్ సభ్యులు,పోలీస్, వైద్య, ఆరోగ్యశాఖల సమన్వయంతో హెచ్ఎం కడలి సాయిరామ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై చిరంజీవి మాట్లాడుతూ ఎవరైనా డ్రగ్స్ వాడినట్లయితే కఠినమైన చర్యలతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. డ్రగ్స్ వాడటం వల్ల బంగారు భవిష్యత్ నాశనమవుతుందని, అంతేకాకుండా కుటుంబం చిన్నాభిన్నం అవుతుందని విద్యార్థులకు వివరించారు. వైద్యాధికారిణి గౌతమి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ డ్రగ్స్కు దూరంగా ఉండి శ్రద్ధగా చదువుకోవాలన్నారు. చెడు స్నేహాలు వదులుకోవాలని సూచించారు.అనంతరం విద్యార్థులు ప్లకార్డులు చేతపట్టి స్థానిక నాలుగు రోడ్ల సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి,మానవహారం చేపట్టారు. మాదకద్రవ్యాలు వద్దు..జీవితమే ముద్దు.. అంటూ నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో ఈగల్ క్లబ్ కన్వీనర్ కుంపట్ల ఆదిలక్ష్మి, పీఈటీ ఉమామహేశ్వరరావు, ఉపాధ్యాయులు,ఆరోగ్య సిబ్బంది,విద్యార్థులు,వివిధ పాఠశాలల ఈగిల్ క్లబ్ కన్వీనర్లు పాల్గొన్నారు.

## శివలింగాన్ని దర్శించుకున్న వైకాపా నాయకులు



గోపాలపురం ,ఫిబ్రవరి 12 (:ప్రభాతవార్త ): గోపాలపురం మండలంలోని కొవ్వూరు పాడు గ్రామానికి చెందిన శివ భక్తుడు చిలక సాయి తేజ ఎంతో ఓర్పుతో నేర్పుతో చిల్లర నాణేలతో తయారుచేసినధన శివలింగం ఉభయగోదావరి జిల్లాల్లో మంచి ప్రాచుర్యం పొందింది .వివిధప్రాంతాల నుంచి శివ భక్తులు వచ్చి ధన శివలింగాన్ని దర్శించుకుంటున్నారు. ఇందులో భాగంగానే గోపాలపురం మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నియోజకవర్గ ఇన్చార్జ్, మాజీ హోంమంత్రి తానేటి వనిత తో పాటు గోపాలపురం మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామానికి వెళ్లి ధన శివలింగాన్ని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజించారు రూ లక్ష 25 వేల విలువైన 80 వేల నాణేలతో ఈ శివలింగాన్ని తయారుచేసినట్లు భక్తుడు సాయి తేజ తెలిపారు .ఈనెల 14వ తేదీనపట్టిసం వీరభద్రేశ్వర స్వామి దేవాలయంలో ప్రతిష్టించనున్నట్లు తెలిపారు అదేవిధంగా వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసి దర్శించుకున్న శబరిమలై అయ్యప్ప స్వామి దేవాలయాన్ని కూడా తయారుచేసినట్లు ఆ భక్తుడు సాయి తేజ వైకాపా నాయకులకు చూపించడం జరిగింది భక్తి ప్రపత్తులతో శివలింగాన్ని తయారుచేసిన సాయి తేజ ను మాజీ హోంమంత్రి వనిత తో పాటు వైకాపా నాయకులు దు సాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించిఅభినందించారు .ఈ కార్యక్రమంలో గోపాలపురం మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెలగా శ్రీరామమూర్తి సీనియర్ నాయకులు కె రామ్మోహన్ రెడ్డి సాలివేణు లక్ష్మణ స్వామి ఎంపీటీసీ సభ్యులు సూరిబాబు గల్లా చిన్న శ్రీను ఎస్కే మస్తాన్ బాబా తదితరనాయకులు , కార్యకర్తలు ఉన్నారు.

## భీమేశ్వర స్వామిని దర్శించిన రిటైర్డ్ డీజీపీ

రామచంద్రపురం,ఫిబ్రవరి 12(ప్రభాతవార్త): తెలంగాణ రాష్ట్ర రిటైర్డ్ డీజీపీ జితేంద్ర దంపతులు గురువారం ద్రాక్షారామ శ్రీ మాణిక్యాంబ సమేత శ్రీ భీమేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు.స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయ పురోహితులు దంపతులకు వేద ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందించారు.

## మామిడికుదురులో కార్మికుల నిరసన



మామిడికుదురు.ఫిబ్రవరి 12(ప్రభాతవార్త) అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్ల యూనియన్, కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు జాతీయ సార్వత్రిక సమ్మెలో భాగంగా కార్మికులు గురువారం నిరసన తెలిపారు. స్థానిక మండల రెవిన్యూ కార్యాలయం వద్ద తమ డిమాండ్ల పరిష్కారం కోరుతూ నినాదాలు చేశారు.నాలుగు కార్మిక కోడ్ లు,వాటి నియమాలను రద్దు చేయాలన్నారు.అంగన్వాడీ వర్కర్లు,హెల్పర్లు,మినీ కార్మిలను కార్మికులుగా గుర్తించి ట్రేడ్ యూనియన్ హక్కులు కల్పించాలన్నారు.వీటితో పాటు 17 డిమాండ్లను ప్రస్థావించారు.ఈ ధర్నా కార్యక్రమంలో ఎన్.అన్నపూర్ణ,కె.వి.లక్ష్మి,జి.సూర్యకాంతం,బి.సరోజిని తదితరులు పాల్గొన్నారు.

## ఇరువురికి రూ పది వేలు చొప్పున జరిమానా

కొత్తపేట, ఫిబ్రవరి 12, (ప్రభాతవార్త) మద్యం సేవించి వాహనం నడిపిన ఇరువురి వ్యక్తులకు రూ పది వేలు చొప్పున జరిమానా [illegible] కొత్తపేట [illegible] స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ [illegible] రూ పది వేలు చొప్పున జరిమానా [illegible]

## అంగన్వాడీ,ఆశాలను గ్రేడ్ 3 ఉద్యోగులుగా గుర్తించాలి..




అంబాజీపేట,ఫిబ్రవరి 12,(ప్రభాతవార్త): అంగన్వాడీ,ఆశా కార్యకర్తలను గ్రేడ్ 3 ఉద్యోగులుగా గుర్తించాలని సిఐటియు మండల కన్వీనర్ బి.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. [illegible] అంగన్వాడీ, ఆశ, మిడ్ డే మీల్స్, [illegible] ఉపాధి హామీ [illegible] ధర్నా చేపట్టారు. [illegible] కార్యక్రమంలో [illegible] తదితరులు పాల్గొన్నారు.

## కనీస వేతన చట్టాన్ని అమలు చెయ్యాలి



గోపాలపురం ,ఫిబ్రవరి 12 (ప్రభాతవార్త): కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని లేబర్ కోడ్లను రద్దు చేయాలని [illegible] దేశవ్యాప్త సమ్మె గోపాలపురంలో విజయవంతమైంది. [illegible] కార్యక్రమంలో [illegible] అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మండలంలో దోమల రాజ్యం .. ఫాగింగ్ లేక ప్రజల్లో ఆందోళన



దేవరపల్లి, ఫిబ్రవరి 12 (ప్రభాతవార్త): మండలంలోని గ్రామాలలో దోమల బెడద [illegible] ఫాగింగ్ [illegible]

## దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతం



గండేపల్లి ఫిబ్రవరి 12(ప్రభాతవార్త): గండేపల్లి మండలం లో సిఐటియు [illegible] తహసిల్దార్ కార్యాలయం వద్ద సమ్మె నిర్వహించి [illegible] వర్కర్స్ ఐన అంగన్వాడీ,ఆశా,మిడ్ డే మీల్ తదితర పథకాలలో పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని. 12గంటలు పని విధానాన్ని రద్దుచేయాలని. ఉపాధిహామీ పథకానికి బడ్జెట్ పెంచాలని .రైతు పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని.కాంటాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ సమ్మె నిర్వహించి అనంతరం ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేశారు.ఈ సమ్మెలో భవన నిర్మాణ రంగం అంగన్వాడీ ఆశా నుండి వైవి రాజేశ్వరి,జ్యోతి,వెంకటలక్ష్మి, శాంతి,విష్ణులక్ష్మి, మహేష్ శ్రీను తాళ్లూరు,మల్లేపల్లి గ్రామలనుండి బిల్డింగ్ రంగాల నుండి కార్మికులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

## ఏలేశ్వరం లేబర్ కోడ్ రద్దు కోరుతూ సార్వత్రిక సమ్మె




ఏలేశ్వరం, ఫిబ్రవరి 12, (ప్రభాతవార్త) దేశవ్యాప్త సమ్మె నిమిత్తం ఏలేశ్వరంలో భారీ ఎత్తున స్థానిక లారీ వర్కర్స్ యూనియన్ మరిడమ్మ తల్లి గుడి వద్ద నుండి మెయిన్ రోడ్డు మీదుగా సుమారు 500 మంది పైగా అంగన్వాడి ఆశ భావన నిర్మాణ కార్మికులు విఏవో డ్వాక్రా యానిమేటర్స్ ఉపాదా ఆమె కూలీలు తదితరులు ఊరేగింపుగా బయలుదేరి మెయిన్ రోడ్ మీదుగా బాలాజీ తో ఒక సెంటర్లో మానవహారంగా ఏర్పడి సుమారు గంటసేపు రాస్తారోకో నిర్వహించారు ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పాకలపాటి సోమరాజు అంగన్వాడీ యూనియన్ లీడర్ కాకరపల్లి సునీత మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని 12 గంటల పని విధానాన్ని రద్దుచేసి ఎనిమిది గంటల పని విధానాన్ని కొనసాగించాలని కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ కార్మికులను స్కీం వర్కర్లను రెగ్యులర్ చేయాలని కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు ఏఐసీసీ టి యు నాయకులు ఏగుపాటి అర్జున్ రావు పాల్గొని కేంద్ర ప్రభుత్వ విధానాలను విమర్శించారు ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నాయకులు అధికారు పాల్గొని ప్రసంగించారు ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పిల్ల రాంబాబు ఆశా వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ గంగాభవాని రాస్తా రోకోలో పాల్గొని తమ హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ,రాంబాబు మాస్టారు ,జట్ల సోమరాజు గారు ,గుర్రం వీరి బాబు, ఎన్ అమరావతి ,రౌతు సత్యనారాయణ, మాస రామారావు , జి రాజేశ్వరి, అడపా శివ ,భవన నిర్మాణ సంఘం ప్రెసిడెంట్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ముగ్గురు పేకాట రాయుళ్లు అరెస్టు



జగ్గంపేట ఫిబ్రవరి 12 (ప్రభాత వార్త ) జగ్గంపేట మండలం మర్రిపాక గ్రామ శివారులో పేకాట రాయుళ్ళ మీద దాడి చేసి 3 మంది పేకాట రాయుళ్లను జగ్గంపేట ఎస్సై రఘునందనరావు, సిబ్బంది అరెస్ట్ చేసి 6200/– రూపాయలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. జగ్గంపేట, కిర్లంపూడి, గండేపల్లి మండలం లలో ఎవరైనా జూద క్రీడలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జగ్గంపేట సి ఐ వై ఆర్ కే తెలియజేశారు.

## నెల్లిపూడి, కొంతంగి, ఎస్ జగ్గంపేట రోడ్డుకు 4.07 కోట్లు మంజూరు

### ప్రత్తిపాడు మార్కెట్ కమిటీ ఛైర్మన్ బద్ధి మణి రామారావు



శంఖవరం ఫిబ్రవరి 12 ప్రభాతవార్త ప్రత్తిపాడు నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల రహదార్లకు ప్రత్తిపాడు నియోజకవర్గం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ కృషితో మహర్దశ పట్టిందని ప్రత్తిపాడు మార్కెట్ కమిటి ఛైర్మన్ బద్ధి మణి రామారావు అన్నారు. శంఖవరం మండలంలోని నెల్లిపూడి గ్రామంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి బద్ధి వెంకటరమణ గృహంలో గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించగా, పార్టీ మండల అధ్యక్షుడు బద్ధి రామారావు, ఓలేటి లక్ష్మీనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ నెల్లిపూడి నుండి కొంతంగి మీదుగా ఎస్ జగ్గంపేటకు తారు రోడ్డు నిర్మాణానికి 4కోట్ల 7 లక్షల రూపాయలు ఎన్ఆర్ఇజిఎస్ నిధుల మంజూరుకు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ విశేష కృషి చేసారన్నారు. ఈ రహదారికి రూపురేకలు 1996లో మాజీ ఎమ్మెల్యే, దివంగత నేత పర్వత సుబ్బారావు గారు పాలనలో అంకురార్పణ జరిగిందని, నాటి నుండి నేటి వరకు ఈ ప్రాంత ప్రజల సుదీర్ఘ పోరాటం, గ్రామీణ ప్రాంతాలపై ఎమ్మెల్యే సత్యప్రభకు గల అభిమానంతో నిధులు మంజూరు చేసారన్నారు. కూటమి ప్రభుత్వం, కూటమి నేతల ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. త్వరలోనే ఎమ్మెల్యే సత్యప్రభ చేతుల మీదుగా ఈ రహదారికి శంఖుస్థాపన చేయడం జరుగుతుందన్నారు. రాబోయే రోజుల్లోనూ ప్రజలు ఎమ్మెల్యే సత్యప్రభకు విజయమందించి, కూటమికే పట్టం కడతారన్నారు. అనంతరం ఎమ్మెల్యే సత్యప్రభ చిత్రపటానికి కూటమి నేతలు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బిజెపి నేత అదట్రా వెంకన్న దొర, టిడిపి నేతలు బద్ధి రామకృష్ణ, అధట్రా అప్పన్నబాబు, గరికపాటి రామగోవింద్, సైపురెడ్డి సూరిబాబు, మురళీ తదితరులు పాల్గొన్నారు.

## స్నాచింగ్ కేసులో ముద్దాయి కి రిమాండ్




గండేపల్లి ఫిబ్రవరి 12(ప్రభాతవార్త): గండేపల్లి మండలం మురారి గ్రామ శివారు పోలవరం కాలువ ప్రాంతంలో జనవరి 22 వ తేదీ రాత్రి గండేపల్లి మండలం మురారి గ్రామ శివారు పోలవరం కాలువ ప్రాంతంలో స్నాచింగ్ కు పాల్పడిన కేసులో ముద్దాయి తూర్పుగోన గూడెంకు చెందిన మహేష్ అను ఆసామిని అరెస్ట్ చేసినట్లు గండేపల్లి ఎస్ఐ శివ నాగబాబు తెలిపారు.ముద్దాయి వద్ద నుండి చోరీ సొత్తు సుమారు 1 లక్ష రూపాయలు విలువ గల దానిని స్వాధీనం చేసుకుని ముద్దాయిని పెద్దాపురం కోర్టు లో ప్రొడ్యూస్ చేయగా 14 రోజుల పాటు రిమాండ్ విధించినట్లు తెలిపారు. ముద్దాయిని పెద్దాపురం సబ్ జైలుకు తరలించడం జరిగిందని కేసు నమోదు చేసిన ఎస్ఐ శివ నాగబాబు తెలిపారు.

## భద్రావతి సమేత భావన ఋషి కళ్యాణం



కె.గంగవరం, ఫిబ్రవరి 12, (ప్రభాతవార్త): గంగవరం మండలం అమజూరు గ్రామంలో వేంచేసినటువంటి భద్రావతి సమేత భావన ఋషి కళ్యాణం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు ఆలయ కమిటీ వారు తెలియజేశారు. ఆలయం పచ్చని తోరణాలతో, పూలదండలతో అలంకరించగా, అభిషేకాలు పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం లోకకళ్యాణార్థం శాంతి హోమం, స్వామి వారి సంబరం జరిగినట్లు తెలియజేశారు. శుక్రవారం జరగబోయే వారి అన్న సమారాధన కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులు కావాల్సిందిగా ఆలయ కమిటీ వారు కోరుతున్నారు.

## తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీల ధర్నా



శంఖవరం ఫిబ్రవరి 12 ప్రభాతవార్త కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు 2026 ఫిబ్రవరి 12న దేశవ్యాప్తంగా నిర్వహించిన సార్వత్రిక సమ్మెలో భాగంగా శంఖవరం మండలంలోని అంగన్వాడీలు, విఓఏలు తహశిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు . ఈ సందర్భంగా అంగన్వాడి నేతలు మాట్లాడుతూ కార్మిక హక్కులకు భంగం కలిగించే విధంగా ఉన్న లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని, ప్రజా సంపదను కాపాడాలని కోరారు. కనీస వేతనం లేకుండా అధిక పనిభారం మోస్తున్న విఓఏలకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ ధర్నాలో మండలానికి చెందిన విఓఏలు పెద్ద సంఖ్యలో పాల్గొని, తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశిల్దార్కు అందజేశారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించకపోతే భవిష్యత్తులో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని సంఘ నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్వాడి నేతలు జి బుల్లెమ్మ, వై ఆశాజ్యోతి, ఆశ వర్కర్లు, లీడర్లు పి మంగా, జి నూకరత్నం, విఓఏల నేతలు డి రత్నం, టి మణి, మధ్యాహ్న భోజన పథకం నేతలు కె సింహాద్రి, దారాలమ్మ తదితరులు పాల్గొన్నారు

## విజయవంతమైన సార్వత్రిక సమ్మె

### సిఐటియు ఆధ్వర్యంలో కదం తొక్కిన ఉద్యోగ,కార్మిక సంఘాలు



కాట్రేనికోన ఫిబ్రవరి 12,( ప్రభాతవార్త ) దేశవ్యాప్తంగా చేపట్టిన సార్వత్రిక సమ్మెలో భాగంగా కాట్రేనికోనలో సిఐటియు, ఉద్యోగ, కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ శాంతియుతంగా విజయవంతమైంది. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థలు బంద్ కారణంగా మూతపడ్డాయి. సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ, ఆశా, పారిశుద్ధ్య కార్మికులు, కార్మిక సంఘాలు, మధ్యాహ్న భోజన కార్మికులు, భవన కార్మికులు, ఆటో కార్మికులు,ప్రజా సంఘాలు .ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, ఉద్యోగుల, కార్మికుల హక్కులను కాపాడాలని కోరుతూ మావుళ్ళమ్మ గుడి నుండి తాసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లివిన తాసిల్దార్ కు వినత పత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు నేత విత్తనాల రాంబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని, ఉపాధి హామీ పథకం 200 రోజులకు పొడిగించాలని అన్నారు. అదేవిధంగా అంగన్వాడి, మధ్యాహ్న భోజన కార్మికులను ఆశా వర్కర్స్ ని రెగ్యులైజ్ చేసి వారికి జీతభత్యాలు సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ ఉపాధి పథకం లో మహాత్మా గాంధీ పేరు తొలగించడాన్ని ఆయన వ్యతిరేకించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ఎన్ గోపి , భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి మోహన్ రావు, జిల్లా కమిటీ అంగనవాడి సభ్యురాలు మల్లేశ్వరి, ఈ సత్తిబాబు, కృష్ణ ప్రసాద్, వెంకటేష్, సుంకర బుజ్జి, వరసాల చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక అవసరాల గల పిల్లల కల్చరల్ ప్రోగ్రామ్స్



అమలాపురం కలెక్టరేట్, ఫిబ్రవరి 12,ప్రభాతవార్త డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబేద్కర్ భవనం నందు జిల్లా స్థాయి ప్రత్యేక అవసరాల గల పిల్లల రెండవ రోజు ఆర్ట్ అండ్ కల్చరల్ ప్రోగ్రామ్స్ నిర్వ హించబడింది. ఈ ప్రోగ్రాంకు ముఖ్య అతిథిగా డిప్యూటీ కలెక్టర్ ఏ.పీ.సి సమగ్ర శిక్ష డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోన సీమ జిల్లా జి. మమ్మీ అతిథులుగా ఈ కార్యక్ర మానికి హాజరయ్యి రెండో రోజు ప్రోగ్రామ్ను ప్రారం భించారు. రెండవ రోజు ప్రోగ్రాంలో భాగంగా ఫ్యాన్సీ డ్రెస్సు లు, ఆర్ట్ మరియు మట్టితో బొమ్మ లను తయారు చేసే కార్యక్రమాన్ని ప్రారంభించా రు.జిల్లాలో ఉన్న అన్ని మండలాల్లో గల భవిత కేంద్రం నుంచి ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నా రు. భారతదేశ స్వతంత్ర సమరయోధుల వేషధా రణలో పిల్లలు ఆకర్షణీ యంగా నిలవడం జరిగిం ది .అలాగే భారతదేశ వివిధ రాష్ట్రాల సాంప్రదా య దుస్తుల్లో ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ఆకర్షణీయంగా నిలవడం జరిగింది అలాగే భారత దేశంలో వివిధ కళలకు సంబంధించిన కళాకారుల యొక్క రూపాలను ప్రద ర్శించడం జరిగింది. అంతేకాకుండా తబలా, డ్రమ్స్, కీబోర్డ్ వంటి పరికరాలతో వారిలో ఉన్న టాలెంట్ను ప్రతిభను చాటు చెప్పారు. డ్రాయింగ్ లో భాగంగా మొక్కల ప్రాము ఖ్యం నీటి ప్రాముఖ్యంపై చక్కటి చిత్రలేఖనం అలాగే దేశ నాయకుల చిత్రలేఖనా లను పెన్సిల్ ఆర్ట్ ద్వారా గీయడం జరిగింది. అలాగే మట్టితో వినాయకుడిని తయారు చేయటం మట్టితో ఆకర్షణీయ బొమ్మలను తయారు చేయడం జరిగింది. కార్యక్రమంలో అమలాపు రం సహిత విద్య ఐ కోఆర్డి నేటర్ ఎం.వి.వి.స త్యనారాయణ,సీ.ఎం.ఓ సుబ్ర హ్మ ణ్యం ,ఏ.పీ.వో, జి.సి.డి.ఓ భీమారావు, ఎఫ్. ఏ .ఓ రంగారావు, జిల్లాలో అన్ని మండలాల్లో భవిత కేంద్రంలో గల ప్రత్యేక ఉపాధ్యాయులు, ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు

## తాళ్లూరు వెంకటేశ్వరస్వామి ఆలయ పునరుద్ధరణకు నిధులు కేటాయించాలి

### గోదావరి పుష్కరాల నిధుల నుండి ఐదు కోట్లు మంజూరు చేయాలని సి.ఎం.కి వినతి



గండేపల్లి ఫిబ్రవరి 12(ప్రభాతవార్త):గండేపల్లి మండలం తాళ్లూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానం (జీయన్న) ఆలయ పునరుద్ధరణకు గోదావరి పుష్కరాల నిధుల నుండి 5 కోట్లు మంజూరు చేయాలని వెలగపూడి సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు ఆలయ ధర్మాధికారి జనార్ధన వరాహ నరసింహమూర్తి ఆచార్యులు, దేవస్థానం చైర్మన్ దాపర్తి సీతారామయ్య వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు 700 సంవత్సరాలు పూర్వం నుండి భక్తులకు దర్శనమిస్తున్న శ్రీ వెంకటేశ్వర స్వామి (జీయన్న మఠం) అభివృద్ధికి ఆలయం పునరుద్ధరణకు గోదావరి పుష్కరాలు 2027 నిధుల నుండి ఐదు కోట్ల రూపాయలు కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతి పత్రం అందజేశామని సెక్రటరియేట్లో ఆమోదముద్ర వేసి తీసుకున్నారని వారి తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధీనంలో 80 సంవత్సరాలుగా ఉన్నప్పటికీ ఎక్కడా మరమ్మతులు కానీ పునరుద్ధరణకు కానీ నోచుకోలేదని 12 సంవత్సరాల క్రితం అప్పటి పుష్కరాల నిధుల నుండి పది లక్షల రూపాయలు ముఖ్యమంత్రి చంద్రబాబు కేటాయించడంతో చిన్నచిన్న పనులు పూర్తి చేసుకున్నామని మళ్లీ ఇప్పుడు పుష్కరాలు రావడం ప్రాచీన ఆలయాల పునరుద్ధరణకు నిధులు కేటాయించడంతో అందులో తాళ్లూరు వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని కూడా చేర్చి నిధులు కేటాయించి ఆలయ పునరుద్ధరణకు సహకరించాలని కోరామని చైర్మన్ దాపర్తి సీతారామయ్య, నరసింహమూర్తి ఆచార్యులు తెలిపారు.

## కాంగ్రెస్ మళ్ళీ రావాలి... జెడి శీలం



అమలాపురం, పిబ్రవరి12, ప్రభాతవార్త కాంగ్రెస్ పార్టీ మళ్ళీ అదికారం లోకి రావాలని ,వాడవాడలా కాంగ్రెస్ పతాకాలు రెపరెప లాడాలని కేంద్ర మాజీ మంత్రి, సీడబ్ల్యూసీ సభ్యుడు జేడీ శీలం పేర్కొన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని అదికారంలోకి తీసుకువచ్చేందుకు అన్ని రకాలుగా పాటు పడతామని అన్నారు.అందుకు నియోజక వర్గ స్థాయిలో కో ఆర్డినేషన్ కమిటీలు, గ్రామ స్థాయిలో 12మందితో కమిటీలు ఏర్పాటు చెయ్యండని చెప్పారు.పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, కొత్తూరి శ్రీనివాస్, వంటెద్దు బాబి, అయితాబత్తుల సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

## అనుమానస్పద స్థితిలో పశువులు మృతి - రాజకీయ కక్షలకు మూగజీవాలు బలి



కాకినాడ రూరల్, ఫిబ్రవరి 12 (ప్రభాతవార్త): కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురం గ్రామంలో గురువారం నాలుగు పశువులు అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం సంచలనంగా మారింది. పశువుల యజమాని పెదపాటి శ్రీరామకృష్ణ కుమార్తె సత్య దుర్గ తెలిపిన వివరాల ప్రకారం బుధవారం రాత్రి శివాలయం వద్ద రాబోయే శివరాత్రి ఉత్సవాల లో భాగంగా సర్పంచ్ బెజవాడ వీర వెంకట సత్యనారాయణ వర్గీయులకు, జనసేన పార్టీ అధ్యక్షుడు మాదారపు తాతాజీ వర్గీయులకు జరిగిన ఘర్షణ జరిగిందని, ఆ సమయంలో అక్కడ ఉన్న మా నాన్న తమ్ముడు పై సర్పంచి వర్గీయులు దాడి చేశారని అనంతరం తిమ్మాపురం పోలీస్ స్టేషన్ లో కేసు నమో చేయడం జరిగిందని అన్నారు. ఈ నేపథ్యంలో గురువారం తెల్లవారుజామున న గుర్తు తెలియని వ్యక్తులు పశువుల దాణ లో విషం కలిపి ఉన్నట్లు అనుమానాలు ఉన్నాయని మీడియాకు తెలిపారు. మృతి చెందిన పశువులను పశు వైద్యులు సురేష్ బాబు, సుధా పరిశీలించి పోస్టుమార్టం టెస్టులకు పంపిన తరువాత పూర్తి సమాచారం అందించడం జరుగుతుందన్నారు. అనంతరం పెదపాటి దుర్గ మీడియాతో మాట్లాడుతూ గ్రామంలో కొంతమంది మాపై కక్ష తో మూగజీవాలను బలి చేయడం చాలా దారుణమని ఆవేదన చెందారు. రూరల్ సీఐ చైతన్య కృష్ణ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి బాధితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తిమ్మాపురం ఎస్సై వై. గణేష్ గ్రామంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సర్పంచ్ బెజవాడ అరెస్ట్... తిమ్మాపురం గ్రామంలో శివరాత్రి పురస్కరించుకుని శివాలయంలో పూజా కార్యక్రమం వివాదంలో గ్రామ సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, ఆయన అనుచరులను బుధవారం రాత్రి అరెస్టు చేశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులు మాదారపు తాతాజీ మాట్లాడుతూ కేసు దర్యాప్తు చేసి నిందితులను అదుపులోకి తీసుకుని కఠినంగా శిక్షించాలని అధికారులను కోరారు.

## మహాశివరాత్రి ఏర్పాట్ల పరిశీలన



సీతానగరం, ఫిబ్రవరి 12, (ప్రభాత వార్త) : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వంగలపూడి నుండి పట్టిసీమ వీరభద్రస్వామి ఆలయానికి వెళ్లే భక్తుల కోసం చేస్తున్న ఏర్పాట్లను ఏఆర్ అడిషనల్ ఎస్పీ చెంచురెడ్డి, నార్త్ జోన్ డీఎస్పీ శ్రీకాంత్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులకు, ట్రాక్టర్ డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. డిఎస్పి శ్రీకాంత్ మాట్లాడుతూ భక్తుల భద్రత దృష్ట్యా ప్రభుత్వం అనుమతించిన వంగలపూడి రేవు నుండి మాత్రమే పట్టిసీమకు వెళ్లాలని సూచించారు. అనుమతి లేని ఇతర ప్రాంతాల నుండి ప్రయాణించడం ప్రమాదకరమన్నారు. భక్తుల భద్రత దృష్ట్యా ట్రాక్టర్ డ్రైవర్లకు ఎప్పటికప్పుడు బ్రీత్ అనలైజర్ ద్వారా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోరుకొండ సీఐ ఎస్ వివిఎస్ మూర్తి, తహసిల్దార్ ఏ.శ్రీనివాస్, ఎస్సై రామ్ కుమార్, ఎంపీడీవో భారతి, గద్దె సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మె నిరసన ర్యాలీ



రామచంద్రపురం,ఫిబ్రవరి 12(ప్రభాతవార్త):కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్లను వీబీ జీ రామ్ జీ సహా పలు చట్టాలను రద్దు చేయాలని,కార్మిక సంక్షేమ బోర్డును పూర్తిగా అమలు చేయాలని కోరుతూ రామచంద్రపురంలో భారీ ర్యాలీ చేపట్టారు.మార్కెట్ సెంటర్ సెంటర్ నుంచి రాజగోపాల్ సెంటర్ వరకు సిఐటియూ, ఏఐటీయూసీ, ఐఎఫ్టియూ, ఐఎఫ్టియూ2, ఆర్టీసీ,రైతు కూలీ సంఘం,ఎమ్మార్పీఎస్ సంఘాల ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు.అనంతరం పాత బస్టాండ్ వద్ద సభ నిర్వహించారు.నేతలు మాట్లాడుతూ దేశంలోని కార్మికుల శ్రమను ఇతర దేశాలకు దోచి పెట్టాలని కేంద్ర ప్రభుత్వం చూస్తుందన్నారు.దీనిలో భాగంగానే కేంద్ర ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించి నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొచ్చిందన్నారు.యాజమాన్యాలకు మేలు చేయడమే ఈ లేబర్ కోడ్ల ఉద్దేశం అని సంఘాల నేతలు పేర్కొన్నారు...

## సైబర్ నేరగాళ్లు ఉచ్చులో టీచర్

అమలాపురం,(మామిడికుదురు) పిబ్రవరి12, ప్రభాతవార్త. సైబర్ నేరాలపై అప్రమత్తంగా వుండాలని ఎంత అవగాహన కల్పిస్తున్నా నిత్యం ఎక్కడో చోట సైబర్ నేరగాళ్ల లో చిక్కుతూనే ఉన్నారు.తాజాగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మగటపల్లిలో ప్రభుత్వ పాఠశాల లో అసిస్టెంట్ టీచర్ గా పని చేస్తున్న కొనుకు శ్రీనివాస్ నేరగాళ్లకు చిక్కి 24.50లక్షల రూపాయలు పోగొట్టుకున్నారు. ఫేస్బుక్లో లింకును క్లిక్ చేయడంతో కేంద్ర ప్రభుత్వ స్కీం పేరుతో సైబర్ వలవిసిరారు. రూ 10 లక్షల విలువైన ఎరువులు పంపిస్తున్నామని లాభాలు పొందవచ్చునని సైబర్నేరగాళ్లు గ నమ్మించారు. లారీ ద్వారా సరుకు వస్తుందని అది అమ్మితే భారీ మొత్తంలో లాభాలు వస్తాయని సొల్లు కబుర్లు చెప్పారు. అది నమ్మిన శ్రీనివాస్ ఫోన్ పే ద్వారా పలుమార్లు నేరగాళ్లకు 24.50 లక్షల రూపాయలు బదిలీ చేశారు.అయినా ఇంకా డబ్బులు పంపించమనడంతో అప్పటికి శ్రీనివాస్ అనుమానంతో సైబర్ క్రైం1930నెంబర్ కి సమాచారం ఇచ్చారు.వెంటనే స్పందించిన బ్యాంక్ అధికారులు రూ 9 లక్షల రూపాయలు ఫ్రీజ్ చేశారు. దీనిపై నగరం ఎస్సై చైతన్యకుమార్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దీనిపై సీఐ రుద్రరాజు చేపట్టారు

## మల్లేపల్లిలో లేగ దూడల ప్రదర్శన



గండేపల్లి ఫిబ్రవరి 12(ప్రభాతవార్త): గండేపల్లి మండలం మల్లేపల్లిలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో లేగ దూడల ప్రదర్శన కార్యక్రమం ఫెర్టిలిటీ క్యాంపును గ్రామ సర్పంచ్ దొమ్మా శ్రీను ప్రారంబించారు.ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు తెలగరెడ్డి భద్రరావు,కొల్లి త్రిమూర్తులు,జనసేన నాయకులు రామకుర్తి నరసింహం ఇతర ప్రజా ప్రతినిధులు, పాడి రైతులు పాల్గునగా ముఖ్య అతిధిగా పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ అంబేద్కర్,డాక్టర్. కళ్యాణి,మండల పశు వైద్యాధికారి శ్రీనివాస్,మురారి పశు వైద్యాధికారిణి కృష్ణవేణి , నాయకంపల్లి పశు వైద్యాధికారి శ్యాంప్రసాద్ పశుసంవర్ధక శాఖ సచివాలయ సిబ్బంది, గోపాలమిత్రలు పాల్గొన్నారు. లేగ దూడల ప్రదర్శన కార్యక్రమంలో రైతులు 40 దూడలను ప్రదర్శించడం జరిగింది ఈ ప్రదర్శనలో మొదటి విజేతగా వల్లభశెట్టి రాజు గేదే దూడను, రెండవ బహుమతి గా గాలిదేరి రాంబాబుకి చెందిన గేదే దూడ, మూడవ బహుమతి వనపర్తి వెంకటేష్ గేదే దూడగాను ఎంపిక చేయడం జరిగింది. ప్రదర్శనలో పాల్గొన్న రైతులందరికీ బహుమతులు అందజేయడం జరిగింది ఫెర్టిలిటీ క్యాంపు లో భాగంగా 45 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్స చూడి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణి చేశారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps